అపరాధ పరిశోధన

రూ. 6 | ఫిబ్రవరి '85



Blank Page

సంపుటి: 40
సంచిక: 1

PARA ASHOK KUMAR

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 72 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

ఫిబ్రవరి, 1985

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

తొలిమాట

నమస్కారము. గతనెల 'హోమ్ డెలివరీ'లో వచ్చిన మార్పులకు అనేకమంది పాఠకులు తమ హర్షాన్ని వెలిబుచ్చారు. ఈ నెలలో కొత్త సభ్యులు కూడా ఎక్కువగానే చేరారు. అయితే ఏడాది పైకము ఒకేసారి కట్టలేక కొద్దిమంది తమ సభ్యత్వాన్ని విరమించుకున్నారు కూడా. 'రికార్డెడ్ డెలివరీ'లో ఎవరికీ విశ్వాసం కనబడలేదు. కొందరు పత్రికలపై ఇచ్చే కన్సెషన్ తీసేసి, కాపీలు రిజిష్టరు పోస్టులో పంపమని వ్రాశారు.

పాఠకుల అభిప్రాయాలన్నీ క్రోడీకరించి 'హోమ్ డెలివరీ'లో కొద్దిపాటి మార్పులు చేశాము. సభ్యులకు పత్రికలు 'రికార్డెడ్ డెలివరీ'లో కాకుండా బుక్ పోస్టులోగాని, అవసరమైన వారికి రిజిష్టరు పోస్టులోగాని పంపుతాము. ఎవరికైనా ఏ కారణంగానైన 25వ తేదీలోపల కాపీలు చేరకపోతే మాకు తెలియజేయండి. సభ్యులకు ఖచ్చితంగా పత్రికలు అందజేసే బాధ్యత మాది.

పోతే, నెల నెలా వి.పి. ద్వారానే కాపీలు కావాలనుకునే వారికి ఆ ఏర్పాటు కూడా చేశాము. అయితే వి.పి. చార్జీలన్నీ వారే భరించాల్సి వుంటుంది. ప్రతి నెలా వి.పి. చార్జీలతోసహా మొత్తం రు. 15/-లకు వి.పి. పంపబడుతుంది. నెల నెలా వి.పి. కావాలనుకునేవారు ఆ విషయం స్పష్టంగా తెలియజేయాలి

పాఠకుల సౌకర్యార్థం చేసిన యీ మార్పులు అందరికీ నచ్చుతాయని ఆశిస్తున్నాము. సెలవా మరి —

మీ

— శ్యామ దామోదర్ రెడ్డి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. వీరనారి—చంద్రశేఖర అజాద్
17. దొంగకు కృతజ్ఞతలు—ప్రతాప రవిశంకర్
30. పిశాచాల వైకుంఠం—కె. వి. రమణ
46. శవంలో చైతన్యం—పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ
58. లక్షకోసం—పి. అరుణ
69. సినీ నటి హత్య—శివరామ్
88. 25 లక్షలు—శ్యాంబాబు
104. 5 నెంబరు బూట్లు—కె.వి. రమణ
124. నూతన సంవత్సరం—టెంపోరావ్
141. పన్నీరు సుందరి—ఓరుగంటి పద్మావతి
152. నన్ను చంపినవాడు—'విపంచి'
168. హోటల్ సవేరా—మిస్ కె. మధుబాల
178. మానభంగం—పునర్వస్

నవలలు (సప్లిమెంట్)

3. చావు నోటీసు—కాశీభట్ల భానుమూర్తి
44. విషవలయం—టెంపోరావ్
84. దెయ్యాల ప్రతీకారం—స్వరూప్
148. మంత్రి కూతురు—మిస్ కె. మధుబాల
187. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇంకా— ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!

పరనారి

చంద్రశేఖర అజాద్

రాత్రి రెండు గంటలవుతోంది.

రజనికెందుకో మెలకువ వచ్చింది. బెడ్‌లైట్ కూడా వెలగటంలేదు. కరెంట్ పోయిందా అనుకొంది. లేదు. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు, శరీరాన్ని తాకుతున్న గాలీ ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయ్.

ప్రక్క మంచంమీద ఆదమరిచి నిద్రపోతున్నాడు ప్రభాకరరావు. ఓ వేళ ఆయన బెడ్ లైట్ తీసేసి పడుకున్నారేమో అనుకొంది. అయినా ఆయన మాత్రం బెడ్ లైట్ యెందుకు ఆర్పుతాడు అనుకొంది తిరిగి.

ఎందుకో వెన్నులోనుండి చలి మొదలయినట్లయింది.

అంటే.... అంటే....

ఎవరయినా దొంగ యింటిలో ప్రవేశించలేదు గదా!

ఆ అనుమానం రాగానే నిలువెల్లా వణికిపోయింది.

అదే జరిగుంటుంది. ఇప్పుడెలా?

చెవులు రిక్కించింది. కళ్ళు గట్టిగా మూసుకొని మనస్సును కేంద్రీకరించింది.

నిశ్శబ్దం.... దారుణమైన నిశ్శబ్దం ...

అంతలోనే మరో అనుమానం.

బల్బు మాడిపోయి వుండవచ్చు కదా!

ఈ ఆలోచన రావటంతో తిరిగి కొంత రిలాక్సేషన్. సాధారణంగా అలాగే జరగొచ్చు. ఈ రోజు తనెందుకంత కంగారుపడుతూంది? రాత్రి చదివిన దెయ్యాల నవల గుర్తొచ్చింది. అయినా ఆయన్ని లేపిచూడమంటే సరిపోతుంది.

ఆయన్ని పిలవాలా?

ప్రయత్నించింది.

నోరు పెగలటం లేదు.

"ఏ....ఏ ..." బలవంతంగా మూలుగు మాత్రం నోటినుండి బయటకు వచ్చింది.

"ధన్" మంటూ శబ్దం!

దొర్లుకుంటూ వెళుతున్న సవ్వడి.

"ఏమండీ" ఉలిక్కిపడుతూ అరిచింది రజని.

6

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ప్రభాకరరావు.

"ఏమిటే అరిచావ్?"

"మీకేం శబ్దం వినిపించలేదా?"

"వినిపించింది."

"మరేమిటని అడుగుతారే, లేచి చూడక."

"నీ అరుపే వినిపించింది. అడిగానుగా."

"ఏడ్చినట్లే వుంది."

"సర్లే పడుకో."

"అది కాదయ్యా మొగుడా....అంది" రజని విసుగ్గా.

"భార్యామణీ! అర్ధరాత్రి సరసాలేమిటే!"

"సరసం కాదండి. ఇంట్లో ఏదో పడిన శబ్దం అయింది."

"ఎలుకలు పడేసుంటాయిలే!"

"బెడ్ లైట్ వెలగటం లేదు."

"బల్బు మాడిపోయి వుంటుంది."

"మీరోసారి లేచి చూడండి."

"నీకు మతిపోయి వుంటుంది."

రజనికి ఒక్కసారిగా వళ్ళు మండింది.

"మీకు ఎగతాళిగా వుందా?"

"ఎగతాళేమిటి! ఝాన్సీలక్ష్మి, జమునలాంటి వీర వనితవి. అంత అనుమానం వస్తే లేచి వెళ్ళి చూడొచ్చుగా" అన్నాడు ప్రక్కకు తిరుగుతూ.

రజనికి పట్టుదల ఏర్పడింది.

అయినా ఏ మూలో బిక్కు బిక్కు మంటూనే వుంది.

"హూ" అనుకుంటూ మెల్లగా మంచంమీది నుండి దిగింది. భయం భయంగానే లేచివెళ్ళి స్విచ్ బోర్డు తడివింది చీకట్లో. బెడ్ లైట్ స్విచ్ మీద చేయి వేసింది. అది

ఆఫ్ చేయబడి వుంది.

"తీసేసి హరికథలు చెబుతున్నారు" గొణుక్కుంటూ ఆన్ చేసింది.

లైట్ వెలగలేదు!

ఏం జరిగింది? బల్బు మాడిందా? అయితే స్విచ్ ఆఫ్ చేసిందెవరు?

అన్నీ ప్రశ్నలే!

వెంటనే ప్రక్కన స్విచ్ ఆన్ చేసింది.

ఒక్కసారిగా కళ్ళు జిగేల్ మన్నాయి.

గదంతా వెలుగు పరుచుకొంది.

"ఏమిటే గొడవ" అంటూ ప్రభాకరరావు లేచి కూర్చున్నాడు కళ్ళు నులుముకుంటూ.

రజని బెడ్‌లైట్ వంక చూపి చిన్నగా అరిచింది.

"అరే బల్బులేదు."

ప్రభాకరరావు కూడా చూశాడు.

"ఏమయింది" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"రాత్రి కూడా చూశాను" అన్నాడు ప్రభాకరరావు.

"మీకు మంచినీళ్ళిచ్చాక నేనే లైట్ తీసి బెడ్‌లైట్ వేశాను."

"మరెలా మాయం అయింది?"

"అందుకే చెబుతున్నాను. ఇందాక ఏదో పడిన శబ్దం" అంటూ ప్రక్కకు తిరిగింది.

ఆ దృశ్యం చూసేసరికి కెవ్వున అరిచి కూలిపోయింది రజని.

2

రజని మెల్లగా కళ్ళు తెరిచింది. ముందు ఇంటి కప్పు కనపడింది. సీలింగ్‌కు కొట్టిన సున్నం తెల్లగా మెరుస్తో

తెల్లవారబోతోంది. ప్రభాకరరావు హాయిగా నిద్రపోతు న్నాడు. కొన్ని క్షణాలపాటు ఏమీ అర్థంకాలేదు ఏదో అనుమానం వచ్చి బెడ్‌లైట్‌కేసి చూసింది.

బెడ్‌లైట్ వెలుగుతోంది!

రజని నిర్ఘాంత పోయింది.

రాత్రి జరిగిన విషయం గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నించింది

తనకెందుకో మెలకువ రావటం.... గదంతా చీకటిగా వుండటం... ఏదో పడిన శబ్దం... తను ఆయన్ను లేపటం లైట్ స్విచ్ నొక్కగానే....గోడనానుకొని తన వంకే చూస్తున్న ఆగంతకుడు! చేతిలో కత్తి!

అప్పుడేగా తను అరిచి విరుచుకు పడిపోయింది. తిరిగి మెలకువవస్తే అంతా మామూలుగానే ఉంది. ఏం జరిగింది? ఇది కలా? నిజమా? ప్రస్తుతం తను వాస్తవంలోనే వుంది. అయితే ఎందుకలా జరిగింది?

నిద్రపోతున్న భర్తను చూసింది. మెల్లగా మంచం దిగి అతన్ని లేపింది.

"ఏమిటి అప్పుడే తెల్లారిపోయిందా?" అంటూ లేచి కూర్చున్నాడు ప్రభాకరరావు.

"ఏవండి" అంది రజని.

ఏమిటన్నట్లు చూశాడు ప్రభాకరరావు.

"రాత్రి మీరు నేను లేపితే లేచారు కదూ...."

"లేపలేదే....కలొచ్చిందా?"

"లేదండి. మీరు లేచారు. అర్ధరాత్రి సరాసాలేమి టన్నారు. నేనేమో ఏదో చప్పుడయిందంటే ఝాన్సీలక్ష్మి లాంటి దానివి చూడన్నారు. తీరా లైటువేసి చూస్తే గోడకానుకొన్న మనిషిని చూసి అరిచాను. ఆ తర్వాత

యిప్పుడే మెలకువ వచ్చింది ”

“ఎక్కడ పడ్డావ్?”

“అక్కడే” అంది చూపిస్తూ.

“మరి మంచంమీది కెలా వచ్చావ్.”

“ఏమో ”

“ఆ మనిషి గుర్తుఉంటాయిగా.”

“ఏమో.”

“చూద్దాం వుండు” అంటూ లేచాడు.

గోడదాకా వెళ్ళి పరిశీలించి “ఏం లేవు” అన్నాడు ప్రభాకరరావు.

“అవునూ.... రాత్రి ఏదో పడిపోయిందన్నావు కదూ” అడిగాడు ప్రభాకరరావు.

“అవును.”

ఇల్లంతా వెతికాడు. యెక్కడి వస్తువులక్కడే వున్నాయి.

“ఏమిటో అయోమయంగా వుంది” అంది రజని.

“దొంగనుకుంటావా” అన్నాడు ప్రభాకరరావు.

“అయ్యుండొచ్చు.”

“మరయితే యింట్లోవేం పోలేదుగా.”

“ఏమోనండి. చేతిలో కత్తుంది.”

“పొడవటానికి వచ్చాడేమో.”

“ఎవర్ని.”

“నిన్నో, నన్నో.”

“ఎందుకు చంపుతారంటారు.”

“ఎందుకయినా చంపొచ్చు. పగవుంటే చంపొచ్చు. మనం యెవరికైనా అన్యాయం చేస్తే చంపొచ్చు. మనం యేమీ చేయకపోయినా మన కుటుంబంలో యెవ్వరైనా

ఎవరికైనా ద్రోహంచేస్తే మొత్తం ఆ ఇంట్లో వారందరి మీద పగబట్టి చంపేయొచ్చు. సస్పెన్స్....సస్పెన్స్... ఈ జీవితమే వెధవ సస్పెన్స్" చిరాగ్గా అన్నాడు ప్రభాకర రావు.

"పిచ్చివాడేమోనండి" అంది రజని.

"విశాఖపట్టణం నుండొచ్చాడంటావా."

"ఇప్పుడు చాలాచోట్ల వున్నాయి కదండి."

"అందుకు కాదే. ఫోన్ చేద్దామని. వాడెలా వున్నాడో చెప్పు."

"ఉండండి గుర్తుకు తెచ్చుకుంటాను" అంది.

"నువ్వు కల్లో చూసుంటావు" అన్నాడు తిరిగి ప్రభాకరరావు.

"లేదండి నా కళ్ళారా చూశాను."

"కలలో కూడా కళ్ళారే చూస్తారు."

తలుపుమీద చప్పుడయింది.

"వాడే అయ్యుంటాడు" అంది రజని భయంగా.

"డోంటాక్ నాన్సెన్స్ ... పాలమనిషి అయి వుంటాడు."

"మీరే తలుపు తెరవండి."

"గిన్నయినా తెస్తావా."

రజని గిన్నెకోసం వెళ్ళింది. ప్రభాకరరావు తలుపు తీశాక పాలవాడు నవ్వాడు.

"ఏంటీరోజు అయ్యగారు ముందు లేచారు" అన్నాడు.

రజనికి పాలవాడి మాటలు వినగానే ధైర్యం వచ్చి గిన్నె తెచ్చింది. పాలు పోయించుకున్నాక తిరిగి తలుపు వేసింది.

"అంత భయమయితే ఎలా?" అన్నాడు ప్రభాకరరావు.

"మీరు భలేవారే. రాత్రి దృశ్యం మీరు చూస్తేనా?" అంది రజని.

"ఏం దృశ్యం చూశావో....ఇప్పుడు నేను తలుపులు తెరవగానే వాడే నా గుండెల్లో పొడిస్తే...రక్తం కారుతూ నేను కూలిపోతే ఏం చేసేదానివి."

"ఏమిటండి ఆ మాటలు."

"ఏం చేస్తావని అడుగుతున్నాను."

"ఏం చేయటమేమిటండి. ఇంక నా నోటివెంట మాట వస్తుందా? వెర్రికేకవేసి విరుచుకు పడిపోయేదాన్ని" అంది రజని.

"అంతేగాని నన్ను హాస్పిటల్‌కు చేర్చటంలాంటివేం చెయ్యవు."

"ఇంకేం హాస్పిటలండి. మీరే ఓపిక చేసుకొని నన్ను చేర్పించాలి" అంది రజని.

ప్రభాకరరావు నవ్వాడు.

సంభాషణ మారటంతో తాత్కాలికంగా రజని ఆ దృశ్యం గురించి మరిచిపోయింది.

"వేడి కాఫీ అయినా యివ్వు. ఇందాకట్నుండి తల తింటున్నావ్" అన్నాడు ప్రభాకరరావు.

"మొఖం కడగండి" అంది స్టవ్ దగ్గరకెళ్తూ.

3

ప్రభాకరరావు మొఖం కడిగాక వేడి వేడి కాఫీ త్రాగాడు. నరాల్లో కొంత చలనం కలిగినట్లుంది.

తిరిగి తలుపుమీద చప్పుడయింది.

"వెళ్ళి చూడు"

"మీరే వెళ్ళండి" ప్రతిమాలుతూ అంది రజని.

"అదేమిటే....నేను బయటికి వెళ్ళివచ్చినా త...

తీసేట్టులేవే."

తలుపుమీద తిరిగి శబ్దం వినపడింది.

"చూడండి బాబూ ముందు" అంది.

"బాగానే వుంది" అంటూ లేచి వెళ్ళాడు. తలుపు తీశాక

"ఓ నువ్వా రా రా" అంటూ ఆహ్వానించాడు.

ఎవరా అని తొంగిచూపిన రజని కళ్ళు మెరిశాయి.

"ఏమయ్యా పొద్దున్నే వచ్చావు" అన్నాడు ప్రభాకర రావు.

"ముందు మా అన్నయ్యని లోనికి రానిస్తారా:" అంది రజని.

"ఓహో నీ బలం పెరిగిందిగా" అన్నాడు ప్రభాకరరావు.

"అమ్మవాళ్ళు బాగున్నారా అన్నయ్యా" అడిగింది రజని.

"అంతా బాగున్నారు. నీ ఫ్రెండ్స్ శ్యామల....కవిత నిన్ను అడిగినట్లు చెప్పమన్నారు."

"ముందు మొఖం కడుక్కోవోయీ బావమరిదీ" అన్నాడూ ప్రభాకరరావు.

"ఏమిటి స్పెషల్ బావగారూ....ఏమా టిఫిన్."

"మీ చెల్లాయి ఓ సస్పెన్స్ థ్రిల్లర్‌ని తినిపిస్తుంది."

"అయితే వుండండి" అంటూ బ్యాగ్‌లోనుండి బ్రష్ తీసి, పేస్టు వేసుకొని, టవల్ భుజంమీద వేసుకెళ్ళాడు. పది నిమిషాల్లో వచ్చాక రజని కాఫీ అందించింది.

"నువ్వు రెడీనా" అన్నాడు ప్రభాకరరావు.

"ఏమిటో చెప్పండి."

"రజనీ స్టార్ట్" అన్నాడు ప్రభాకరరావు.

"మీకు వేళాకోళంగా వుంది" అంటూ రజని రాత్రి

జరిగింది తన అన్నయ్యకు అంతా పూసగుచ్చినట్లుగా చెప్పింది.

"అది కల అంటున్నారు మీ బావ".

"చెల్లాయ్.... నీ కథలో రీజనింగ్.... రీజనింగ్ లేదు."

"కథేమిటన్నాయ్" అంది అయోమయంగా రజని.

"అదేనమ్మా కల."

"అయితే నాది కాలేనంటావా?" అంది రజని.

"కాదు."

"మరేమిటి?"

"అది తర్వాత చెబుతాను. గోడకానుకున్న మనిషి ఎంత యెత్తుంటాడు."

"ఏమో మరి."

"నా అంత వుంటాడా?"

"వుండొచ్చు. పెద్ద మీసాలు.... గడ్డం.... చేతిలో మెరిసే కత్తి."

"సర్లే. ఈ విషయం కొంత ఆలోచిస్తే తేలిపోతుంది. మీ ఫ్రెండ్స్ ఫొటోలు వీక్లీలో పడ్డాయి చూశావా?"

"చూశాను" అంది రజని సంతోషంగా.

"మీ చెల్లాయి ఫోటో కూడా పడింది" అన్నాడు ప్రభాకరరావు.

"ఎప్పుడు?"

"మూడు వారాలవుతుంది."

"ఏదీ చూపించండి."

"మీ చెల్లాయినే అడుగు. వుందో ఫోటో కట్టించడానికి పంపిందో."

"పొండి" అంది సిగ్గుగా రజని.

"నేను చెబుతా వినవయ్యా. నేనే 'జమునయితే' శీరిక.

నేనే జమునయితే ఆర్.ఎస్.టీల్ని పట్టించేదాకా నిద్రపోను. వారు కోర్టుకో తప్పించుకోకుండా వారి నేరాల్ని క్షుణ్ణంగా పరిశోధించి, వాళ్ళని బంధించి, చట్టానికి అప్ప గించి కారాగారంలోకి త్రోయిస్తాను. ఆడది అబల కాదు సబలని నిరూపిస్తాను—అంటూ దంచేసింది."

"హియర్....హియర్...చెల్లాయ్ మీ ఫ్రెండ్స్ కూడా ఇలానే రాశారే" అన్నాడు రజని అన్న.

"ఏం రాశారోగాని బామ్మర్దీ....నువు నాకో రీజనింగ్ ఇవ్వాలి"

"చెప్పండి బావగారూ."

"మీ చెల్లాయి ఆగంతకుడ్ని చూసి కెవ్వున అరిచి పడి పోయానని చెప్పింది. ఎవడన్నా కత్తిపట్టుకొచ్చి నన్ను పొడిస్తే కేకేసి పడిపోతుందటగాని బంధించదట. మరా పత్రిక్కి ఎందుకలా రాసింది?"

"సింపుల్ బావగారూ....ప్రచురింపబడటానికి."

"అదే నేను కెవ్వున అరిచి పడిపోతానని రాయొచ్చుగా."

"గొప్పకోసం బావగారూ...."

"గొప్పకోసమే రాసింది పోనీ పిరికితనం అనుకుందాం. అసలు మీ చెల్లాయి రాసిందే 'పరిశోధిస్తా'నని....అదే మైనా వుందా?"

"ఆలోచించాలి బావగారూ"

"అదే వుంటే దీంట్లో సస్పెన్స్ ఎప్పుడో విడిపోయేది. దొంగగాని హంతకుడుగాని ఈ ఇంట్లోకి ఎలా రాగలడు? డైరెక్టుగా నువ్వొచ్చినట్లు రావాలి. వేరే మార్గంలేదు. ఆ తలుపులు విరగ్గొడితేగాని ఎవరయినా లోపలకు రావటానికి వీలుకాదు. అలాంటప్పుడు ఎలా వస్తాడు?"

"ఎలా వస్తాడు?"

"ఐ డోంట్ వాంట్ ప్రశ్నలు....రీజనింగ్ కావాలి."

"మంత్రాలద్వారా రాకూడదా" అంది రజని.

"చూశావా మీ చెల్లాయి షార్ప్‌నెస్.... అరెస్‌టీల్ని బంధిస్తానన్నట్లుగా"

రజని ఉక్రోషంగా భర్తను చూసింది.

"తలుపులు బద్దలుకొట్టకుండా మనిషి ఎలా లోపలకు రాగలడు? అంటే ఎవరైనా తీయాలి? తీయటానికెవరెవరికి అవకాశంవుంది? ఇది ఆలోచించాలి. అసలు నీ ఆలోచనే మొదట ఆ రూమ్లో లేదుకాబట్టి ఇంకేవిషయం ఆలోచించ లేవు. గోడ ప్రక్కన వ్యక్తిని చూడగానే కెవ్వున అరిచి పడిపోకుండా ఓ క్షణం చూస్తే అర్థమయ్యేది అదంతా మేకప్ అని. అది మేకప్ అనగానే మీ అన్నయ్య నాటకాలు వేస్తాడని కూడా నీకు గుర్తొచ్చేది" అన్నాడు ప్రభాకరరావు.

"అంటే....అంటే" అంది ఆశ్చర్యంగా రజని.

"చెప్పు"

"రాత్రి నాది కలకాదు"

"ఆ విషయం నీకు మరోసంగతి గుర్తున్నా అర్థమయ్యేది"

"ఏమిటది?"

"ఈ రోజు ఏప్రిల్ ఫస్ట్"

"అరే" అంటూ ఆశ్చర్యపోయింది రజని. కొంచెం సేపయ్యాక అంది.

"నిజమే. ఇందాకట్నుండి, అన్నయ్య మీరూ హింట్స్ ఇస్తున్నా నేను గ్రహించలేదు. అయితే ఒక్క విషయం చెప్పాలి మీ ఇద్దరూ. మీరు ప్రాక్టికల్ జోక్ వేయటం మూలంగా నిజంగానే నా గుండె ఆగిపోతే ఏం చేసేవారు.

అన్నగా నన్ను సపోర్టు చెయ్యవలసిన వాడివి....ఈ నాటకాని కెందు కొప్పుకున్నావు? సరైన రీజనింగ్ కావాలి."

"మొదట నేను పత్రికలో తమరు రాసేక తమరి ధైర్యాన్ని పరీక్షించాలని నాకనిపించి బామ్మర్దిగారితో మాట్లాడి సహకరించమని కోరాను. నీ చేతిలో మేం ఓడిపోతామనుకున్నాం. నువ్వే మాత్రం ధైర్యంగా వున్నా మేం ఓడిపోయేవాళ్ళం. అప్పుడు నువ్వు నిజంగానే జమున వయ్యేదానివి" అన్నాడు ప్రభాకరరావు.

"నా చెల్లాయితో మీరు ఓడిపోగలరని బావతో పందెం కట్టాను. నువ్వేమో ఇలా చేశావ్"

"అంటే నువ్వు నిన్ననే వచ్చావా"

"వచ్చాను తల్లీ. నువ్వు పడిపోయాక మా కంగారు చూడాలి"

"అయినా మీ డ్రామా కంటిన్యూ చేశారుగా" హాయిగా నవ్వింది రజని. □

భద్రత?



దొంగకు కృతజ్ఞతలు

ప్రతాప రవిశంకర్

ఆ మేడలోని ఓ గదిలో పదిరోజుల క్రితం అద్దెకుదిగాను.

మా ఇంటామె పేరు మల్లికాంబ. ఆమె వయసు అరవై కి దగ్గర్లో వుంటుంది. ఆమె కొంచెం నల్లగా, ఓ మాదిరి పొడుగ్గా వుంటుంది.

అంత మేడలోనూ ఆమె ఒంటరిగానే వుంటోంది. ఆమె గురించిన ఇతర వివరాలు ఏవీ కూడా నాకు అప్పట్లో తెలీవు.

ఇక నా గురించిన వివరాల విషయానికివస్తే - నాకూ నా వాళ్ళని చెప్పుకోటానికి ఎవ్వరూ లేరు—ఓ ఆర్నెల్ల క్రితం వరకు నాకో మేనత్త బతికివుండేది. ఆమె గుండె పోటుతో నన్ను వదిలేసి మరో లోకానికి వెళ్ళిపోయింది. అప్పుడు నేను ఒంటరివాడ్ని ఐపోయాను.

నేను ఏదో ఒక ఉద్యోగంచేసి ఆమెను పోషించాలని, సుఖపెట్టాలని అనుకున్నాను. కాని, నాకు ఉద్యోగం రాక ముందే ఆమె చనిపోయింది. అక్కడే వుంటే ఆమె జ్ఞాపకాలు నన్ను వెంటాడితాయని ఆ వూర్ని వదిలి ఉద్యోగం కోసం వచ్చేశాను.

ఆ మేడలో చేరటానికి ఐదురోజుల ముందు నాకో ఇంక్ తయారుచేసే కంపెనీలో రిప్రజెంటేటివ్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగానికి జీతం తక్కువేకాని అమ్మకాలపై కొంత కమీషన్ కూడా ఇస్తామన్నారు. ఆ కంపెనీలో నాకు ఒక నెల జీతాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారు నా కోరిక మీద.

ఆ మేడలో ఓ గది నాకు ఇవ్వటానికి ముందు ఆమె నా గురించిన వివరాలు అడిగింది—అన్నీ చెప్పాను.

అద్దెకూడా ఆ గదికి చాలా తక్కువ. కేవలం నా మీది జాలితోనే ఆమె ఆ గది నాకు ఇచ్చిందని తెలుసుకున్నాను. ఎందుకంటే ఆ మేడలో ఇంకా కొన్ని గదులు ఖాళీగానే వున్నాయి. వాటిని కూడా అద్దెకిచ్చి డబ్బు సంపాదించాలనే ఆశ ఆమెలో లేదని గ్రహించాను.

సరిగ్గా ఆ మేడలో నేను దిగిన పదిరోజుల తర్వాత

ఆమెకు ఓ రాత్రి బాగా జ్వరం వచ్చింది. అప్పుడు ఆమె చిన్నగా కలవరించటం విని నేనే ఆమె దగ్గరకు వెళ్లాను. ఆ సమయంలో నేనొక్కడినే వున్నాను. అసలు ఆమెకు తోడుగా మరెవ్వరూ వుండరుకదా?

వళ్ళుపట్టుకు చూశాను. కాలిపోతోన్నది. వెంటనే బయటకువచ్చి ఆ వీధి చివర్లోవున్న ఓ డాక్టర్‌ని పిలుచుకు వచ్చాను. ఆయన ఆమెను పరీక్షచేసి హై టెంపరేచర్‌లో వుందని ఓ ఇంజెక్షన్ ఇచ్చి మరికొన్ని మందులు తనదగ్గర వున్నవే ఇచ్చి వాటని తెల్లవారేవరకూ వాడుతూవుండమని చెప్పాడు.

డాక్టరు వెళ్లిన తర్వాత నేనామె దగ్గరే కూర్చున్నాను. డాక్టరు చెప్పినట్టుగానే ఆ మందులను తెల్లవారే వరకూ ఆమెకు ఇస్తూనే వున్నాను. ఆ రాత్రంతా నాకు నిద్రలేదు.

తెల్లవారిన తర్వాత ఆమెకు స్పృహవచ్చింది. ఆమె బెడ్ పక్కనే వున్న మందులను, కూర్చున్న నన్ను చూసి ఆశ్చర్యపడింది. సరిగ్గా అప్పుడే డాక్టర్ కూడా వచ్చాడు. విష్ చేశాను.

విషయమేమిటని డాక్టర్ని అడిగింది ఆమె—

రాత్రి ఆమె నిద్రలో వుండగానే హై టెంపరేచర్ వచ్చిన విషయం ఆ తర్వాత జరిగినదంతా ఆమెతో వివరంగా చెప్పి చివరకు నేను తెల్లవార్లూ ఆయన చెప్పి నట్టుగా మందులను వాడబట్టే ఆమె బతికిందని అన్నాడు.

వింతగా నన్ను చూసిందామె— ఆమె కళ్ళనిండా నా పట్ల కృతజ్ఞతే నాకు కనిపించింది. పక్కనే బల్లమీద కూర్చునివున్న నా చేతిని అందుకుని ఆప్యాయంగా నొక్కింది.

డాక్టర్ ఆమెకు మరో ఇంజెక్షన్ ఇచ్చి మరికొన్ని

మందులు ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన తర్వాత నే నామెకు బాగా దగ్గరివాడినయ్యాను. ఆమెకీ నాకూ మధ్య కనుపించని బంధమేదో అల్లుకుపోయింది.

ఆమెకు ఎవ్వరూ లేరు.

నాకు లే రెవ్వరూ—

ఇద్దరం ఒంటరివాళ్ళమే—

ఆ రోజునించీ ఆ మేడలో ఆ ఒక్క గదే నాదికాదు. ఆ మేడలోని అన్ని గదులూ నావే, అంతటి స్వతంత్రాన్ని ఆమె నా కిచ్చింది

అప్పుడే ఆమె గురించిన మరికొన్ని వివరాలు నాకు తెలిశాయి.

కొన్ని రోజుల క్రితం వరకు ఆమెకు తోడుగా ఆమె వయసుకలిగిన ఒకామె వుండేది. ఆమె చనిపోయిన తర్వాత ఒంటరిగానే వుండిపోయింది.

ఆమెకు కొంతమంది దూరపు బంధువులు వున్నారు. వాళ్ళంతా ఆమె ఒంటరిది కాబట్టి ఆమె ఆస్తిని తన్నుకు పోవటానికి కపటప్రేమను నటిస్తూ ఆమె దగ్గరచేరే ప్రయత్నాలు ఎన్నో చేశారుట. కాని ఆమె వాళ్ళందర్నీ తరిమి ఒంటరిగానే వుంటోంది.

ఆ స్తి గురించిన వివరాలు ఇవి:

ఆ వూళ్ళోనే మరో మేడవుంది. ఆ మేడ కూడా కనీసం పదిలక్షల ఖరీదు చేస్తుంది. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఐదు లక్షల క్యాష్ వుంది. మరో నాలుగు లక్షలు విలువచేసే బంగారం కూడా వుంది. ఇప్పుడు వుంటున్న మేడ విలువను కూడా లెక్కలోకి తీసుకుంటే ఆమె దాదాపు ముప్పయ్‌లక్షల రూపాయలకు యజమాని....

మైగాడ్ —

నా గుండె పగిలింది.

కాని ఆశ్చర్యం—ఆమె అంతటి ఆస్తిపరురాలిగా కనిపించదు. సాధారణమైన మనిషిలాగే అగుపడుతుంది.

ఇప్పుడు ఆమె అవసరాలన్నింటినీ నేనే చూస్తున్నాను. ఏ విషయం గురించీ ఆమె బయటకు వెళ్ళటంలేదు. ఆ వూళ్ళోనే వున్న మేడలోని కొంత భాగాన్ని రీమోడల్ చేయించవలసి వచ్చింది. ఆమె ఆ వర్కును పూర్తిగా నాకే అప్పగించింది. అందు గురించి అవసరమైన డబ్బును నాకిచ్చింది.

నేను పూర్తి చేసిన తర్వాత ఆ పని ఆమెకు ఎంతో తృప్తి కలిగించింది. అందుకు ఖర్చయిన డబ్బు గురించి ఆమెకు లెక్కలుచెప్పి మిగిలిన డబ్బును ఆమె కిచ్చాను.

అప్పుడు ఆమె నన్ను మెచ్చుకుంది.

నేను ఈ పనుల్లో మునిగిపోయి నా ఉద్యోగాన్ని అశ్రద్ధ చెయ్యటంతో వాళ్ళు నన్ను ఆ ఉద్యోగంలోనించి తొలగిస్తున్నట్టుగా తెలియజేశారు.

నా ఉద్యోగం పోయినట్టుగా ఆమెకు చెప్పాను. అందుకు నన్ను బాధపడవద్దని చెప్పిందామె. కొంత డబ్బుతో నాచేత ఏదైనా మంచి బిజినెస్ చేయిస్తానని అన్నది.

ఓహ్. నా సంతోషం అమోఘం.

ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

అంతేకాదు. ఆ తర్వాత మరికొన్ని రోజులకే మా ఇద్దరి మధ్య మరింత అనుబంధం పెరిగిపోయింది. ఇప్పుడామె ప్రతి చిన్న విషయాన్నీ నాతో చెబుతోన్నది.

ఒకరోజు ఆమె సంతోషంతో. నా గుండె పగిలిపోయే

వార్తను చెప్పింది.

అదేమిటంటే—

ఆమె తనకున్న ఆస్తినంతా ఇంతకు ముందు కొన్ని ధర్మసంస్థలకీ, దేవాలయాలకీ రాసెయ్యాలని అనుకుందిట. కాని ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మార్చుకుని ఆ ఆస్తికి నన్ను వారసుడ్ని చెయ్యాలనే ఆలోచనలో వుందిట.

నాకైతే— ఆ వార్త విన్నప్పుడు ఒక్కసారిగా గాల్లో తేలిపోయి ఆకాశాన్నంటుకున్నట్టు అనిపించింది. ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాను. ఆమె ఔదార్యాన్ని, మంచి హృదయాన్ని పొగిడాను.

ఆమె నన్ను ఓ మంచి బిజినెస్ గురించి ఆలోచించమన్నది. నేను కొన్నిరోజులు ఆలోచించి ఆమెకు ఓ బిజినెస్ గురించి చెప్పాను.

అది—ఎన్నో రకాల కంపెనీలు తయారుచేసే రకరకాల ప్రోడక్ట్సుకు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూషన్ తీసుకోవటం.

ఈ డిస్ట్రిబ్యూటింగ్ ఏజెన్సీ మంచి లాభసాటి అయిన బిజినెస్ అని నాకు అనిపించింది.

ఆమె అందుకు ఒప్పుకుంది.

ఆ ఏజెన్సీకి 'మల్లికాంబ డిస్ట్రిబ్యూటింగ్ ఏజెన్సీస్' అని పేరు పెట్టాలని నిర్ణయించుకున్నాను.

ఇక ఆ ప్రయత్నాలు మొదలుపెట్టాలని అనుకుంటున్నప్పుడే ఆమె దినపత్రికలో ఓ టూరిస్టు కంపెనీవాళ్ళ ప్రకటన చూపింది. పదిరోజుల పాటు ఏవో కొన్ని యాత్రా స్థలాలకు ఆ కంపెనీ కార్లు రెండు రోజుల్లో బయల్దేరుతున్నాయట.

ఆమె కూడా యాత్రాస్థలాలు చూడటానికి బయల్దేరి వెళ్ళిపోయింది. ఇక ఆమె తిరిగి వచ్చేది పదిరోజుల

తర్వాత, ఆమె తిరిగి రాగానే నా బిజినెస్‌కు అవసరమైన పనులన్నింటినీ మొదలుపెట్టాలి.

కొన్నాళ్ళలో నేనో లక్షాధికారిననే ఆలోచన వచ్చినప్పుడల్లా నేను భూమ్మీద వున్నట్టుగా అనిపించటంలేదు.

2

పదిరోజులూ గడిచాయి.

ఆమె తిరిగి వచ్చింది. కాని ఒంటిగాకాదు. వెంట ఓ ఇరవైయేళ్ళ యువతితో తిరిగివచ్చింది. ఆ అమ్మాయి అందంగా వుంది. ఆ యువతి పక్కనే మరో ముసలామె కూడా వున్నది.

వాళ్ళిద్దరూ ఎవరో నాకు తెలీదు. కాని ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది కొంచెంసేపు చూసిన తర్వాత—

కొంతసేపటికి ఆమె నాకు ఆ యువతి గురించి చెప్పింది. ఆ యువతి ఆమె తల్లి—అంటే పక్కనేవున్న ఆ ముసలామె—ఆమెకి యాత్రాస్థలంలో వాళ్ళిద్దరూ కలిశారట. ఆ అమ్మాయిని చూడటంతోనే ఆమె నిజంగా షాక్ తిన్నదట. ఎందుకంటే ఆ అమ్మాయి దాదాపు పదమూడేళ్ళ పెరిగి చనిపోయిన తన ఒకే ఒక్క కూతురు చందనలావుందట. ఆ అమ్మాయిని చూస్తుంటే తన కూతురే తిరిగి బతికివచ్చినట్టు ఆమె ఫీలయ్యిందట. అందుకని ఆమె వాళ్ళిద్దరినీ తనతో తీసుకువచ్చిందిట. వాళ్ళకూ నా అనేవాళ్ళు ఎవరూ లేరట.

ఆమె చెప్పినదాన్లో నాకు అసహజంగా ఏదీ అనిపించలేదు. ఎందుకంటే ఆమె చెప్పినట్టుగానే ఆ అమ్మాయి చనిపోయిన ఆమె కూతురులాగే వున్నది పదమూడేళ్ళ వయసులో వున్నప్పుడు తీసిన ఆమె కూతురు ఫోటోను

నేను చూశాను. ఆ అమ్మాయికీ ఈ అమ్మాయికీ బాగా పోలికలు వున్నాయి. ఆ అమ్మాయే తిరిగి పెద్దదైనట్టుగా అనిపించింది. ఎలాంటి సంబంధం లేకుండా ఇద్దరు వ్యక్తులకు అంత దగ్గరి పోలికలు వుండటం నాకు చిత్రంగా తోచింది.

నన్ను ఆ అమ్మాయికి పరిచయం చేసింది. కాని ఆ అమ్మాయి నా గురించి అంతగా ఆసక్తి కనపరచలేదు.

ఇంతకీ ఆ అమ్మాయి పేరు సరిత.

సరిత ఆ మేడలోకి రావటం మొదట్లో నాకు ఉత్సాహాన్ని కలిగించింది—కాని తర్వాత ఆమె సరిత పట్ల చూపుతున్న ప్రగాఢమైన ఆప్యాయతను, ప్రేమను చూస్తుంటే నా మనసులో యేదో బాధగా వున్నట్లు అనిపించింది.

పూర్తిగా తన కూతురే తిరిగి జన్మించినట్టుగా ఆమె భావిస్తోంది. ఎందుకో సరిత ఆ ఇంట్లోకి ప్రవేశించటం నాకు ఇష్టంలేక పోయింది.

ఎందుకో కాదు. అందుకు కారణం నాకు తెలుసు. ఇంతకుముందు ఆమెకు నామీద వున్న ప్రేమ - అనురాగం ఇప్పుడు సరిత మీదకు వెళ్ళిపోతాయి. అప్పుడు ఆ ఇంట్లో నా స్థానం మేమిటి?

చాలా తక్కువ వ్యవధిలోనే నేను భయపడుతున్నట్టుగానే జరిగింది. ఆమె ఒకరోజు నన్ను పిల్చి ఇన్నాళ్ళకు తన హృదయం తల్లి భావంతో పులకించి పోతున్నదనీ, సరిత కారణంగా జీవితంలో తను ఎన్నో యేళ్లుగా అనుభవించిన వెలితిని పూర్తిగా మరచిపోయాననీ చెప్పింది. అంతేకాకుండా ఇంతకుముందు అనుకున్నట్టుగా కాకుండా ఆస్థి విషయంలో ఓ ముఖ్యమైన మార్పుచేసే ఉద్దేశం

వుందని కూడా చెప్పింది.

అదేమిటంటే—

ఆమెకున్న ఆస్తిలో సగభాగం సరితకు ఒక వంతు నాకు మిగిలిన భాగం ఆమెకు.

నాకు ఈసారి బాధతో గుండె ఆగిపోతున్నట్లనిపించింది—సరిత రావటంవల్ల నాకు యెన్ని లక్షలు నష్టమో తెలీగానే.

నా గుండెలనిండా వున్న బాధను, విచారాన్ని ఆమె ముందు బయటపడకుండా దాచుకున్నాను. చిరునవ్వు నటించాను.

బహుశ ఈ విషయాన్ని సరితతో కూడా ఆమె చెప్పి వుండాలి. సరిత నన్ను కేర్ చెయ్యనట్టుగా ప్రవర్తించటం మొదలుపెట్టింది.

సరితలాంటి అందమైన యువతి నన్ను ప్రేమించినా నాకు ఇంత బాధ—దిగులు వుండక పోయేది. కాని అలా కాదుకదా! ఆమె దృష్టిలో నాకు అంతగా ప్రాముఖ్యతలేదు.

ఆమె నాకు ఈ ఆస్తి వ్యవహారం గురించి చెప్పిన తర్వాత నాలో ఆ డిస్ట్రిబ్యూటింగ్ ఏజన్సీ బిజినెస్‌ను ప్రారంభించాలనే కోరిక కూడా తగ్గిపోయింది. నా సొంత ఆస్తిని, కష్టార్జితాన్ని యెవరో బలవంతంగా లాక్కుపోతున్నట్టుగా ఫీలయ్యాను.

తల్చుకుంటే ఆశ్చర్యం కలక్కుండా వుండదు. నిజానికి నేనొక ఒంటరివాడ్ని. అంతేకాదు—పేదవాడ్ని. అలాంటి వాడికి. కొన్ని లక్షల ఆస్తి వస్తున్నా ఇంకా కొంత నాకు రావటం లేదని బాధగా వుంది. ఇదే చిత్రం.

ఐతే ఆమె తన మొత్తం ఆస్తికి నేనే వారసుడినని ముందుగానే నాతో చెప్పకుండా వున్నట్లయితే బావుండేది.

అప్పుడూ నాకు ఇంత బాధ వుండకపోవును.

కాని ఇప్పుడు నా మనసులో ఈ బాధ మెలి తిరుగు తోంది. ఈ విషయాన్ని మరచిపోవటానికి ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది.

సరిత అందం నా కళ్ళముందు కదులుతున్నప్పుడల్లా నాకు పరవశం కలుగుతోంది. కాని తన అందంతో నాకు పరవశాన్ని కలిగించే ఆమే నా శత్రువు అనే విషయం గుర్తుకొచ్చినప్పుడు గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టుగా అనిపిస్తోంది.

ఇప్పుడు నేనేం చెయ్యాలి?

మల్లికాంబ ఉదారంగా ఇవ్వదల్చుకున్నదాన్ని తీసుకొని తృప్తి పొందటమా? లేక—

మొత్తం ఆస్తికీ నేనే వారసుణ్ని అయ్యే మార్గాల గురించి అన్వేషించటమా?

బాగా ఆలోచించాను. కొన్ని రాత్రులు నిద్రపట్టలేదు. ఆలోచించినకొద్దీ సరితమీద నాలో ద్వేషం రగిలిపోయింది.

అందుకే ఒక రోజంతా తీవ్రంగా ఆలోచించి సరితను నా దారినించి అడ్డు తొలగించుకోవాలని అనుకున్నాను. ఐతే నామీద ఎలాంటి అనుమానం ఆమెకు కలగకూడదు.

ఎవరో దొంగ నగలకోసం వచ్చి ఆమెను హత్యచేసి నట్టుగా అందరూ అనుకోవాలి.

ఈ ప్లానును నేను సిద్ధం చేసుకున్న తర్వాత అందుకు అవసరంగా ఒక నల్లటి ముసుగును కూడా తయారుచేసు కున్నాను - నన్ను గుర్తించకుండా వుండేందుకు ఎవ్వరూ-

నా ప్లాను యేమిటంటే ఓ మిత్రుడిని కలుసుకోవటానికి ఆ రోజు ఉదయమే మరో ఊరికి వెళ్ళిపోతాను. కాని వెళ్ళి ఆ రాత్రికి తిరిగివస్తాను — నా గదిలో దాచుకున్న ముసుగు

వేసుకుని వెళ్ళి సరితను కత్తితో పొడిచి చంపి ఇంటి వెనుక దారినించి పారిపోతాను.

ఈ ప్లాను కొంచెం సాహసంతో కూడుకున్నదే. కాని అన్ని లక్షల ఆస్తికోసం ఈ పాటి రిస్కు తీసుకోపోతే ఎలా?

ముహూర్తం నిర్ణయించాను.

3

ప్లాను ప్రకారం ఓ స్నేహితుడు ఎందుకో అర్జంటుగా తనని కలుసుకోమని కబురు చేశాడని ఆమెతో చెప్పి, ఆ రోజు ఉదయమే ఇంట్లోనించి బయటపడ్డాను తిరిగి రెండు రోజుల తర్వాత వస్తానని చెప్పాను.

బస్సులో ఓ వూరు వెళ్ళాను. ఆ వూళ్ళో నిజంగానే నా స్నేహితుడొకడు వున్నాడు. వాడితో సాయంత్రం వరకు గడిపాను. అతనితో ఆమె గురించిన విషయం పొరపాటున కూడా మాటల్లో రాకుండా జాగ్రత్తపడ్డాను.

రాత్రి ఎనిమిదింటికి బయల్దేరాను వూళ్ళో అక్కడక్కడ తిరిగి రాత్రి పన్నెండు గంటలు దాటుతున్నప్పుడు, నడిచే ఇంటిదగ్గరకు వచ్చాను.

సరిగ్గా అప్పుడే ఇంటి ప్రహరీ గోడమీద నుంచి లోపలకు దూకుతున్న ఓ మనిషి కనిపించాడు. ఆ మనిషిని చూడగానే నేను ఆలస్యం చెయ్యలేదు. వాడు బాత్‌రూంలో నించి లోపలకు దూరి ఒక్కొక్క గదినీ దాటుతూ ఓ గదిలోకి వెళ్ళాడు.

నా గుండె దడదడలాడింది ఆ గదిలోనే సరిత—ఆమె తల్లి పడుకుంటారు.

ఇంతకీ ఎవడు వాడు?

దొంగా?

సరిత మీద పగవున్న మరో మనిషా?

ఐతే—నేను నీడలా వెంటాడుతున్నానని ఆ మనిషికి తెలీదు.

ఆ గదిని పరుచుకున్న మసకవెలుతుర్లో వెల్లకింతలా పడుకుని నిద్రపోతోంది సరిత.

ఆ మనిషి ఒక్కసారి సరితను చూసి చటుక్కున వంగి ఆమె మెళ్ళోవున్న బంగారు గొలుసును పట్టుకులాగాడు.

కళ్ళు తెరిచి కెవ్వుమన్నది సరిత.

ఇక నేను క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు. ఆ మనిషి ఓ దొంగ అని తెలిసిపోయింది.

వేగంగా అతనిమీదకు దూకాను. అప్పటికే అతను కత్తితీసి ఆమెను పొడవబోయాడు.

అతని చెయ్యిపట్టుకుని వెనక్కు విరిచాను. ఎముక కలుక్కుమని బాధగా అరిచాడు. అతను నా కంటే బల వంతుడు కాడు.

అప్పటికే మల్లికాంబ — సరిత తల్లి నిద్రలేచారు. దీపాలు వెలిగించారు. విషయం తెల్సుకుని ఆమె ఆ పక్క ఇళ్ళలోవున్న మనుషులను పిల్చుకువచ్చింది. ఎవరో పోలీసులకు ఫోన్ చేశారు.

అతను గింజుకుంటున్నా వదల్లేదు. పోలీసులు వచ్చారు. అతడ్ని తీసుకువెళ్ళారు.

అప్పుడే పూర్ణించి వచ్చాననీ, లోపల ప్రవేశించిన అతడ్ని వెంటాడి పట్టుకున్నాననీ వాళ్ళతో చెప్పాను.

మల్లికాంబ నన్ను ఎంతగానో మెచ్చుకుంది సరిత ప్రాణాన్ని కాపాడినందుకు. సరితతల్లి కూడా నన్ను బాగా మెచ్చుకుంది.

నిజంగా నేను ఆమె ప్రాణాన్ని తీసి నా దారికి అడ్డు

తొలగించుకోవాలనుకున్నాను. కాని ఆ మనిషి ఆమెను కత్తితో పొడవబోతున్నప్పుడు చూసి సహించలేక పోయాను. అసలు నేను నిజంగా సరితను కత్తితో పొడిచి హత్యచేసి వుండేవాడినేనా అనే సందేహం కలిగింది.

కొంతమందికి ఆలోచనల్లో వుండే ఆవేశం - ధైర్యం ప్రాక్టికల్‌గా ఆ పని చెయ్యబోతున్నప్పుడు వుండవు. నేను కూడా ఆ జాతికి చెందిన మనిషినే అనుకున్నాను.

కాని—అందువల్లనే నా అదృష్టం తిరిగి పండింది. తెల్లవారిన తర్వాత ఆమె నాకో శుభవార్తను చెప్పింది.

అది—రాత్రి నేను తన ప్రాణాన్ని కాపాడటంతో సరితకు నా మీద కృతజ్ఞతతోపాటు ప్రేమకూడా చిగురించిందట. అందుకే ఆమె మా ఇద్దరికీ పెళ్ళిచేసి తన ఆస్తిని ఇద్దరికీ సమంగా పంచిఇస్తానని చెప్పింది. అంతే, మళ్ళీ గాల్లోతేలిపోయి ఆకాశాన్ని అందుకున్నట్టుగా అనిపించింది. సగం ఆస్తితోపాటు అందాల సరిత కూడా నాదవుతుంది.

ఇంతకీ నా అదృష్టానికి కారణం ఎవరు? ఆ దొంగ. అందుకే ఆ దొంగకు నా కృతజ్ఞతలు. □

డాన్స్ డైరెక్టర్!

ఈసారి వెరైటీగా వుంటుందని పాటల స్టెప్స్ కోసం
ఓ డ్రిల్లు మాస్టార్ని డాన్స్‌డైరక్టర్‌గా ఎన్నుకున్నాం!

పిశాచాల వైకుంఠం

కె.వి.రమణ

రిక్షా దిగి నెమ్మదిగా మెట్లెక్కి వచ్చాడా వ్యక్తి. తలకు కట్టిన బాండేజీ ఇంకా రక్తం చిమ్ముతూనే వుంది. తెల్లగా నిటారుగా వున్నాడు లావూ సన్నమూ కాని ఒళ్ళు. ఇన్స్పెక్టర్ షరీఫ్‌కి వినయంగా నమస్కరించాడు.

ప్రతి నమస్కారం చేస్తూ ఎదురుగా వున్న కుర్చీ చూపిం

చాడు షరీఫ్.

"నా పేరు సుందర్రావు. రైల్వేలో వుద్యోగం" అన్నాడావ్యక్తి కుర్చీలో ఆసీనుడౌతూ.

తల వూపుతూ "చెప్పండి" అన్నాడు షరీఫ్.

కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు సుందర్రావు. ఏదో చెప్పేందుకు వుద్యుక్తుడయి అంతలోనే మొహమాట పడుతున్నవాడికి మల్లే గోడ గడియారాన్ని, కేలండరును మార్చి మార్చి చూడసాగాడు సుందర్రావు.

షరీఫ్ చిన్నగా నవ్వుతూ "సుందర్రావుగారూ! నేనేం డాక్టర్నికాను, పోలీసు ఇన్‌స్పెక్టర్ని. నా దగ్గర చెప్పేందుకు అంతగా సిగ్గుపడే విషయాలేముంటాయి. ఫరవాలేదు. చెప్పండి" అన్నాడు.

సుందర్రావు గొంతు సవరించుకుంటూ "ఈ విషయం మీకెలా చెప్పాలో తెలియక తికమక పడుతున్నాసార్! నా మాటలు మీరు నమ్ముతారో నమ్మరోననేభయం ఒకటి మరోప్రక్క పీడిస్తోంది" అన్నాడు.

షరీఫ్ ఆ మాటకు నవ్వుతూ "మీరు చెప్పేది నిజమే అనే నమ్మకం మీకుంటే నేను నమ్ముతానో నమ్మనో అనే సందేహం మీకు అక్కర్లేదు. మీరు చెప్పదలచుకున్నది నిరభ్యంతరంగా చెప్పండి" అన్నాడు.

సుందర్రావు ఒక క్షణం ఆలోచించి "మా వీధిలో ఒక మంత్రగాడున్నాడు సార్. వాడిపేరు వైకుంఠం. అందరూ వాణ్ణి పిశాచాల వైకుంఠం అంటారు. ఇంచు మించు రాత్రీ పగలూ స్మశానంలోనో లేక ఆ చుట్టు ప్రాంతాల్లో వుండే ఏ తోటలోనో వుంటూ వుంటాడు. వాడేమో నా భార్య మంజరిని సుమారు పదిహేను రోజుల క్రితం 'నీతో పని వుంది. స్మశానానికి వస్తావా?' అని అడిగాట్ట" అన్నాడు

సుందర్రావు.

"పదిహేనురోజుల క్రితమే వైకుంఠం ఈ మాట అన్నప్పుడు ఇంతవరకూ ఎందుకు వూరుకున్నారు" అడిగాడు షరీఫ్.

సుందర్రావు నిట్టూరుస్తూ "మొన్నటివరకూ మంజరి అసలీ సంగతే చెప్పలేదు నాకు. వైకుంఠం మొదట ఈ మాట తనతో అన్నప్పుడు మాటాడకుండా వచ్చేసిందట. ఓ అయిదురోజులు గడిచాక వైకుంఠం శిష్యుడు ముత్యాలు వచ్చి 'మా గురువుగారు చెప్పిన సంగతి ఏమాలోచించావ్' అని అడిగేసరికి మంజరివాణ్ణి తిట్టిపంపి, ఆ విషయం ఎందుకయినా మంచిదని నాకు చెప్పింది.

నిజం చెప్పాల్సివస్తే ఆ క్షణంలో నాకు వైకుంఠాన్ని నరికి పోగులు పెట్టాలన్నంత కోపం వచ్చింది. అయినా కోపాన్ని బలవంతాన నిగ్రహించుకున్నాను. ఏకాఏకిని వైకుంఠాన్ని కలిసి మరో మారు ఇటువంటి దౌర్భాగ్యపు ప్రస్తావన మంజరివద్ద తీసుకువస్తే ఏ కీలుకు ఆ కీలు విరిచేస్తానని తీవ్రంగానే హెచ్చరించి వచ్చాను ఆ దెబ్బతో వైకుంఠం దారికి వచ్చినట్టే అగుపించాడు. కానీ నిన్న రాత్రి ...." అంటూ ఆగిపోయాడు సుందర్రావు.

షరీఫ్ ఆసక్తిగా ముందుకు వంగి "చెప్పండి. నిన్న రాత్రి ఏం జరిగింది?" అన్నాడు.

"నిన్నరాత్రి భోజనాలయి మంజరీ నేనూ పడకగది చేరేసరికి పదికావస్తోంది మాకు పిల్లా పీచూ లేరింకా. ఇద్దరం ఏవో కబుర్లలోపడ్డాం. అప్పుడు పదకొండు కావస్తోంది. మంజరి అంతలోనే కడుపులో వికారంగా వుండి తల తిరుగుతూ మనసంతా గజిబిజిగా వుందంది. నిద్రపోతే అదే సర్దుకుంటుంది లెమ్మని మంజరిని నిద్ర

పోతున్నాను నేను.

మంజరి కొంతసేపు అటుతిరిగి ఇటుతిరిగి ఏదోలా నిద్ర పోయింది. నాకు మాత్రం ఏ కారణంగానో ఎంతకీ నిద్ర పట్టలేదు.

అప్పటికి సమయం పన్నెండయ్యేందుకు ఓ పది నిముషా లుంది. మంజరి వున్నట్టుండి నిద్రలోనే ఏమిటేమిటో చిన్నగా 'నేను రాను....ఎందుకు రావాలి.. ఎవర్నువ్వు....' అంటూ కలవరించసాగింది. నేను ఆదుర్దాగా మంజరినే గమనిస్తున్నాను.

మంజరి అంతలోనే బెదురుగా 'వస్తున్నాను....వస్తు న్నాను' అంటూ మంచం మీదనుండి చటుక్కున లేచి బయల్దేరింది.

నేను ఆశ్చర్యంగా 'ఏమయింది మంజూ ...' అన్నాను. మంజరికి నా మాటలు వినపడ్డాయో లేదో తను మాత్రం వెనుతిరిగి చూడకుండా గది దాటిపోయింది.

నేను మంచం మీదనుండి లేచి పరుగెత్తాను. మంజరి అప్పటికే తలుపులు తెరచి వీధిలోకి పోయింది. ఎన్నిమార్లు గొంతెత్తి పిలిచినా కనీసం వెనక్కి తిరిగయినా చూడ్లేదు. నేను ఆదరాబాదరాగా తలుపులు దగ్గరగా చేర్చి మంజరి వెంటపడ్డాను.

మంజరి చాలా వేగంగా నడుస్తోంది. ఎంత వేగమంటే పరుగెత్తికూడా నేనామెను కలుసుకోలేక పోతోన్నాను. నిజానికి చీకటంటే మంజరికి చచ్చేంత భయం. అయినా అంతటి నిశిరాత్రిలో వూరుదాటి పోతుందామె. రాళ్లూ, పొదలూ నిండిన ఆ భయంకర వాతావరణంలో జంకూ గొంకూ లేకుండా స్మశానం దిక్కుగా సాగిపోతోంది.

చెప్పాలంటే ఆ వాతావరణం నాకే భయమనిపించింది.

స్మశానం ఇంకా ఓ అరఫర్లాంగు దూరం వుందనగా గాలివాటున పెద్దగా మాటలు వినపడసాగాయి. స్మశానం చేరేసరికి ఆ గొంతు మరింత స్పష్టంగా గట్టిగా వినపడ సాగింది. ఆ గొంతు నాకు బాగా తెలిసినదే. అది వైకుంఠం స్వరం.

స్మశానం మధ్యలో దిసమొలగా నిలబడి వున్నాడు వైకుంఠం. శిరస్సును పూర్తిగా కప్పివేస్తూ మానవ కపాలం వంటిది ధరించాడు ఆ కారణంగా వైకుంఠం మొహం కనపడే అవకాశం లేకపోయినా గొంతు మాత్రం స్పష్టంగానే వినపడుతోంది. అతనికి ముందుగా మండు తున్న చితి వెలుతురులో మిగిలిన శరీరం స్పష్టంగానే గోచరిస్తోంది.

వైకుంఠం పెద్దగా మంత్రాలు చదువుతూ గుప్పిట వున్న ఏవో గింజలవంటివి ఒక్కొక్కటే మంటలో వేస్తున్నాడు.

మంజరి తిన్నగా వెళ్ళి వైకుంఠం యెదురుగా చితి ముందు నిల్చుంది. మంజరిని చూస్తూనే వైకుంఠం పెద్దగా నవ్వుతూ 'ఏమే చిలకా! బ్రతిమాలినన్నాళ్ళూ బెట్టుపోయావు. ఇప్పుడయినా తెలిసిందా వైకుంఠం సత్తా ఏమిటో!' అన్నాడు ఎగతాళిగా.

మంజరి వులుకూ పలుకూ లేకుండా నిశ్శబ్దంగా నిలబడి వుంది. స్మశానంలో ఒక సమాధిని చాటుచేసుకొని ఇదంతా గమనిస్తున్నాను నేను.

వైకుంఠం వెకిలిగా నవ్వుతూ 'ఏమిటలా చూస్తూ నిలుచున్నావ్. నువ్వే ఆ గుడ్డలు విప్పిరా!' అన్నాడు.

ఆ మాటకు ఒక్కసారిగా గతుక్కుమన్నాను నేను.

పట్టరాని కోపంతో ఒళ్ళంతా భగభగలాడిపోతోంది. అయినా తమాయించుకొని మంజరి ఏం చేస్తుందో చూడా లనుకొన్నాను. వూపిరి బిగబట్టి చూడసాగాను. మంజరి బట్టలు విప్పుతుందా? కట్టుకున్న మొగుడిముందు చీర మార్చుకోవడానికే చచ్చేంత సిగ్గు పడే మంజరి ఓ పరాయి మగాడిముందు పూర్తిగా వివస్త్ర కాగలదా?

మంజరి ఏ కదలికా లేకుండా అలాగే వుండిపోగా వైకుంఠం మండిపోతూ "నే చెప్పింది వినపడలేదటే?" అంటూ పిడికిలిలో వున్న మొత్తం గింజల్ని మంటల్లో విసిరికొట్టాడు.

మంట భయంకరంగా వుధృతమై తాడి ఎత్తున పెగలు కక్కింది. ఆ వేడికి వెచ్చబడిన గాలి సమాధి మాటున నక్కి వున్న నన్ను సయితం వుక్కిరి బిక్కిరి చేసేసింది. మంజరి అదిరిపడుతూ క్షణాల్లో ఒంటిమీదున్న బట్టలన్నీ విప్పి దిగంబరంగా వైకుంఠం ముందు నిలబడింది. వైకుంఠం వికటంగా నవ్వుతూ మంజరిని సమీపించ సాగాడు.

ఆ క్షణాన నాలో కోపం కట్టలు తెంచుకుంది. ఆవేశంతో వూగిపోతూ పైకి లేవబోయాను. ఇంతలోనే నా వెనక ఏదో అలికిడయి వెనక్కి తిరిగి చూచేలోగా ఓ టన్ను బరువు నా తలమీద పడింది విసురుగా. ఆ దెబ్బకు కళ్ళు బైర్లు కమ్మి స్పృహ తప్పుతుండగా పకపక లాడుతూ వినపడిందో స్వరం. అది వైకుంఠం శిష్యుడు ముత్యాలు కంఠం.

తిరిగి నాకు తెలివి వచ్చేసరికి తెల్లవారేందుకు యిక కొద్ది చీకటి మాత్రమే మిగిలుంది. స్మశానం ప్రశాంతంగా వుంది. వైకుంఠం! ముత్యాలు! మంజరి! ఎవరూలేరక్కడ.

మంజరి విడిచిన దుస్తులు సయితం లేవు. కనీసం రాత్రి వెలిగిన చితి గుర్తుకయినా లేదు!

రాత్రి జరిగింది. నిజమా? నా భ్రాంతా? చిరాగ్గా తల విదిలించబోయాను. భగ్గుమంది తల. చేతితో తడుముకోగా జిగటగా తగిలింది రక్తం. అప్పుడు నమ్మకం కలిగింది నాకు రాత్రి జరిగింది యధార్థమేనని. ఇక అక్కడ క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఇంటికి పరుగుతీసాను.

మంజరి అప్పటికే స్నానం వగయిరాలు పూర్తిచేసి పూజకు సిద్ధమౌతుంది. నన్ను చూస్తూనే "తెల్లారేసరికల్లా ఎక్కడికి వెళ్ళారు? ఒంటినిండా ఆ దుమ్మూ ధూళి ఏమిటి? అమ్మో....తలకు ఆ గాయమేమిటి?" అంటూ గుండెలు బాదుకోసాగింది.

ఆమెకు ఏదో చెప్పి శాంతపరచేసరికి నాకు తలప్రాణం తోకకు వచ్చింది. మంజరి తీరు చూడగా రాత్రి జరిగింది ఒక్క అక్షరమయినా ఆమెకు జ్ఞాపకం లేదనిపిస్తోంది. ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇదీ విషయం" అన్నాడు సుందరరావు.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ సుందరరావు చెప్పినదంతా ఆశ్చర్యంగా విన్నాడు. ఇటువంటి సంగతులు కథలుగా వినడం పుస్తకాలలో చదవడం తప్ప ప్రత్యక్ష అనుభంగా చెప్పిన దెక్కడా వినలేదతను.

షరీఫ్ కొద్ది క్షణాలు మౌనం వహించి తర్వాత నెమ్మదిగా "సుందరరావుగారూ! ఈ విషయంలో మేము ప్రస్తానికి అంతగా కలుగజేసుకొనే అవకాశాలు తక్కువ. ఎందుకంటే? నన్ను వైకుంఠం ఈ రకంగా చేసేదని మీ భార్య సయితం చెప్పే పరిస్థితి మనకు లేదు. కాకపోతే మీ భార్యను స్మశానానికి రమ్మని పిలిచినందుకు, మిమ్మల్ని

స్మశానంలో గాయపరచినందుకు గురుశిష్యు లిద్దరినీ పిలిచి గట్టిగా హడలుగొడతాం. అప్పటికీ వాళ్ళు తెగించి అవేవీ మాకు తెలియదంటే మేంచేసేది కూడా వుండదు.

అయితే ఒక మాట! ఇకమీదట అటువంటివి ఏం జరిగినా సరయిన చర్య తీసుకొనే విధంగా ప్రత్యేకించి మీ యింటిమీద రాత్రుళ్ళు నిఘా వుంచుతాం కాబట్టి ఇకమీదట మీరు ఏం జరిగినా బెంబేలుపడక నిశ్చింతగా వుండండి" అన్నాడు.

సుందర్రావు సంతోషంగా రెండు చేతులూ యెత్తి నమస్కరిస్తూ "ఆ మాటయితే మేం సదా మీకు ఋణపడి వుంటాం" అన్నాడు కృతజ్ఞతగా.

2

ఎదురుగా నిర్వికారంగా నిర్లక్ష్యంగా నిలబడి వున్న వ్యక్తిని ఆపాదమస్తకం పరిశీలనగా చూశాడు ఇన్‌స్పెక్టర్.

నునుపయిన నల్లని శరీరం. ఎత్తుగా ఆరోగ్యంగా వున్నాడు. సన్నగా వున్నా బలమయిన మనిషి. తీక్షణమయిన చూపులు. చదువూసంధ్యలు లేనివాడయినా మొహంలో అదోరకమయిన ప్రకాశం. తెల్లని లుంగీమీద అదేరంగు కమీజు మట్టిబట్టి నలుపు వర్ణం దాల్చాయి. తల మీద దుబ్బులా పెరిగిన జుత్తుమీద దువ్వెన వుంచి ఎన్నాళ్ళయిందో! జడలుగా అల్లుకుపోయాయి కేశాలు.

"పిశాచాల వైకుంఠం అంటే నువ్వేనా?" తీక్షణంగా అడిగాడు షరీఫ్.

ఆ వ్యక్తి నిదానంగా సూటిగా "నా పేరు కేశవపురం వైకుంఠం" అన్నాడు.

"నువ్వు తరచూ స్మశానాలలో తిరుగుతూ పూజలూ

మంత్రాలూ జరుపుతుంటావటగా?"

"నిషేధింపబడిన స్థలాలలో తప్ప ఈ దేశంలో యెవ రెక్కడ తిరిగినా తప్పుకాదు. స్మశానం నిషేధింపబడిన స్థలంకాదు. పూజలూ మంత్రాలూ ఆస్తికులందరూ చేసేవే. కాకపోతే పద్ధతుల్లో తేడా ఉండొచ్చు" నిర్భయంగా అన్నాడు వైకుంఠం షరీఫ్ ప్రశ్నకు జవాబుగా.

చదువూ సంధ్యలు లేని వైకుంఠం అంత జాగ్రత్తగా మాట్లాడడం షరీఫ్‌ని ఆశ్చర్యంలో ముంచింది. తనలో భావాన్ని పైకి కనబడనివ్వకుండా.

"కానీ పరాయివాడి పెళ్ళాన్ని స్మశానానికి రమ్మనడం నేరం!" కోపంగా అరిచాడు షరీఫ్.

ఆ మాటకు సమాధానంచెప్పకుండా తల వంచుకున్నాడు వైకుంఠం.

షరీఫ్ పైకి లేస్తూ "నాకు సమాధానం కావాలి" అన్నాడు గట్టిగా.

"ఈ మధ్య నేను శక్తి వశీకరణ పూజ తలపెట్టాను. ఆ పూజకు విధిగా ఒక స్త్రీ కావాలి. ఆ స్త్రీ పాతికేళ్ళ వయసు మించనిదయి శరీరంలో యే లోపమూ లేనిదిగా వుండాలి. సంతానవతి పనికిరాదు అంతేకాదు! దేవునిపట్ల పూజలందు విశ్వాసం కలిగినదై వుండాలి. శక్తి పూజలో ప్రధానపాత్ర వహించగల స్త్రీ యిన్ని అర్హతలూ కలిగి వుండడం తప్పనిసరి. అటువంటి స్త్రీ మంజరి. అందుకే ఆమె సహాయం కోరాను.

ఇది దైవకార్యం. నా ప్రయత్నం లోక కళ్యాణం కోసమే. మామూలుగా జరిగే పూజా పునస్కారాలకు ముత్తయిదువుల్ని పిలవరా? ఇదీ అంతే! కాకపోతే మంజరిని నే రమ్మని కోరింది మరు భూమికి.

పురుషుడు ఒక స్త్రీని యెక్కడికి యెందుకోసమని రమ్మన్నా సామాన్యులకు అది తప్పుగా తోచవచ్చు. కానీ మాలాంటివాళ్ళకు స్త్రీ పురుషులందరూ ఒకటే. మంజరి యిష్టం వుంటే వస్తుంది లేకుంటే లేదు" అన్నాడు వైకుంఠం.

షరీఫ్ విసురుగా వెళ్ళి వైకుంఠాన్ని చాచి లెంపకాయ కొట్టి "ఇన్ని నీతులూ రాత్రి స్మశానంలో ఏమయ్యాయి? మంజరిని బలవంతంగా వివస్త్రనుచేసి నువ్వు చేసిందేమిటి? ఇష్టాయిష్టాల ప్రసక్తి వున్నప్పుడు మంజరి అభీష్టానికి వ్యతిరేకంగా ఆ తతంగమంతా యెలా జరిగింది?" అన్నాడు ఆవేశంగా.

ఇన్‌స్పెక్టర్ తననలా కొట్టి అవమానపరుస్తాడని వూహించని వైకుంఠం ఆ చర్యకు ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందాడు. తీక్షణమయిన అతని చూపుల్లో కోపం, ఆశ్చర్యం, బాధ ఒకేసారి పొంగుకు వచ్చాయి.

అతడు తనలో ఉద్రేకాన్ని బలవంతాన అదిమిపెడుతూ కమీజును బర్రున మధ్యకు చించి నేలమీద వేసాడు. కుడిచేతిని పైకెత్తి "ఇలా చూడు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ వైకుంఠం చర్యకు ఆశ్చర్యపోతూ అటు చూసాడు.

3

అర్థరాత్రి సమయం.

గాలి వుధృతంగా వీస్తోంది. స్మశానం చుట్టుప్రక్కల చెట్లు కొమ్మలు విరిగిపడేలా పొంతం వూగుతున్నాయ్. మరుభూమిలో ఆరీఆరని చితిమంటలు గాలిజోరున తిరిగి ప్రజ్వరిల్లుతున్నాయ్ మానవకపాలాలు గాలితాకిడికి వూగుతూ వింత శబ్దాలు చేస్తున్నాయ్! ఆకాశం ఏ క్షణాన కుంభవృష్టి

కురుస్తుందో చెప్పరాని విధంగా మేఘాలతో క్రిక్కిరిసి వుంది.

గుండెలు చెదరే ఆ భయానక వాతావరణంలో మరు భూమిలో మంత్రోచ్చారణ గాలి హోరుతో పోటీపడు తోంది.

స్మశానం మధ్యలో పద్మాసనం ధరించి ప్రక్కన రాశిగా పోసివున్న కట్టెపుల్లలను ఒకటొకటిగా మంటలో వేస్తూ మంత్రాలు పఠిస్తున్నాడు వైకుంఠం. నడుమున మొలత్రా డయినా లేని అతని దిగంబర దేహం నల్లని రంగులో చిత్రంగా మెరుస్తోంది. శిరస్సున ధరించిన కపాలం రంధ్రాల నుండి గోచరిస్తున్న వైకుంఠం నేత్రద్వయం నిశీధిలో మెరిసే నక్షత్రాలను పోలి వున్నాయ్.

చితికి ముందున్న ముగ్గుమీద కాళ్ళు బంధించబడి వుందొక నల్ల పిల్లి. నిమ్మకాయలు మానవ కపాలాలు మోచేతి ఎముకలు నల్లపిల్లి చుట్టూ ఒక క్రమ పద్ధతిలో పేర్చబడి వున్నాయి. వాటికి చేరువగా నేలమీద గుచ్చబడి వుందొక త్రిశూలం.

వైకుంఠానికి యెదురుగా చితికి రెండోప్రక్క ఒంటి మీద నూలుపోగయినా లేనిస్థితిలో జుత్తు విరబోసుకు కూర్చుంది మంజరి. ఆమె దృష్టి సూటిగా నిశ్చలంగా వుంది.

వైకుంఠం ఒకవంక మంత్రోచ్చారణ గావిస్తూనే మంజ రిని లేవమన్నట్టు సైగచేశాడు.

మంజరి మంత్రముగ్ధయై లేచింది నెమ్మదిగా.

త్రిశూలాన్ని తీసి ఆమెకు అందిస్తూ దానితో నల్ల పిల్లిని పొడవమన్నట్టుగా సంజ్ఞ ద్వారా తెలియ జెప్పాడు వైకుంఠం.

మంజరి త్రిశూలాన్ని ధరించి నల్లపిల్లి దిక్కుగా కదిలింది. నల్లపిల్లి కట్లబారినుండి విడివడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ హృదయవిదారకంగా అరుస్తోంది. మంజరి త్రిశూలాన్ని పైకెత్తింది.

వైకుంఠం అదే సమయంలో తన ప్రక్కనే వున్న చేతిసంచిలో నుండి ఏదో తీసి మంటలో వేసాడు. అంతే! గుప్పున మంటలు అరి దట్టమయిన తెల్లని పొగలు ఆ ప్రదేశమంతటా వ్యాపించాయి. అంతా చీకటి! పొగ! అంతలోనే హృదయవిదారకంగా వినపడిందో ఆర్తనాదం! అది వైకుంఠం ఆర్తనాదం!!

అదే సమయంలో స్మశానమంతటా పోలీస్ విజిల్స్ మారుమ్రోగాయి. పొగ అంతా తగ్గి తిరిగి మామూలు స్థితి యేర్పడేందుకు ఓ పదినిముషాలు పట్టింది.

టార్చిలైట్లు వెలుతురు ఆ ప్రదేశమంతటా నిండిపోయింది.

ఇన్స్పెక్టర్ షరీఫ్ పూజాస్థలాన్ని చేరాడు. వైకుంఠం నేలమీద వెల్లకిలా పడివున్నాడు. అతని గుండెల్లో లోతుగా దిగబడివుంది త్రిశూలం. ప్రక్కనే నిశ్చలంగా నిలబడి వుంది మంజరి. నల్లపిల్లి క్షేమంగా వుంది.

వైకుంఠం మాత్రం ఎప్పుడో వైకుంఠానికి చేరిపోయాడని గ్రహించాడు షరీఫ్. వైకుంఠం శిరస్సుకు తగిలించుకున్న కపాలాన్ని తీసి ప్రక్కన పడేసాడు షరీఫ్. మంజరి ఒంటిమీద ప్రక్కనే పడివున్న ఆమె దుస్తుల్నివేసి ఆమెను పేరుపెట్టి పిలిచాడు షరీఫ్. అయినా వులుకూ పలుకూ లేకుండా అలాగే నిలబడివుంది మంజరి. మనిషి అక్కడే వున్నా ఆమె చూపులు మాత్రం యెక్కడో వున్నట్టున్నాయ్!

పోలీసులు నీళ్ళు తెచ్చి ఆమె మొహాన కొట్టారు. కెవ్వున అరుస్తూ కింద పడిపోయింది మంజరి. తిరిగి ఐదు నిముషాల్లో కోలుకుంటూ చుట్టూవున్న ప్రదేశాన్ని పోలీసుల్ని చూసి భయంతో వణికిపోతూ "నే నిక్కడి కెలా వచ్చాను? ఏమిటిదంతా?" అంది.

4

సుందర్రావు యింట్లోకి ముందు ఇన్‌స్పెక్టర్ షరీఫ్, అతని వెనక హెడ్ ఐరావతం, ఆ వెనక పోలీసులూ ప్రవేశించారు.

పడగ్గదివరకూ తలుపులన్నీ బార్లా తెరిచివున్నాయి. మంచంమీద మత్తుగా నిద్రపోతున్నాడు సుందర్రావు. నాలుగయిదుసార్లు గట్టిగా తట్టిలేపితే కళ్ళు నులుపుకుంటూ లేచాడు.

ఎదురుగా వున్న పోలీసుల్ని చూసి ఖంగారుగా "ఏమిటి....ఏమయింది...." అంటూ అటూ యిటూ చూసి "అరె....మంజరి ఏదీ ..." అన్నాడు ఆందోళనగా.

షరీఫ్ "మంజరి పోలీస్ లాకప్‌లో భద్రంగా వుంది గానీ ముందా కంఠం కింద మిగిలిపోయిన నల్లరంగు తుడుచుకో సుందర్రావ్!" అన్నాడు తాపీగా.

"ఆఁ రంగా!...." అంటూ సుందర్రావు గతుక్కుమంటూ కంఠంమీద చేతితో తుడుచుకోబోతూ ఆగి "రంగేమిటి...." అన్నాడు అంతలోనే తెల్లబోతూ.

"చెబుతా! ముందు ఇల్లంతా వెతకండి" అన్నాడు షరీఫ్ ఐరావతంకేసి తిరిగి.

ఐరావతం ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు గదుల్లోనూ చొరబడ్డారు.

"ఇన్‌స్పెక్టర్! ఏమిటిదంతా? నా యిల్లు సోదాచేయడం

దేనికి?" అంటూ సుందర్రావు కేకలు వేస్తున్నా యెవరూ పట్టించుకోలేదు.

ఐరావతం ఐదునిముషాల్లో చిన్నసైజు టేప్‌రికార్డర్ పట్టుకొచ్చి షరీఫ్ చేతికందించాడు. షరీఫ్ టేప్‌రికార్డర్ ఆన్‌చేయగా పెద్దస్థాయిలో వైకుంఠం మంత్రాలు చదవడం వినిపించింది.

షరీఫ్ సుందర్రావు మొహంలోకి చూసాడు నవ్వుతూ. తెల్లబోతూ తల వంచుకున్నాడు సుందర్రావు.

"సుందర్రావ్! నువ్వు చాలా జాగ్రత్తగా అల్లిన చిక్కుముడి కథ రహస్యం బట్ట బయలయింది. నువ్వు నాకు చెప్పన కథలో వైకుంఠం నీ భార్యను స్మశానానికి రమ్మనడం వరకే యధార్థం. మిగిలినదంతా నీ కల్పనా చాతుర్యమే!

నీ భార్యను శక్తిపూజ నిమిత్తం వైకుంఠం స్మశానానికి రమ్మని పిలవడం తీవ్రమయిన విషయంగా భావించి, అతణ్ణి హత్యచేయాలనే నిర్ణయానికొచ్చావు. వైకుంఠాన్ని మా కళ్ళముందే హత్యచేసి పట్టుబడని విధంగా తప్పుకోవా లన్నది నీ ఆలోచన. పోలీసులు రాత్రులందు నీ యింటి మీద నిఘావేసి వుంచుతారన్న సంగతి నీకు తెలుసు.

వైకుంఠాన్ని ఏదోలా పట్టి బంధించి స్మశానానికి చేర్చావు. స్పృహలేని స్థితిలో అతణ్ణి పూజాస్థలానికి వెనక వున్న పొదల్లో దాచివుంచావు. శరీరాకృతిలో ఒక్క రంగు విషయం మినహాయించి నీకూ వైకుంఠానికీ దగ్గర పోలిక లున్నాయి. నల్లరంగు ఒంటికి పూసుకొని ఆ తేడాను కూడా సరిపెట్టావు. వైకుంఠం గొంతును ఇంతకుముందే అతడు స్మశానంలో సాధనచేస్తున్న సమయంలో రహస్యంగా

రికార్డు చేసివుంచావు.

పథకం మేరకు సరయిన సమయానికి నీ భార్య పోలీసులు వెంటరాగా స్మశానంలో ప్రవేశించింది. సరిగ్గా ఆ సమయానికి చితిముందు కూర్చొని తొడలసందున దాచి వుంచిన టేపురికార్డరును ఆన్ చేసావు.

మోహానికి కపాలం అడ్డు నీకు వైకుంఠం స్వరాన్ని అనుకరించే ప్రక్రియలోనూ; నిన్ను వైకుంఠంగా ఇతరులు భావించే పరిస్థితిని కల్పించడంలోనూ ప్రధాన పాత్ర వహించింది. అందుకే ప్రత్యేకించి శిరస్సుకు కపాలాన్ని తగిలించావు.

తర్వాత స్మశానమంతటా చీకటీ పొగా సృష్టించి వైకుంఠాన్ని పొదల్లోనుండి తెచ్చి చితిముందు త్రిశూలంతో పొడిచి పారిపోయావు వైకుంఠాన్ని ఒంటిమీద స్పృహ లేని స్థితిలో మంజరి చంపిందని, అది పూజలో జరిగిన ఏదో పొరపాటు కారణంగా జరిగివుంటుందని మేం భావించి ఆనక విచారణలో ఆమెకు మేమే అండగా నిలుస్తామన్నది నీ ఆలోచన.

అయితే నీ మీద మాకు అనుమానమేం కలగనినాడు నీ నాటకం విజయవంతమయ్యేదేమో!

వైకుంఠాన్ని మేం పిలిపించి అడిగినపుడు, మాకు కొన్ని సంగతులు తెలిసాయి. మంజరిని తాను బలవంతంగా తన మంత్రశక్తికి ఆధారంగా రప్పించానన్నది అబద్ధమనీ. అసలు వారంరోజులుగా తను ఏ పూజలోనూ పాల్గొనలేదని చెప్పాడు వైకుంఠం. అందుకు ఋజువుగా కుడిచేతి బాహుమూలానికి దిగువన తగిలిన పెద్ద గాయమొకటి చూపించాడు. అది వారం రోజుల క్రితం ఓ ప్రమాదంలో ఏర్పడిన

గాయం.

'మంత్రగాడు శక్తులతో సాధన చేసేటపుడు శరీరంలో ఎక్కడా గాయమయి రక్తం చిందే అవకాశం వుండరాదు. మంత్రగాడి క్షేమం దృష్ట్యా అది చాలా ముఖ్యమయిన విషయం. ఈ పరిస్థితిలో ఇంత పెద్ద గాయంతో నిన్నరాత్రి నేను స్మశానంలో సాహసోపేతమయిన శక్తి పూజకు ఎలా సిద్ధపడగలను?' అని నన్ను ప్రశ్నించాడు వైకుంఠం.

అదీ నిజమే! నాకు తెలిసీ వైకుంఠం మాట అబద్ధమేం కాదు. అయితే మరి స్మశానం కథ ఏమిటనుకున్నప్పుడు అది నువ్వాడుతున్న నాటకమా? అనిపించింది. సమయం కోసం వేచి చూసాం!

స్మశానంలో ఇంతక్రితం పూజచేస్తున్న సమయంలో వైకుంఠం శరీరానికి ఏ గాయమూ లేకపోవడం గమనించాను. ఆ వేషంలో నువ్వు అక్కడ కూర్చున్నావని తెలిసిపోయిందపుడు. అయితే కొద్ది క్షణాల నా తాత్సారం కారణంగా వైకుంఠం ప్రాణాలను నే కాపాడలేకపోయాను.

వైకుంఠాన్ని ఏదోలా చట్టం దృష్టిలో నేరస్థుణ్ణి చేసి నిలబెట్టాలనే తాపత్రయంతో నువ్విదంతా చేస్తున్నావని భావించానే తప్ప, అతణ్ణి హత్యచేసేంతటి కసి నీలో దాగి వుందని ఆ క్షణంలో నేను భావించకపోవడమే నేను చేసిన పొరపాటు" అన్నాడు బాధగా షరీఫ్.

సుందర్రావు మరి వంచిన తల పైకెత్తకపోగా హెడ్ ఐరావతం అతడి చేతులకు బేడీలు తొడిగి బయటకు లాక్కుపోయాడు.

నెమ్మదిగా కదిలింది పోలీస్ జీపు. □

శవంలో చైతన్యం

పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ

భయంకరమైన వాతావరణం.

చుట్టూ నీరు....అక్కడక్కడ భూమి. విరిగిపోయిన చెట్లు....వుండి వుండి వీస్తున్నగాలి స్మశాన నిశ్శబ్దంలో వాతావరణం భయంకరంగా వుంది.

ఓ ప్రక్కనుండి నీరు పాయలై ప్రవహిస్తుంది. డబ్బలా వున్న ప్రదేశం అంతా చెత్తాచెదారంతో నిండి పోయివుంది. చుట్టూ కనుచూపు మేరలో మానవసంచారం కనిపించడం లేదు.

అక్కడక్కడ శవాలు చెల్లాచెదురై పోయి వున్నాయి. వాటి ముఖాల్లో భయం. ప్రాణభీతితో నిండిన ఫీలింగ్స్ కనిపిస్తున్నాయి. తుఫాను ఇంకా తగ్గుముఖం పట్టినట్లు అనిపించటం లేదు.

మోకాలు లోతు నీటిలో నుండి నడుచుకుంటూ ఓ వ్యక్తి వస్తున్నాడు. అతను మాసిన బట్టలు తొడుక్కుని వున్నాడు. చనిపోయిన మనుష్యుల ఒంటిమీద వున్న నగలను తీసి తన సంచిలో వేసుకుంటున్నాడు.

అతనికి ఆడవాళ్ళ శవాల దగ్గరే ఎక్కువ వసూలు అవుతున్నది. తను తీసుకున్న నగలను సంతృప్తిగా చూసుకుంటూ సంచిలో వేసుకుంటున్నాడు.

సాయంత్రం అయిదు గంటలై వుంటుంది.

ఆకాశంలో గ్రద్దలు, రాబందులు శవాలను చూస్తూ ఎగురుతున్నాయి.

ఆ ప్రక్కనుండి నీటి ప్రవాహం వస్తుంది.

అక్కడ ఒడ్డునపడి ఓ స్త్రీ శవం వుంది. అతను సంచిని తీసుకుని దగ్గరికి వెళ్ళాడు. ఆమె మంచి వయసులో వుండి అందంగా వుంది. పల్లెటూరి స్త్రీ అని ఆమెనుచూస్తే చెప్పేయవచ్చు.

ఆమె ఒంటిన బంగారు ఆభరణాలు వున్నాయి. చెవులకి, ముక్కుకి, మెడకి, చేతులకి, కాళ్ళకి రకరకాల ఆభరణాలు వున్నాయి. వాటిని చూసిన తర్వాత అతను సంతృప్తిగా

తలాడించాడు.

ఆమె శరీరంమీద వున్న వస్తువులని ఒకసారి లెక్క వేసుకుని సంచితో క్రింద కూర్చున్నాడు.

ఆమె శరీరం అందరిలా లేదు.

బహుశా, అప్పుడే చనిపోయిందేమో అనిపిస్తుంది. మెడ చుట్టూ బంగారు గొలుసు వుంది. సాధారణంగా కొంతమంది పల్లెటూరి స్త్రీలు మెడచుట్టు అటువంటి బంగారు బెల్టు ధరిస్తుంటారు.

చిన్నగా చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి. అక్కడి వాతావరణం రోతగా వుంది. అదోలాంటి వాసన ముక్కు పుటాలను అదరగొడుతున్నది.

అతను అంతవరకూ చాలా నగలు సేకరించాడు. చీకటి పడుతుందని తెలిసే కాబోలు తనతో టార్చిలైట్ కూడా తీసుకువచ్చాడు. దానిని సంచిలో నుండి తీసి ప్రక్కన పెట్టాడు.

ఆమె మెడపై చేయివేశాడు.

చల్లగా తగిలింది.

ముందు ఆ బంగారు పట్టీ తప్పించాలని చూశాడు. కానీ అది మెడచుట్టూ గట్టిగా బిగుసుకుపోయి వుంది. అతను పీక నొక్కి ఆ కొక్కెం తప్పిద్దామనుకున్నాడు.

మెల్లగా నొక్కాడు.

అంతే! ఆ స్త్రీ నోటిలో నుండి నీరు సర్రున పైకి ఎగ జిమ్మింది. అది అతని మొహంపై పడింది. అంతవరకు యాంత్రికంగా తన పని తాను చేసుకుపోతున్న అతను భయంకరంగా అరుస్తూ వెనక్కి విరుచుకు పడిపోయాడు.

చీకటి చిక్కబడుతున్నది.

2

గంగరాజు టేబిల్ ముందు కూర్చున్నాడు.

టేబిల్ మీద రకరకాల మందు సీసాలు వున్నాయి. అందులో రకరకాల ద్రవాలు వున్నాయి.

టేబిల్‌కి ఆ ప్రక్క రామయ్య కూర్చున్నాడు.

ఇద్దరూ మందు కొడుతూ రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్య ఒకరు వేసిన జోకులకి ఇంకొకరు పగలబడి నవ్వుతున్నారు.

జీడిపప్పు, మాంసం తింటూ రంజుగా మాట్లాడుకుంటున్నారు. తింటూ త్రాగుతున్నారు.

బయట వర్షం కురుస్తున్నది. అప్పటికి ముసురుపెట్టి నాలుగైదు రోజులై వుంటుంది. "పెద్దిరాజుగారి పొలాలు బాగున్నాయట గదా!" గంగరాజు అన్నాడు.

"ఎంతయినా అదృష్టవంతుడు. చెరువు క్రిందనే వుంది భూమి. అయినా ఈ ముసురు ఇలాగే వుంటే ఆడి సంగతి తెలుస్తాది!" అన్నాడు రామయ్య.

ఆ వూరిలో మోతుబరి—పెద్దిరాజు. వున్న చెరువు, దాని నీరు ఎక్కువగా వుపయోగపడేది పెద్దిరాజు పొలాలకే. చెరువు క్రిందగా అతని పొలాలే వున్నాయి.

గంగరాజుకి, పెద్దిరాజుకీ వారు పుట్టినప్పటి నుండీ కలహాలు వున్నాయి. వారిద్దరి మధ్యా పచ్చిగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. గంగరాజుకి రామయ్య కుడిభుజం. అతను చెప్పిన ప్రతిమాటకి తాళం వేస్తుంటాడతను.

ఆ సంవత్సరం గంగరాజు పంటలు పూర్తిగా పాడై పోయాయి. పంటలు పూర్తిగా పండిన పెద్దిరాజు పరిస్థితి చూస్తుంటే అతనికి ఒళ్ళు మండింది.

"అయితే! రామయ్యా! పెద్దరాజు పొగరణచాలంటే ఏం చేయాలి....వచ్చే నెల్లో పంచాయతీ ఎలక్షన్‌లో ఆడు మనకి ఎగస్పార్టీగా పోటీ చేస్తాడట!" ఆగ్రహం వెలిబుచ్చాడు గంగరాజు.

"ఆడి మొహం! ఆడేం చేస్తాడు. అయినా ఈలోపే ఆడికి చిన్న షాక్ ట్రీట్‌మెంట్ ఇప్పిస్తే బాగుంటుంది."

"ఎలా?"

"ఆడికి ఈ పంటలే దిక్కు. అందుచేత ఆడి పంటల్ని నాశనం చెయ్యాలి!" మెల్లగా విషపు బీజం వేశాడు గంగరాజు చెవిలో.

గంపరాజు ఓ నిమిషం ఆలోచించాడు. "అయితే ఏం చేద్దాం!" అని అడిగాడు.

"మన వీర్రాజు లేడూ! వాడికి ఆ పని అప్పజెప్పితే సరి! ఈరోజు రాత్రి చెరువుకి గండి కొట్టి వచ్చేస్తాడు. దాంతో వర్షం వలన నిండిన నీరంతా పెద్దిరాజు పొలాల్ని ముంచేస్తుంది. ఈ దెబ్బనుండి తేరుకోడానికి ఆడికి చాలా టైం పడుతుంది. ఎవరికీ అనుమానం రాదు. ఎందుకంటే తుఫాన్ సూచనలు బాగా కనిపిస్తున్నాయి....వర్షాలు ఎక్కువగా పడుతున్నవి—" అన్నాడు.

3

ఆరోజు రాత్రి వీర్రాజు చెరువు దగ్గరికి వెళ్ళాడు. అప్పటికే చెరువులో నీరు నిండుగా వుంది. ఆ నీటివలన వూరిలో వారికి ప్రమాదం లేదని తెల్సుకొని గండికొట్టాడు. అంతే! నిముషాలలో ఆ నీరు అక్కడ పెద్దిరాజు పొలాలని పూర్తిగా ముంచేసింది.

పని పూర్తి చేసుకొని వీర్రాజు వచ్చాడు.

అప్పుడుకూడా గంగరాజు రామయ్య రూములో వెచ్చగా

కూర్చుని మందు కొడుతున్నారు.

"అయ్యగారూ! మీరు చెయ్యమన్నపని పూర్తిచేశాను!" అన్నాడు వీర్రాజు.

"నిజంగానా?" అంటూ గంగరాజు త్రాగుతున్న గ్లాసుని అక్కడ పడేసి వీర్రాజుని కౌగలించుకున్నాడు. "నువ్వూ మందు కొట్టు....ఇంద!" అంటూ ఆనందంగా గ్లాసు అందించాడు.

"ఒద్దండీ. నాకు అలవాటు లేదు!"

"అయితే అతని మామూలు ఇచ్చేయండి!" అన్నాడు రామయ్య.

గంగరాజు లోపలికి వెళ్ళి రెండు వందరూపాయల నోట్లు తెచ్చి అందించాడు.

వీర్రాజు శెలవు తీసుకుని ఇంటికి వచ్చేశాడు.

కానీ ఆరోజు అతని మనస్సేం బాగులేదు.

"ఏం అలా వున్నారు?" అతని భార్య రత్నం ఇంట్లో అడుగు పెట్టగానే అడిగింది.

"అబ్బే ఏం లేదు...." అన్నాడు వీర్రాజు.

రత్నం చదువుకుంది. లోకజ్ఞానం బాగా తెలుసు. భర్తకి ఉద్యోగం లేదని క్రుంగిపోలేదు. తెచ్చినదాంతోనే సరిపెట్టుకుంటున్నారు.

ఆ తర్వాత రాత్రి పడుకోబోయే ముందు—ఆరోజు తను చేసిన "ఘనకార్యం" గురించి చెప్పాడు. అసలు "అది తను చేయాలనుకోలేదని, కానీ డబ్బులుకోసం చేసానని" అన్నాడు.

"మీరు డబ్బులుకోసం ఎంతటి పాపపుపనులైనా చేస్తా రన్నమాట. ఎవరైనా డబ్బులిస్తామంటే నా పీకకూడా నొక్కేసి చంపేస్తారా?" ఆవేశంగా అడిగింది రత్నం.

"బాధపడకు రత్నం. మన కష్టాలు త్వరలోనే తీరి పోతాయి!" అన్నాడు.

అయినా ఆమె కోపం తగ్గలేదు. అతను ఎంత వూరడి స్తున్నా వూరుకోలేదు. ఓ ప్రక్కకి తిరిగి కోపంగా పడు కుంది.

పీర్రాజు ఏం మాట్లాడలేదు.

అసలు తను చేసిన తప్పేమిటి? చేసిన ప్రతి పనిగురించి భార్యకి చెప్పడమే పెద్ద తప్పు....ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయాడు.

4

డిటెక్టివ్ దినేష్ అని పైన బోర్డు చూసి లోపలికి అడుగుపెట్టింది. ఆమెను చూస్తే పేదరికంలో వున్నట్లు అనిపిస్తుంది.

"ఎవరు మీరు?" మర్యాదగా అడిగాడు దినేష్.

ఆమె తలొంచుకుని ఏమీ మాట్లాడకుండా నిల్చుంది.

"కూర్చోండి ముందు" అన్నాడు నెమ్మదిగా.

ఆమె అక్కడున్న కుర్చీలో కూర్చుంది.

"ఏమిటి మీ సమస్య? నేను మీకేమైనా సహాయపడ గలనా?" అడిగాడు.

"మావారు నిన్నటినుండీ కనిపించడం లేదు. ఎక్కడి కెళ్ళారో తెలియడం లేదు!"

"మీతో ఏం చెప్పలేదా?"

"ఆ ముందురోజు రాత్రి నేనూ ఆయనా దెబ్బలాడు కున్నాం. నిజం చెప్పాలంటే ఆయన్ని ఆ క్షణంలో అస హ్యించుకున్నాను. కానీ ఆయన వెళ్ళిపోయారంటే ఏదో భయంగా వుంది!"

ఓ క్షణం అతను ఏం మాట్లాడలేదు.

"మీరు ఆరోజు యెందుకలా ప్రవర్తించారు. తెల్సుకోవచ్చా! చెప్పండి!"

ఆమె చెప్పాలా వద్దా! అంటూ కొంతసేపు తటపటాయించింది. ఆ తర్వాత నెమ్మదిగా గంగరాజుతో భర్త స్నేహం ... పెద్దిరాజుతో గంగరాజు వైరం వలన గండి కొట్టడం .. ఆ తర్వాత రాత్రి తను దానిని వ్యతిరేకించడం. ఒకొక్కటి అన్ని విషయాలు చెప్పేసింది. చెప్పిన తరువాత ఆమె గుండెలో గూడుకట్టుకున్న బరువు దించేసినట్లు అయింది.

దినేష్ వివరాలు రాసుకున్నాడు.

"ఆ పర్నాటినుండీ మీ ఆయన .. అవునూ ఆయన పేరేమిటి?...." అడిగాడు.

"వీర్రాజుగారు! నా పేరు రత్నం."

"వీర్రాజుగారు ఆ పర్నాడు నుండీ కనిపించటంలేదు. అంటే గంగరాజు మనుషులు అతనిని ఏమైనా చేసారని అనుకోవచ్చా? గంగరాజుమీద మీ అభిప్రాయం ఏమిటి?"

"గంగరాజు దుర్మార్గుడు. తన విరోధులు పచ్చగా వుండడం చూసి సహించలేని పరమ కిరాతకుడు."

"మీ ఆయన ఫొటో వుందా?"

రత్నం హేండ్‌బాగ్‌లోంచి చిన్న ఫొటోతీసి ఇచ్చింది. దానిని టేబిలుమీద పెట్టుకున్నాడు.

"నాకు పోలీసులకి రిపోర్టు ఇవ్వడం అసలు ఇష్టంలేదు. అందుకే చాలా దూరమైనా మీ దగ్గరికే వచ్చాను. దయచేసి నాకు సహాయం చేయండి!" అంటూ పైకి లేచింది.

"తప్పకుండా. దుర్మార్గుల్ని, దోషుల్ని పట్టుకోవడమే మా కర్తవ్యం!" అన్నాడు.

ఆమె వెళ్ళిపోయింది.

5

"హలో దినేష్!"

"రా....రా....చాలా రోజులకొచ్చావు. ఈ మధ్య అసలు కనిపించడం లేదు. నా మీద సీతకన్ను వేశావా?" చనువుగా అన్నాడు దినేష్.

ఇన్‌స్పెక్టర్ సునీల్ వచ్చి కూర్చున్నాడు.

ఇద్దరూ స్నేహితులు....చాలా కేసులు ఇద్దరు కలిపి డీల్ చేస్తుంటారు. వారు తరుచూ కలుస్తూ కేసులుగురించి మాట్లాడుకుంటుంటారు.

"ఈ ఫోటో ఏమిటి?" టేబిల్ మీద వున్న వీర్రాజు ఫొటోని చేతుల్లోకి తీసుకున్నాడతను.

"అవును సునీల్! నీకో విషయం చెప్పాలి. రామాపురం చెరువుకు గండిపడింది. వినే వుంటావు. దానిని గండికొట్టిన మహానుభావుడు ఇతనే!"

"ఇతనా? చదువుకున్న మంచివాడిలా అనిపిస్తున్నాడే!" అన్నాడు ఫోటోని త్రిప్పిచూస్తూ.

"నీకో మంచి కేసు. ఆ గండిని కొట్టించిన వారెవరో కూడా తెలుసు. గంగరాజు అనేవాడికి ఇందులో సంబంధం వుంది. వాడిని అదుపులోకి తీసుకో. వీడు ప్రస్తుతం ఎక్కడున్నాడో తెలీదు. గంగరాజు తన రహస్యం వీడు అందరికీ చెప్పేస్తాడని ఏమైనా చేసివుండవచ్చు—"

"ఇంతకీ నీకీ విషయం యెవరు చెప్పారు?"

"అతని భార్యే చెప్పింది!"

సునీల్ ఫోటోని క్రింద పెట్టేస్తూ "నిన్నో మొన్నో యెక్కడో చూపినట్లు అనిపిస్తుంది ఈ మొహాన్ని ....మనుషులు పోలిన మనుష్యులుండవచ్చుకదా?"

"చూస్తే చూడవచ్చు. ఇతను తరుచూ వూర్లు తిరుగు

తుంటాడట?” దినేష్ అన్నాడు.

“వచ్చినందుకు కేసు చూపించావు. ఇప్పుడే గంగరాజు దగ్గరికి వెళుతున్నాను. ఏ వివరాలు తెల్సినా వెంటనే తెలియజేస్తాను బై....” లేచి నిల్చున్నాడు సునీల్.

అతనికి షేక్‌హేండిచ్చాడు దినేష్.

6

“హలో దినేష్!”

దినేష్ ఫోనులో సునీల్ కంఠాన్ని గుర్తించాడు.

“గంగరాజుని, అతని బంటుని అరెష్టు చేశాను. వారికి కూడా వీర్రాజు యెక్కడున్నాడో తెలియదట. ఎలా తెలుస్తుందిలే! అతనున్నది ఇంకా దగ్గరైతే!”

“ఎక్కడ?”

“అతను ప్రస్తుతం నాకు దగ్గరగానే వున్నాడు. నువ్వు వెంటనే బయలుదేరి రా—?”

ఆ తర్వాత దినేష్ అతను చెబుతున్న వివరాలన్నింటిని రాసుకున్నాడు. వెంటనే మోటార్ సైకిల్ తీసుకుని బయలుదేరాడు. చాలాదూరం....గంటపైగా టైం పట్టింది.

తుపాన్ వెలసిపోయిన చిహ్నాలు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో రెండురోజుల క్రితం ఇళ్ళు కూలిపోయి చాలామంది చనిపోయారు. కొన్ని పల్లె గ్రామాలు పూర్తిగా మునిగిపోయాయి.

దూరంగా పోలీసులు వున్నారు.

ఓ ప్రక్క కుప్పలుగా వున్న శవాలను పెట్రోలువేసి తగలబెడుతున్నారు. నేలంతా ఇంకా చెమ్మగా వుంది. అక్కడ పరిస్థితి పరమ రోతగా వుంది

దినేష్‌ని చూసి సునీల్ దగ్గరికొచ్చాడు.

“రా చూపిస్తాను....అతనిలో వీర్రాజు పోలికలు చాలా

కనిపించాయి. అందుకే నీకు ట్రంకాల్ చేశాను!" అంటూ ముందుకి నడిచాడు.

దినేష్ అతనిని అనుసరించాడు.

అక్కడ ఒక స్త్రీ శవం వుంది. ఆ ప్రక్కగా అతని శవం వుంది. అతని ప్రక్క సంచి....

దినేష్ ఫోటో తీసి మరోసారి చూశాడు. అనుమానం లేదు. అది వీర్రాజు శవమే!

"బహుశా! ఆరోజు రాత్రి ఇక్కడికి వచ్చేసి ఈ వరదలో చిక్కుకొని వుండవచ్చు!" సునీల్ అన్నాడు.

"రెండు శవాలని పరీక్షగా చూస్తే ఓ విషయం స్పష్టమవుతుంది. ఈ రెండు శవాలు ఒక్కసారి చనిపోలేదు. ఈ వీర్రాజు రాత్రి చనిపోయినట్లుగా అనపిస్తుంది. ఇద్దరి మొహాల్లోను చావుభయం స్పష్టంగా కనిపిస్తున్నది—" అన్నాడు దినేష్.

"అయితే యెవరైనా చంపేసి ఇతని శవాన్ని ఇక్కడ పడేసి వుంటారా?" సునీల్ అనుమానం.

"అదికూడా కాకపోవచ్చు. ఎందు కంటే ఈ ప్రాంతంలో, ఈ పరిస్థితుల్లో ఎవరూ చంపాలని అనుకోరు."

సునీల్ క్రిందకి వంగి సంచి తీశాడు. దినేష్ కూడా ఆసక్తిగా చూశాడు. అందులో చాలా బంగారు ఆభరణాలు గాజులు.... మంగళసూత్రాలు.... ఉంగరాలు చాలావున్నాయి. అవి సుమారు రెండు కేజీలుండొచ్చు "ఇవెలా వచ్చాయి!" అడిగాడు దినేష్.

సునీల్ పోలీసు బుర్ర ఆలోచించింది.

"బహుశా ఒకటి కావచ్చు ఇంట్లోంచి భార్య తిరస్కారంతో వచ్చేసిన ఇతను డబ్బు సంపాదించాలని ఆలోచన కలిగి, ఈ పరిస్థితిని వూహించుకొని ఇక్కడికి వచ్చి వుండ

వచ్చు. వరదల్లో శవాల ఒంటిమీదనున్న ఆభరణాలు తీయడానికి వచ్చి వుండవచ్చు....అయినా అలాంటప్పుడు ఇక్కడ ఎలా చనిపోతాడు....ఈ శవందగ్గరే చనిపోవల్సిన పరిస్థితేమిటి?" అన్నాడు సునీల్ సాలోచనగా.

దినేష్ ఆ స్త్రీ శవం మెడపై చూశాడు. బంగారు పట్టీ సగం విడిపోయి వుంది. 'వీర్రాజు బంగారు నగలు తీసుకుంటూ ఆమె మెడమీద పట్టీ తీయబోయే ముందు చనిపోయాడా?'__అతనిలో ప్రశ్న.

ఆమె నోరు తెరిచి వుంది. నోటిలో కొద్దిగా నీరు వుంది. వాటిమీద ఈగలు వాలి అసహ్యంగా కనిపిస్తుంది.

"సునీల్! అసలు జరిగిందేమిటో తెల్సిపోయింది?"

"ఏమిటి?"

"వీర్రాజు! ఈమె మెడమీద పట్టీ తీయబోయాడు. కానీ అప్పటికే నీటిలో కొట్టుకుపోయి నీరు మింగేయడం వలన బాగా ఉబ్బిపోయి వుంటుంది. ఇతను పట్టీ తీయడానికి బిగుతుగా వుండటం వలన పీక నొక్కి వుండవచ్చు. అదే సమయంలో ఆమె నోటిలో నీరు పైకి పుక్కిలించినట్లు వచ్చి, అతను ఈ ఒంటరి ప్రదేశంలో భయంతో గుండె ఆగి చనిపోయి వుండావచ్చు. అంతే; అందుకే నగల సంచినికూడా అలాగే ఒదిలేశాడు!" దినేష్ నెమ్మదిగా చెప్పాడు.

"నిజమే అయివుండొచ్చు. చనిపోయినవారి కోసం ఓ ప్రక్క ఏడుస్తుంటే, శవాల నగలను ఏరుకుందామనుకునే ఇలాంటివారికి తగిన శిక్షే లభించింది. ఇతనిగురించి చెప్పేటప్పుడు "పాపం!" అనిపించింది. కానీ ఇప్పుడు నాకు ఏ జాలీ కలగడం లేదు" అన్నాడు సునీల్.

"ఈ విషయం ఆమెకి తెలియజేస్తాను!" ముందుకి కదిలాడు డిటెక్టివ్ దినేష్. □

లక్ష్యకోసం

పి. అరుణ



"పోనీ—ఏదైనా బేంక్ దోపిడీ చెయ్యమంటావా?"
అన్నాడు రంగబాబు.

"నిజంగా నీకంత ధైర్యం వుంటే నా'ష్టమే." అన్నది శారద.

వాళ్ళు ఆ పార్కులో గుబురుగా వున్న ఒక పొద చాటున కూర్చున్నారు.

అప్పుడు టైము ఆరుగంటలు దాటుతోంది. కొంచెం చలిగా వుంది. చీకటి పడుతోన్నది. దీపాలు వెలిగాయి కూడా—

ఇంకా అక్కడక్కడ పార్కులో కొంతమంది జంటలుగా కూర్చున్నారు.

"నాకు నిజంగానే ధైర్యంలేదు. నిజమే. కాని నీ కోసం ఏదైనా అంటే ఎంత సాహసానైనా చెయ్యాలని అనిపిస్తోంది" అన్నాడు.

శారద నవ్వింది.

"దయచేసి అలాంటి సాహసాలు చెయ్యకు. నువ్వు జైల్లో కూర్చుంటావ్. అప్పుడు నేను నిజంగానే ఎవరో ఒకర్ని పెళ్లాడి జీవితాంతం ఏడవాల్సి వుంటుంది....ఇంకేదైనా మార్గం ఆలోచించు" అన్నది.

"ఎంత ఆలోచించినా మార్గం కనపడటం లేదు శారదా.. లక్షరూపాయలు సంపాదించే మార్గం ఒక్కటే వుంది."

"ఏమిటి?"

"లాటరీ టిక్కెట్టు"

మళ్ళీ నవ్వింది.

"గుడ్ జోక్" అన్నది.

"నీకు జోక్‌గానే వుంటుంది. కాని ఈ దేశంలో ఎంత మంది మనుషులు లాటరీ టిక్కెట్లు కొంటున్నారో నీకు తెలుసా?"

"ఈ దేశంలోనే కాదు. చాలా దేశాల్లో మనుషులు లాటరీ టిక్కెట్లను బాగానే కొంటున్నారు. సులభంగా ధనవంతులు కావాలనే ఆశ అన్ని దేశాల మనుషుల్లోనూ

వుంటుంది."

"దొంగతనమో - దోపిడీలో చేసి ధనవంతులు కావటం కంటే లాటరీ టిక్కెట్టుతో ధనవంతుడు కావాలనుకోవటం మంచిది." అన్నాడు రంగబాబు.

అప్పుడు శారద విసుక్కుని "ఇంతకీ నువ్వు మన ముందున్న అసలు సమస్య గురించి మరచిపోయి ఇంకేమిటో మాట్లాడుతున్నావ్. కనీసం లక్షరూపాయలు వుంటే నువ్వు ఏదో ఒక బిజినెస్ మొదలుపెట్టవచ్చు. అప్పుడు మా నాన్న కొంతవరకైనా తృప్తిపడి మన పెళ్ళికి ఒప్పుకుంటాడు. లేకపోతే మనం విడిపోక తప్పదు" అన్నది.

ఆమె స్కైయ్‌బ్లుకలర్ చీర కట్టుకుంది. అదే రంగు బ్లవుజును కూడా వేసుకుంది మేచింగ్‌గా—

అతను చాలా మామూలు దుస్తులు ధరించివున్నాడు.

ఐనా ఆమె—అతడ్ని ప్రేమించింది. పెళ్ళి చేసుకోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నది.

"నాకేమీ తోచటంలేదు. నువ్వే ఆలోచించు" అన్నాడు రంగబాబు.

శారద రెండు నిముషాలు ఆలోచించి "ఇంతకుముందు నువ్వు నా కోసం ఎలాంటి సాహసమైనా చేస్తానన్నావు కదా?" అన్నది.

"అవును" అన్నాడు రంగబాబు.

"ఐతే నువ్వొక సాహసం చెయ్యి" మెరుస్తున్నకళ్ళతో అన్నది—

"ఏమిటాసాహసం?" ఆత్రంగా అడిగాడు.

"సాహసంతో కూడుకున్న ప్లాను. కొంతవరకు అమలు పరచటం తేలిగ్గానే వుంటుంది. కాని ఆ తర్వాతనే కొంచెం కష్టంగా వుంటుంది."

ఈసారి అతను విసుక్కుని "అసలు ఆ ప్లానేమిటో ముందు చెప్పు. సస్పెన్స్‌లో పెడుతున్నాననుకుని బోర్ కొట్టిస్తున్నావ్" అన్నాడు.

"ఆల్‌రైట్ చెబుతాను. నువ్వు నన్ను ఎక్కడైనా రహస్యంగా దాచివుంచు. నన్ను కిడ్నాప్ చేశానని—లక్ష రూపాయలు ఇవ్వకపోతే నన్ను చంపుతాననీ ఫోన్‌లో మా నాన్నను బెదిరించు. నేనంటే మా నాన్నకు ప్రాణం కాబట్టి తప్పకుండా లక్షరూపాయలు ఇస్తాడు. ఆ డబ్బుతో నువ్వు ఏదైనా బిజినెస్ మొదలుపెట్టవచ్చు" అన్నది శారద.

"ఈ ప్లాను నా వల్ల జరిగేదేనంటావా?" నీరసంగా అడిగాడు రంగబాబు.

"తప్పకుండా అవుతుంది. నా కోసం మన ప్రేమకోసం నువ్వు ఈ సాహసం చెయ్యకతప్పదు రంగబాబూ....ఐనా నువ్వు నన్ను కిడ్నాప్ చెయ్యాల్సిన అవసరంలేదు కదా. నేనే నీ వెంటవస్తాను. ఇక నువ్వు బాస్‌లా ఫోన్లో మా నాన్నను బెదిరించి ఆ లక్షరూపాయలు వసూలు చేసుకోవటం. ఇంతేకదా. వెరీ ఈజీ. భయపడకు" అన్నది శారద.

"నీ కోసం ఒప్పుకుంటున్నాను. కాని—జైల్లో పడతానేమోనని భయంగా వుంది ఈ వ్యవహారంలో" అన్నాడు రంగబాబు.

"అలాంటి పరిస్థితివస్తే ఇందులో నీ తప్పులేదని మన ప్లాన్‌గురించి చెబుతాను. ఈ ప్లాను గురించి ఇంకా ఆలోచించి రేపు రాత్రికి నీకు చెబుతాను. రేపు రాత్రి ఏడు గంటలకు మనం ఈ పార్కులోనే కలుసుకుందాం"

"సరే" అన్నాడు రంగబాబు దూరంగా పార్కులో వెలుగుతున్న దీపాన్ని చూస్తూ—

2

రాత్రి—ఏడుగంటలకు ఎనిమిది నిముషాలు తక్కువ.

పార్కురోడ్‌లోకి తిరిగింది శారద. ఆ రోడ్డులో రెండు దీపాలు వెలగటంలేదు. అక్కడ బాగా చీకటిగా వుంది. దూరంనించి వెలుతురు పడుతోంది కాని—అది మసగ్గా వుంది.

ఆమె చీకట్లోకి రాగానే వెనుకనించి నలుపురంగు ఎంబాసిడర్ కారు దూసుకుని వచ్చింది.

రోడ్డు పక్కకు తప్పుకుంది శారద.

కారు ఆమె పక్కనే ఆగింది. చటుక్కున డోరు తెర్చుకుంది. లోపలున్న మనుషులు శారద నోరుమూసి కార్లోకి లాగారు.

లాగి - మత్తుమందు స్ప్రేచేసిన కర్చీఫ్‌ను శారద మొహం మీద అదిమి వుంచారు. ఆమె తనకు కలిగిన షాక్ నించి తేరుకోకముందే స్పృహ కోల్పోయింది.

అంబాసిడర్ కారు. పార్కు ముందు నించే వెళ్ళిపోయింది. ఆ సమయంలో పార్కులోపల రంగబాబు ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు. అతను గేట్లోనించి కారుని చూశాడు.

కాని - అందులో శారద వున్నట్టు అతనికి తెలీదు కాబట్టి దాని గురించి పట్టించుకోలేదు.

ఆ కార్లో నలుగురు మనుషులు వున్నారు డ్రయివర్‌తో కలుపుకుంటే—

కొంచెంసేపు ప్రయాణంచేసిన తర్వాత కారు స్థావరానికి వచ్చి ఆగిపోయింది.

ఓ ఐదు నిముషాల తర్వాత అనుచరులు శారదను బాస్ దగ్గరకు తీసుకువచ్చారు.

"గుడ్. ఇంతవరకు మనం అనుకున్నట్టుగానే జరిగింది" అన్నాడు బాస్.

"అవును బాస్" అన్నారు వాళ్లు.

"ఈమెను తీసుకురావటం ఎవ్వరూ చూళ్లేదు కదా"

"చూళ్లేదు బాస్....పార్కు రోడ్‌లో కొంతదూరం చీకటిగా వుంది. అక్కడే పట్టుకుని కార్లో వేసుకొచ్చాం"

"వెరీగుడ్. ఇక స్పృహ తెప్పించండి."

కొంతసేపటికి శారదకు వాళ్ళు స్పృహ తెప్పించారు.

ఆమె కళ్ళు తెరిచి ఎదురుగావున్న మనుషులను చూసి కెవ్వుమన్నది.

"అరవకు....అరిస్తే ప్రమాదం" అన్నాడు బాస్. అతని చేతిలో పదునైన కత్తి ప్రత్యక్షమయ్యింది.

నోరు మూసుకుంది శారద కత్తికి భయపడి.

బాస్ నవ్వి "తెలివిగా ప్రవర్తించావ్" అన్నాడు.

అప్పుడామె మళ్ళీ ధైర్యం తెచ్చుకుని "ఎవరు మీరు? నన్నెందుకు తీసుకొచ్చారు?" అన్నది.

"నీలాంటి ధనవంతుల అమ్మాయిలను—గారాబంగా చూసుకునే చిన్నపిల్లల్ని కిడ్నాప్‌చేసి తీసుకొచ్చి ఆ ధనవంతుల్ని బెదిరించి లక్షలు వసూలు చేసుకునే మనుషులం. నిన్నుకూడా అందుకే కిడ్నాప్‌చేసి తెచ్చాం." బాస్ చెప్పాడు, కత్తిని అటూ ఇటూ వూపుతూ—

శారదకు వణుకు పుట్టింది. అప్పుడే ఆశ్చర్యం కూడా కలిగింది. తనని కిడ్నాప్‌చేసి దాచి వుంచినట్టుగా నాటకం ఆడమని రంగబాబుకు తను ఓ ప్లాను చెప్పింది. కాని__ ఇప్పుడు తనని నిజంగానే కొంతమంత మనుషులు కిడ్నాప్ చేసి తెచ్చారు.

ఇదెలా జరిగింది?

"అంతా నువ్వు చెప్పినట్టుగానే జరిగింది కదూ?" బాస్ అడిగాడు సిగరెట్టు పొగ వదులుతూ—

"మీకెలా తెలుసు?"

"నువ్వు పార్కులో నీ ప్రేమికుడుతో ఈ కిడ్నాపింగ్ ప్లాను గురించి చెబుతున్నప్పుడు మీకు కొంచెం దూరంలో ఓ చెట్టుచాటున కూర్చున్న మా అనుచరుడు నెంబరు నాలుగు అంతా విన్నాడు. నాతో చెప్పాడు. వెంటనే ఓ ప్లాను సిద్ధంచేశాం. ఇప్పుడు దాన్ని అమలుపరిచాం"

అంతా నా దురదృష్టం. పార్కుల్లో ఇలాంటి వాళ్ళు తిరుగుతూ వుంటారని తెలుసుకోలేక పోయాననుకుంది శారద.

"ఇప్పుడు మీ నాన్నకు ఫోన్‌చేసి నిన్ను కిడ్నాప్ చేసినట్టుగా చెప్పి బెదిరిస్తాను" అంటూ బాస్ ఫోన్‌దగ్గరకు వెళ్ళాడు.

నెంబర్ డయల్‌చేసి నిమిషం తర్వాత "హలో" అన్నాడు.

"నేనెవరో నీకు అవసరంలేదు. మీ అమ్మాయిని మేము కిడ్నాప్‌చేసి తీసుకొచ్చాం" అన్నాడు బాస్ గంభీరంగా—

"నిజంగానా" అవతలివైపునించి అడిగాడు శారద తండ్రి జనార్ధనం.

"అవును. నీకు అనుమానం వుంటే ఆమెతో మాట్లాడిస్తాను. సరే. మీ అమ్మాయి క్షేమంగా మిమ్మల్ని చేరుకోవాలంటే మీరు లక్షరూపాయలు మాకు ఇవ్వాల్సివుంటుంది. ఆ డబ్బును ఎలా నాకు అందచేయాలంటే....?"

బాస్ పూర్తిచెయ్యకముందే జనార్ధనం "నేనివ్వను" అని ఫోన్ పెట్టేశాడు.

షాక్ తిన్నాడు బాస్.

3

శారదతో బాస్ అన్నాడు ఇలా—

"మళ్ళీ మీనాన్నకు ఫోన్ చేస్తాను. ఈసారి కూడా మొండిగా డబ్బు ఇవ్వనని చెప్పి ఫోన్ పేట్టేశాడంటే నిన్ను కత్తితో పొడిచి చంపి నీ శవాన్ని మీ నాన్నకు పంపుతాను. ఈ విషయాన్ని నువ్వే మీ నాన్నతో చెప్పు"

తల వూపింది శారద భయంనిండిన కళ్ళతో—

డయల్ చేశాడు.

తర్వాత "హల్లో" అన్నాడు.

"నువ్వా? మళ్ళీ ఎందుకు ఫోన్ చేశావ్? నీకు ఒక్క రూపాయి కూడా ఇవ్వను"

"నువ్వే ఇస్తావ్. లేకపోతే నీ కూతురు శవాన్ని నీకు పెట్టెలో వుంచి పంపుతాం. ఈ విషయం మీ అమ్మాయే నీకు చెబుతుంది. కావాలంటే విను" అని రిసీవర్‌ని శారద కిచ్చాడు.

"నాన్నా....బాస్ చెప్పిన మాటలు నిజంనాన్నా.... నువ్వు ఆ లక్షరూపాయలు ఇవ్వకపోతే వీళ్లు నన్ను నిజం గానే కత్తితోపొడిచి చంపి పెట్టెలోవుంచి నీకు పంపుతారు. అందుకే నా కోసం నువ్వు ఆ లక్షరూపాయలను బాస్‌కు ఇవ్వటానికి ఒప్పుకో నాన్నా" అన్నది ఏడుస్తున్న గొంతుతో—

"భయపడకు....నిన్నేమీ చెయ్యరు...." అని ఫోన్ పెట్టేశాడు.

ఈసారి శారద షాక్ తిన్నది.

"ఫోన్ డిస్కనెక్ట్ చేశాడా?" అడిగాడు బాస్.

తలవూపింది ఆమె.

"ఇడియట్. ఎంత ధైర్యం? ఇంత మొండి ధన వంతుడ్ని ఇంతవరకు నేను చూళ్లేదు. అసలు మీ నాన్నకు నువ్వంటే ఇష్టంవుందా?" అనడిగాడు శారదను బాస్.

ఆ మాటకు శారద అదిరిపడి "నేనంటే మా నాన్నకు ప్రాణం. నాకు పాకెట్ మనీ కూడా బాగానే ఇస్తాడు. అందుకే నాకూ అర్థం కావటంలేదు" అన్నది.

"అంతా కపటప్రేమ. నీ కంటే డబ్బుమీదనే మీ నాన్నకు ఎక్కువ ఇష్టం. అందుకే ఇంత మొండిగా వున్నాడు."

"ఏమో....ఇప్పుడు నాకూ్కడా అలాగే అనిపిస్తోంది" అన్నది శారద.

ఆమెను ఓ గదికి తీసుకెళ్ళమని చెప్పాడు బాస్ ఓ అనుచరుడితో.

ఆ అనుచరుడు శారదను ఓ గదిలోకి తీసుకెళ్ళి తలు పులు మూసి తాళంవేశాడు.

ఆ గదిలో దీపం వెలుగుతోంది.

మంచం దానిమీద పరుపు వున్నాయి. ఓ మూలగా బల్ల మీద కూజాలో నీళ్ళు—గ్లాసు వున్నాయి.

మంచంమీద పడుకుంది శారద. ఆమె ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది.

4

ఆరుగంటలు అవుతున్నప్పుడు ఆమెకు మెలకువ వచ్చింది.

తలుపులమీద చప్పుడవుతోంది.

శారద లేచి తలుపులు తెర్చింది. బాస్ ఇద్దరు అనుచరులతో లోపలకు వచ్చి "నిన్ను వదిలిపెడుతున్నాం" అన్నాడు.

"నిజంగానా?"

"అవును. మీ నాన్నకు మళ్ళీ ఫోన్ చేశాను. ఒక్క రూపాయి కూడా ఇవ్వనని ఫోన్ పెట్టేశాడు. ఇలాంటి మనుషులను ఎలా లొంగదీసుకోవాలో మాకు తెలుసు. ఐతే మీ నాన్న మొండివాడని నిన్ను వదిలెయ్యటంలేదు. నీ ప్రేమికుడు నీ కోసం వెతుకుతూ వుంటాడు. అతడ్ని బాధపెట్టటం ఇష్టంలేక నిన్ను వదిలిపెడుతున్నాం" అన్నాడు బాస్.

"నిజంగా మీరెంతో మంచివాళ్ళు. కిడ్నాపర్స్‌లోకూడ మంచి మనుషులు వుంటారని ఇప్పుడే తెలుసుకున్నాను" అన్నది శారద.

"మా మంచితనం నీకు అర్ధమయినందుకు థాంక్స్. మేం ధనవంతుల దృష్టిలోనే దుర్మార్గులం. ఐతే మేము ధనవంతుల్ని బెదిరించే దోచుకుంటున్నది మేం లక్షాధికారులు కావటానికి కాదు. ధనవంతుల్ని దోచుకుని దాన్ని ఎంతో మంది పేదవాళ్ళకు పంచివ్వటానికి. మా అందరి ఆశయం ఇదొక్కటే."

"మీ ఆశయం గొప్పది"

ఆమె కళ్ళకు నల్లటి రిబ్బన్ను కట్టమని చెప్పాడు బాస్.

"నేను మీ అందర్నీ చూశానుకదా. బయట ఎప్పుడైనా మిమ్మల్ని గుర్తుపట్టి మీ గురించి అందరికీ చెబుతాననే భయం మీకులేదా?" అనడిగింది శారద వెళ్ళబోయేముందు.

బాస్ నవ్వి "మేము బయటకు వచ్చేటప్పుడు మారు వేషాల్లో వుంటాం. నువ్వు మమ్మల్ని పోల్చుకోలేవు" అన్నాడు.

కొన్ని నిముషాలకు నల్లరంగు అంబాసిడర్ కార్లో అనుచరులతో బయల్దేరింది శారద.

ఓ పదిహేను నిముషాల తర్వాత వాళ్ళు ఆమెను రోడ్డు మొదట్లో దింపి కార్లో మాయమైనారు.

ఆమె లోపలకు వచ్చేసరికి కుర్చీ వెనక్కువాలి పేపర్ చదువుకుంటున్న తండ్రి కనిపించాడు.

వెళ్తూనే "నువ్వింత మొండివాడివనుకోలేదు నాన్నా. కిడ్నాపర్స్ నా ప్రాణం తీస్తానని చెబుతున్నా ఒక్క రూపాయకూడా ఇవ్వనంటావా?" అన్నది.

"సర్లే....నాకు అంతా తెలుసు" అన్నాడు ఆమె తండ్రి జనార్ధనం.

"ఏమిటి?"

"నువ్వు అతనెవరితోనో పార్కులో ఈ నాటకం గురించి చెబుతున్నప్పుడు మన వంటవాడు విని నాతో చెప్పాడు. ఇది లక్షరూపాయల కోసం నువ్వాడిస్తున్న నాటకమే కాబట్టి రూపాయకూడా ఇవ్వనన్నాను"

"మైగాడ్" అని తల పట్టుకుంది శారద.

ఇదా జరిగింది!!

నిజంగా జరిగినదాన్ని తండ్రితో చెప్పింది. అప్పుడా యన కంగారుగా "నీకేమీ జరగలేదు కదా?" అనడిగాడు.

"లేదునాన్నా...వాళ్లు మంచి కిడ్నాపర్స్....వాళ్ళ ఆశయాలు చాలా గొప్పవి" అన్నది.

"సర్లే ఇంకెప్పుడూ ఇలాంటి ప్లానులగురించి ఎవరికీ చెప్పకు. ఏ ప్లానూ అవసరం లేకుండానే నీ పెళ్ళి నువ్వు కోరుకున్న మనిషితో జరిపిస్తాను" అన్నాడు తండ్రి.

సంతోషంగా "థాంక్ యూ వెరీమచ్" అన్నది ఆమె.

ఆమెకు సరిగ్గా అప్పుడే గేటు ఎదురుగా విచారంగా నిలబడి ఇంటివైపు చూస్తున్న రంగబాబు కనిపించాడు. రివ్వున బయటకు దూసుకు వెళ్ళింది శారద. ◻

సినీనటి హత్య

శివరామ్

ట్రింగ్, ట్రింగ్ మంటున్న ఫోన్ విసుగ్గా యెత్తుకొన్నాను.

అవతలి కంఠం వినగానే నా స్వరంలో విసుగు మాయమయింది.

ఫోన్ చేసింది రెడ్డి!

"హలో!"

"హలో! నువ్వేనా! అర్జంటుగా ఐదు నక్షత్రాల హోటల్ కొచ్చాయ్!"

"అయిదు నక్షత్రాల హోటలా?" తెల్లబోయాను.

"అబ్బా! అదేనయ్యా! దానిపేరే ఫైవ్‌స్టార్ హోటల్. అబిడ్స్‌లో వుంది వచ్చేయ్!"

ఫోన్ పెట్టేసాడు. ఉత్త హడావిడి మనిషి. విషయం ఏమిటో చెప్పొచ్చు కదా! అనుకొంటూ చేతిలో వున్న వీక్లీని పడేసి, లేచి డ్రస్సింగ్‌రూమ్‌లోకి పోబోయాను.

ఇంతలో హఠాత్తుగా స్ప్రింగ్‌డోర్స్ తెరుచుకొని ఓ వ్యక్తి హడావిడిగా వచ్చాడు.

మనిషి మొఖం ఖంగారుగా వుంది. ఒంటి నిండా చెమట్లు క్రమ్మి వున్నాయి.

లాల్చి, సరిగంచు, ఎగదువ్విన క్రాఫ్—పెద్దమనిషిలా వున్నాడు.

నన్ను చూడగానే,

"సార్! డిటెక్టివ్ శాతకర్ణి...."

"నేనే."

అంతే!

హఠాత్తుగా నా చేతులు పట్టుకొన్నాడు.

"నన్ను మీరే రక్షించాలి. తప్పదు. మీ రొక్కరే సమర్థులు."

మృదువుగా చేతులు విడిపించుకొన్నాను.

"ముందు కూర్చోండి. ఆ తర్వాత మీ ప్రాబ్లమ్ చెప్పండి."

అతను కూర్చొన్నాడు. కర్చీఫ్ తీసి మొఖం తుడుచుకొన్నాడు.

మనిషి కొద్దిగా తమాయించుకోగానే,

"ఇప్పుడు చెప్పండి!" అన్నాను కుర్చీలో రిలాక్స్డ్‌గా వెనక్కి వాలుతూ.

"నా పేరు భజగోవిందం. సినీ ప్రొడ్యూసర్ని. తెలుగు ఫీల్డ్‌లో నేను తీసినన్ని సినిమాలు బహుశా యే సంస్థ తీసుండదు."

"ఐసీ!"

"ప్రతి సంవత్సరము కనీసం నావి ఐదారు సినిమాలు రిలీజవుతాయి."

మౌనంగా వినసాగను.

"నా దగ్గర నూటయాభై మందిదాక పర్మినెంట్ స్టాఫ్ వుంది. దాన్నిబట్టి అంచనా వేసుకోండి, మా సంస్థ సినీ ఫీల్డ్‌లో యెంత పాతుకొనిపోయి వుందో!

"కానీ....రాత్రి నేను ఒక విచిత్ర పరిస్థితిలో యిరుక్కొన్నాను. దాంతో నా పరువు, ప్రతిష్టే కాదు. నా జీవితం కూడా సర్వనాశనం కాబోతున్నది. నన్ను మీరే రక్షించాలి."

"ఆవేశపడకండి!"

దిగులుగా నవ్వి, "ఆవేశం కాదండి బాబు! ఆవేదన. రాత్రి నేనో హత్యలో యిరుక్కొన్నాను." మెయిలింగ్ ఉలిక్కిపడ్డాను. నిర్మాతంటే ఏదో బ్లాక్ కేసు కాబోలనుకొన్నాను.

"చెప్పండి! అసలేం జరిగింది?"

"మా సినిమాలో యెక్కువగా నటించే శ్రీలేఖని యెవరో హత్య చేసారు. అదీ నేను ప్రక్క నుండగానే....

నిజం చెప్పొద్దూ నాకూ చాలా బాధేసింది.

శ్రీలేఖ—ఆంధ్రుల అభిమాన తార నా కూడా అభిమాన తారే. ఎటువంటి క్యారెక్టరైనా ఆమె అతికినట్టు సరిపోతుంది.

'మహానటి'—ఆమె కిచ్చిన బిరుదు. దాన్ని సార్థకం చేసుకొన్న నటి ఆమె."

"ఎలా జరిగింది?"

"శ్రీలేఖ. నేనూ కల్సి రాత్రి డిన్నర్ తీసుకొన్నాం. డిన్నర్ తీసుకొన్న తరువాత ఆమె నన్ను తన రూమ్‌కి రమ్మని ఆహ్వానించింది.

మాకవి మామూలే గనుక వెళ్ళాను. చిత్తుగా తాగాం. కల్సి పడుకొన్నాం. నాకు నా శరీరం స్వాధీనంలో లేదు.

అలా ఎంతసేపు గడిచిందో ఏమో! హఠాత్తుగా 'అబ్బా!' అన్న కేక విన్పించింది. ఉలిక్కిపడి లేచాను. నా చేతిలో కత్తి వుంది.

ప్రక్కనున్న శ్రీలేఖ మెలికలు తిరుగుతున్నది. చూస్తుండగానే ఆమె ప్రాణం పోయింది. నాకు కాళ్ళూ, చేతులు ఆడలేదు.

ఎలాగోలా ఊపిరి బిగబట్టి, కత్తిని అక్కడే పడేసి, నా రూమ్‌లోకి వచ్చి పడ్డాను. తెల్లవారడమే ఆలస్యం, మీ దగ్గరికి పరిగెత్తుకొచ్చాను."

ఏకధాటిగా చెప్పి, చెమటలు తుడుచుకొన్నాడతను.

"మైకంలో మీరేం చేస్తున్నారో తెలీక...."అర్థోక్తిలో ఆగాను.

"అయ్యబాబోయ్! అలాచేస్తే నష్టం నాకే. శ్రీలేఖతో నేను ఐదారు పిక్చర్స్ స్టార్ట్‌చేసి ఉన్నాను. సగం పూర్తయినవి కూడా వివిధ భాషల్లో వున్నాయి. ఆమెని యెప్పుడూ పన్నెత్తు మాటకూడా అనలేదు."

"ఇంతకీ, హత్య యెక్కడ జరిగింది?"

"ఫైవ్ స్టార్ హోటల్లో!"

రెడ్డి కూడా రమ్మంది అక్కడికే. ఈ కేసు కొసమే కాబోలు.

"పదండి! అక్కడికి వెడదాం?"

"పోలీసులున్నారు సార్?" అతని గొంతు వణికింది.

"పర్లేదు. నే నున్నానుగా! రండి!" అంటూ అతన్ని బయల్దేరదీసాను.

2

మేం హోటల్ చేరేసరికి,

అక్కడి పరిస్థితి దారుణంగా వుంది. అభిమానులకు యెలా తెల్సిందో ఏమో! హోటల్ గేట్లదగ్గర చేరి గొడవ చేస్తున్నారు.

పోలీసులు యెంత ప్రయత్నించినా వాళ్ళు ఆగటం లేదు.

అలాగే తోపులాటలోనే గేటు దగ్గరికి చేరాం. మమ్మల్ని చూడగానే సార్జంట్ ఒకతను "రండి!" అంటూ తీసు కెళ్ళాడు.

లోపలికి వెళ్ళాం.

నన్ను చూడగానే మేనేజర్, "హలో సార్! నమస్తే! ఎస్.ఐ. గారికి చెప్పి శవాన్ని త్వరగా కదిలించండి సార్! ఇప్పటికే హోటల్ సగం నాశనం అయింది" అన్నాడు.

అతనివంక చూడాలంటేనే అసహ్యం వేసింది. శ్రీలేఖ అడుగుపెట్టడమే ఒకప్పుడు భాగ్యంగా భావించేవారు.

"వెధవ మనస్తత్వం" అనుకొంటూ లిఫ్ట్‌లో పైకి వెళ్ళాను.

నన్ను చూపిన రెడ్డి యెదురొచ్చి,

"రా మిత్రమా! బాడీని చూద్దువుగానీ ..."

రూమ్‌లోకి వెళ్ళాం.

శ్రీలేఖ—అందాల నటి అడ్డంగా పడివుంది మంచం మిద.

కత్తి సరిగ్గా పొత్తికడుపుమీద దిగడంతో నిమిషాలమీద ప్రాణం పోయింది.

కళ్ళతో కావ్యాలను చిందించిన కళ్ళు తేలబడి వున్నాయి.

హృదయాలకు హత్తుకొనేట్టు పలికే పెదవులు పాలిపోయినట్టున్నాయి.

నిన్నటి సజీవస్రవంతి—నేడు నిర్జీవంగా నిదురోతున్నట్టుంది.

"రెడ్డీ! వేలిముద్ర లేమన్నా వున్నాయా, కత్తి మీద...."

తెల్సికూడా అడిగాను. భజగోవిందంవి కాక మరెవరి వన్నా పడ్డాయేమోనని.

"వేలిముద్ర లెందుకు? రాత్రి 10 గం॥ల నుంచి నిర్మాత భజగోవిందం ఇక్కడే వున్నాడట. భజగోవిందాన్ని కాస్త కదిలిస్తే...."

ఆ మాట వినగానే నా వెనుక నున్న భజగోవిందం చిన్నగా వణికాడు.

"ఇదిగో! ఇతనే భజగోవిందం" అంటూ అతన్ని చూపాను.

భజగోవిందం పరిస్థితి దయనీయంగా మారింది.

"సార్! నన్ను నమ్మండి. గదిలో వున్న మాట వాస్తవమే అయినా, హత్య నేను చేయలేదు. నన్ను నమ్మండి!"

దీనంగా అన్నాడతను.

అరెస్టు చేయమంటావా! అంటూ సైగచేసిన రెడ్డిని వద్దని కళ్ళతోనే వారించి,

"మీరెళ్ళి మీ గదిలో రెస్టు తీసుకోండి!" అంటూ భజ గోవిందాన్ని పంపేసాను.

ఆ మాట అనడమే ఆలస్యం అతను మాయమయ్యాడు.

"హంతకుడు యితను కాదంటావా?" కుతూహలంగా అడిగాడు రెడ్డి.

"కాకపోవచ్చునని నా అభిప్రాయం. ఈ ప్రక్కగదిలో ఎవరున్నారు!"

"దర్శకుడు మూర్తి కుడివైపు గదిలో, ఎడమవైపు భజగోవిందం."

"పద, మూర్తిని కలుద్దాం."

మూర్తి గది తలుపులు మూసున్నాయి.

తలుపు తట్టాము.

జవాబు రాలేదు.

ఈసారి యింకాస్త గట్టిగా....

ఉహూ!

పెద్దగా చరిచాడు రెడ్డి తలుపుమీద.

హఠాత్తుగా గది తలుపులు తెరుచుకొన్నాయి.

"ఎందుకండీ! అలా గట్టిగా తట్టడం...."

అతని గొంతు సీరియస్‌గా వుంది.

"శ్రీలేఖ హత్యా విషయంలో మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలి."

అతని మొహంలో విసుగుదల కన్పించింది.

"ఆ విషయం అయితే నన్ను అడగటం వేస్టు. రాత్రి నేను నిద్రమాత్రలు వేసుకొని పడుకొన్నాను. తిరిగి లేవ

గానే హత్య విషయం తెల్సింది. శవాన్ని చూడటం ఇష్టం లేక నా రూమ్‌లోనే వుండిపోయాను.”

నిర్లిప్తంగా అన్నాడతను. మా సంభాషణంతా గది గుమ్మం దగ్గరే జరుగుతున్నది.

రెడ్డి కొద్దిగా ముందుకు వంగి,

“మీ రూమ్ చెక్ చేయాలి” అన్నాడు.

రెడ్డి ఉద్దేశ్యం గ్రహించాను. అతను తాగి వున్నాడా లేదా! అని అలా దగ్గిరగా వంగి మాట్లాడాడు.

“విత్ ప్లెజర్! రండి!”

రెడ్డి, నేను, రూమ్ వెతికే పనిలో పడ్డాము.

ఎక్కడా అనుమానస్పదంగా యేమీ కన్పడలేదు. మొత్తం గాలించి వదిలాం.

బాత్‌రూం దగ్గిరికి వచ్చి ఆగాను. మూర్తి మొఖంలో కలవరపాటు కన్పించింది.

తలుపు తెరిచి చూసాను. అనుమానించడాని కేమీ లేదు.

కానీ అప్పుడే బట్టలు వాష్ చేసినట్టు సబ్బు నురుగు తేలుతున్నది.

తలుపు మూసి,

“మీ బట్టలు మీరే వాష్ చేసుకొంటారా?”

అప్పటికే నా దృష్టి హేంగర్‌కి వేలాడుతున్న తడి షర్టుమీద పడింది.

తెల్లటి షర్టుమీద అస్పష్టంగా ఏవో మరకలు.

“అర్జెంటైతే, అవసరమైతే నేనే వాష్ చేసుకొంటాను. ఏం ఎందుకలా అడిగారు?”

“ఊర్కే” అంటూ షర్టు దగ్గిరికి నడిచాను.

మూర్తి మొఖంలో కంగారు కన్పించింది. కానీ నటు

లకే నటన నేర్పే నేర్పున్నది కనుక అణగ ద్రొక్కేసు కొన్నాడు.

షర్టుమీద స్పష్టంగా కన్పిస్తున్నాయి రక్తపు మరకలు.

వెనక్కి తిరిగి,

"మిష్టర్ మూర్తిగారు! నిజం చెప్పండి! రాత్రి మీరు శ్రీలేఖ గదిలోకి వెళ్ళలేదా?"

"వాడ్డూయూ మీన్! నిద్ర మాత్రలతో మత్తుగా పడి వుండే నేను, ఆ గదిలోకి ఎందుకెళతాను?"

ఈసారి రెడ్డి అందుకొన్నాడు.

"చూడండి! కేసుల గురించి. సెక్షన్ల గురించి మీ కింకా తెలిసినట్టు లేదు. నిజం చెబితే మీకే మంచిది."

అతనేమి మాట్లాడలేదు. ఇద్దరం గదిలోనుంచి వచ్చే శాము.

"ఏంటి గురూ! ఈ కేసులోని తిరకాసు?"

"డోంట్ ఫియర్ రెడ్డి! ముందు శ్రీలేఖ శవాన్ని పంపేయ్! హోటల్ స్టాఫ్‌ని, రూమ్స్‌లో వాళ్ళనీ కదలనీకు. ఓ గంటలో కేసుని తేల్చేద్దాం."

రెడ్డి నమ్మలేనట్టుగా చూసి, వెళ్ళాడు.

నేను భజగోవిందం రూమ్‌వైపు నడిచాను.

3

భజగోవిందం ఎవ్వరితోనో రహస్యంగా మాట్లాడుతున్నాడు.

నన్ను చూడగానే యిద్దరూ సర్దుకొన్నారు.

"రండి!"

అంటూ ఆహ్వానించుతున్న భజగోవిందంవైపు పరిశీలనగా చూసాను.

మొఖంలో యిందాకటి కలవరపాటు కొద్దిగా తగ్గింది.

మనిషి మొఖంలో అర్థంకాని ఆనందం చిందులేస్తున్నది.

"ఇతనెవరు?"

పక్కనున్నతన్ని గూర్చి అడిగాను.

"ఇతని పేరు విజయకుమార్. కెమెరామెన్" అంటూ పరిచయం చేసాడు.

"ఏసీ! రాత్రి మీ రెక్కడున్నారు విజయకుమార్ గారూ?"

తటాలున అడిగేసరికి అతను వులిక్కిపడి, సర్దుకొన్నాడు.

"నేను, రాత్రి ఊళ్ళో లేనండి! నిన్న సాయంత్రం ఆరుగంటలకి సాగర్ వెళ్ళాను. సాగర్ నుంచి శ్రీశైలం దాకా లాంచిలో వెళుతూ పాట షూట్ చేయాలని మా ప్రపోజల్. దానికోసం లాంచివాళ్ళతో మాటాడటానికి వెళ్ళాను."

"రాత్రిపూట మాట్లాడ్డానికి వెళ్ళారా?"

"లేదు. ఆల్‌రెడీ మా ప్రొడెక్షన్ మేనేజర్ అక్కడ వున్నాడు. అతన్ని కల్సుకొని వచ్చానంతే."

"ఎన్ని గంటలకి బయల్దేరారు."

"తెల్లవారుఝామున. ఆర్.టి.సి. బస్‌లో వచ్చాను. నెంబరు కూడా గుర్తుంది. APP 2436. ఇదిగోండి, అంత అవసరమైతే టిక్కెట్లు చూడండి."

"అవసరం లేదులెండి!" అంటూ భజగోవిందంవైపు తిరిగి,

"మీరూ ఆమె ప్రక్కనే పడుకొన్నారు కదూ!"

"అవును."

"అయితే....రక్తం మీ గుడ్డల మీద పడలేదా? లేక...."

అతని మొఖం సిగ్గుతో కందిపోయింది.

"సార్! చెప్పడానికే సిగ్గుగా ఉంది. రాత్రి నేనూ, ఆవిడా, ఆడమ్ ఈవ్‌ల్లా వున్నాం."

ఈ లింక్ కూడా వీడిపోయింది.

మత్తుగా పడివున్న భజగోవిందానికి కానీ, ఊళ్ళోలేని విజయకుమార్ కానీ హంతకులు కాదనుకొంటే .... మరెవరు హంతకుడు?

మూర్తి-గదిలో ఆరేసిన షర్ట్ అనుమానం తెప్పిస్తున్నా, బెడ్ క్రింద చించేసివున్న నిద్రమాత్రల స్ట్రిప్ అనుమానం పోగొడుతున్నది.

ఐతే హంతకుడు ఎవరు?

రెడ్డికి పరిష్కరిస్తానని మాటిచ్చానేగానీ పరిష్కరించటం ఎలా?

వారిద్దరికీ వస్తానని జెప్పి, రిసెప్షన్ కౌంటర్‌వైపునడిచి, రిసెప్షనిస్టుని పిల్చాను.

"మిస్టర్! రాత్రి డ్యూటీ నీదేనా?"

"అవున్సార్! రాత్రి పది నుంచి, ఉదయం ఏడు గం॥ల దాకా నాదే!"

"ఐసీ! రాత్రి మీరు లోనికి ఎవరన్నా రావడం కానీ, పోవడం కానీ గమనించారా?"

"లేదు" దృఢంగా అన్నాడతను.

"నైట్ వాచ్‌మెన్‌ను కూడా ప్రశ్నించండి కావాలంటే. సినీ నటులు వుండటంతో, అభిమానుల బాధ భరించలేక, మెయిన్ గేట్లు మూసేసాము. అందుకని యెవ్వరూ రాలేదు."

మేనేజరుకూడా అతన్నే సమర్థించాడు. నైట్ వాచ్‌మెన్‌ని ప్రశ్నించాను.

ఎవ్వరూ రాలేదన్నాడు.

అంటే—లాడ్జిలో వున్న వ్యక్తే హత్య చేశాడన్న మాట.

ఎవరతను?

నిర్మాత, దర్శకుడు, కెమెరామెన్, శ్రీలేఖ మాత్రమే ఇక్కడ దిగింది హీరో రాలేదట. మిగిలిన చిన్న యాక్టర్లు చిన్న లాడ్జిల్లో దిగారు.

మిగిలిన రూమ్స్‌లో వాళ్ళని ప్రశ్నించాను. పనికొచ్చే సమాచారం ఏమి లభించలేదు.

విసుగ్గా తల విదిలించి సిగరెట్ వెల్గించాను.

ఇంతలో విజయకుమార్ క్రిందికి దిగివచ్చాడు, నన్ను చూసి,

"సార్! మీకో రహస్యం చెప్పాలి."

"ఏమిటది?"

"ఈ హత్య చేసింది మూర్తిగారని నా అనుమానం."

"ఎందుకని?" చిరునవ్వుతో అడిగాను.

"మొన్న లొకేషన్స్‌లో శ్రీలేఖ సరిగా నటించలేదని మూర్తిగారు విమర్శించారు.

"దాంతో, శ్రీలేఖ మండిపడి 'నేననుకొంటే నిన్ను అధః పాతాళానికి తొక్కేస్తానని' అంది. మూర్తిగారప్పుడు అలిగి వెళ్ళిపోయారు.

"భజగోవిందం గారు ఇద్దరికీ రాజీ చేసినా, మూర్తి గారికి మనసులో ఆమెంటే కక్ష."

వల్లెవేసినట్టు చకచక చెప్పాడతను.

"థ్యాంక్స్! మీ ఇన్ఫర్‌మేషన్ వల్ల కేసు త్వరగా తేలుతుంది."

అతని మొఖం వెల్గింది. వస్తానంటూ వెళ్ళిపోయాడు.

మరో పది నిమిషాలు గడిచాయి.

ప్రక్కనుంచి యెవ్వరో పిలిచారు. చూస్తే డైరెక్టర్ మూర్తి.

"మీతో కొద్దిగా మాట్లాడాలి."

"చెప్పండి!"

"ఇంతక్రితం మీతో అబద్ధం చెప్పాను. రాత్రి నేను శ్రీలేఖ గదిలోకి వెళ్ళాను కానీ, హత్య చేయటానికి మాత్రం కాదు"

"అసలు విషయం ఏమిటో చెప్పండి!" నాతో విజయ కుమార్ మాట్లాడటం గమనించి అత నొచ్చాడని తెలుస్తున్నది.

మంచిదే! వాళ్ళంతట వాళ్ళే నిజాల్ని వెళ్ళగ్రక్కేస్తున్నారు

"శ్రీలేఖను సినీఫీల్డ్ కి పరిచయం చేసింది నేనే. ఆ అధికారంతోనే ఆమెని మందలించాను మొన్న షూటింగ్‌లో. ఆమె కూడా ఫీల్ కా లేదు.

"రాత్రి—నేను శ్రీలేఖ కోసం గదిలోకి వెళ్ళాను. అక్కడ శ్రీలేఖ, భజగోవిందం దిగంబరంగా వున్నారు. రూమ్ లాక్ కూడా చేయలేదు.

శ్రీలేఖను లేపబోయిన నేను వెనుక అలికిడి విన్పించటంతో మంచం క్రింద దూరాను. ఎవ్వరో వ్యక్తి రావడం - శ్రీలేఖని పొడవడం జరిగింది.

నేను క్షణకాలం భయంతో బిగుసుకొనిపోయాను. తెప్పరిల్లి, వద్దామనుకొనే లోగా భజగోవిందం దిగి ప్రక్క గదిలోకి పరిగెత్తాడు

నేను కూడా రూమ్‌కొచ్చి, నిద్రమాత్ర వేసుకొని

పడుకొన్నాను. తెల్లవారి లేచి చూసేసరికి షర్టుమీద రక్తం వుంది. పోలీసులు చూస్తే నన్నే అనుమానిస్తారని దాన్ని వాష్ చేసేసాను. అంతే! ఇదీ జరిగింది!"

అన్నాడు ఏకధాటిగా మూర్తి.

నా పెదవులమీద చిరునవ్వు వెలిసింది. హంతకుల అనుమానితుల్లో భజగోవిందం పేరు కొట్టేయవచ్చు.

"ఓ.కె. మీ రెళ్ళిరండి!" అనగానే అతను రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

సో! విజయకుమార్ ఊళ్ళోలేడు. మూర్తి స్టేట్‌మెంట్ ప్రకారం భజగోవిందం కాడు. మరి మూర్తికి ఎలిబీ లేదు. కనుక అతనేనా హత్యచేసింది?

ఆలోచనతో తల వేడెక్కింది.

ఇంతలో రెడ్డి వచ్చాడు.

"ఎంతవరకూ వచ్చింది నీ శోధన?"

"తొందరపడకు రెడ్డి! ఎంత పకడ్బందీగా ప్లాన్ వేసినా హంతకుడూ మనిషే. పొరబాట్లు మానవసహజం."

అక్కడేవున్న సోఫాలో కూర్చొని రెడ్డికి మొత్తం కథనం వివరించాను.

ఇద్దరం తీవ్రంగా ఆలోచించసాగాము, ఎక్కడన్నా లొసుగులుతగులు తాయోమోనని....

సిగరెట్ పీకలతో యాష్ ట్రే నిండిపోసాగింది.

4

హఠాత్తుగా లేచి నిలబడి, "పద రెడ్డి! అలా వెళ్ళి 'టీ' అన్నా త్రాగుదాం" అన్నాను.

"ఎందుకు గురూ! ఇక్కడికే వస్తుందిగా?"

"వద్దులే! అలావెళ్ళి బుర్రన్నా చల్లబరుద్దాం"

ఇద్దరం కల్సి అబిడ్స్ సెంటర్‌కి వచ్చాము. డ్రస్‌లో

వున్న రెడ్డిని చూడగానే నిమిషాలమీద టీ వచ్చింది.

టీ త్రాగుతూ కూడా ఆలోచిస్తున్న రెడ్డి, "అరరె!" అన్నాడు ఆత్రుతగా.

అప్పటికే ఆ ఘోరం జరిగిపోయింది.

ఎదురుగ్గా వస్తున్న కారుని తప్పించుకోబోయిన ఓ స్కూలు కుర్రాడు R.T C. బస్‌కి అడ్డంవచ్చాడు.

ఇతన్ని చూడగానే డ్రైవర్ కంగారుగా బ్రేక్‌నొక్కాడు.

అప్పటికే ఆ కుర్రాడు ఏదో రాక్షసహస్తం పట్టుకొని పైకి లేపినట్టు ఎగిరి ప్రక్కనపడ్డాడు.

కప్పులు అక్కడ పడేసి పరిగెత్తాం.

చుట్టూవున్న జనాలను తప్పించుకొని, ఆ దృశ్యం చూసేసరికి కడుపులో దేవినట్టయింది.

మెదడు పగిలి బైటికి వచ్చింది. ముఖం అంతా పగిలి పోయింది.

కానీ, ఆ చిన్ని చేతులు పుస్తకాల్ని మటుకు పట్టుకొని విడవకుండా వున్నాయి.

చుట్టూ వున్నవారు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. పరిగెత్తుకొంటూ వచ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రెడ్డిని చూడగానే సెల్యూట్ చేస్తూ, జనాలని దూరంగా నెట్టేసాడు.

"పదరెడ్డి! పోదాం!"

"జస్ట్ ఎ మినిట్!" అంటూ కానిస్టేబుల్‌కి ఏదో చెప్పాడు రెడ్డి.

తన స్టేషన్ పరిధి అయినా, కాకున్నా ప్రతిపనీ తన భుజాన్నే వేసుకొంటాడు రెడ్డి.

పోలీసులను చీల్చి చెండాడే జర్నలిస్టులకు కూడా రెడ్డంటే అభిమానమే.

చూస్తుండగానే పోలీస్‌జీప్, అంబులెన్స్ వచ్చాయి. ఆ

కుర్రాడ్ని ఎక్కించుకొని అంబులెన్స్, డ్రైవర్‌ని తీసుకొని పోలీస్ జీప్ కదిలాయి.

విషాద హృదయాలతో కదిలాం.

పెరిగి, దేశానికి ఏదో విధంగా పనికొచ్చే ఓ పసివాడు మొగ్గలోనే తుంచేయబడ్డాడు.

"డామిట్!" అంటూ బస్ డ్రైవర్ని ఈడ్చి తన్నాడు రెడ్డి.

వరంగల్ డిపో బస్ అది.

"ఏమిటో! హైదరాబాద్‌లో ట్రాఫిక్ రూల్స్ పాటించడం డ్రైవర్లు, ప్రజలూ ఎప్పుడు నేర్చుకుంటారో!" అన్న రెడ్డి మాటలు నా చెవికెక్కలేదు.

నా కళ్ళు బస్‌లో ఓ మూల అతుక్కొని పోయాయి.

"కమాన్ రెడ్డి! నా అనుమానం నిజమైతే శ్రీలేఖ హత్యకేసులో హంతకుడు దొరికాడు"

"ఎలా?"

ఆతృతగా అడుగుతున్న రెడ్డికి సమాధానం చెప్పకుండా హోటల్ వైపు నడిచి, రిసెప్షన్‌లో వున్న ఫోన్ అందుకొన్నాను.

చకచక నెంబర్లు త్రిప్పి, నా సందేహం అడిగాను.

అవతలినుంచి వచ్చిన సమాధానం వినగానే తృప్తిగా నిట్టూర్చి.

"పద రెడ్డి! హంతకుడ్ని చూపిస్తాను" అంటూ భజగోవిందం రూమ్‌వైపు నడిచాను.

అతని రూమ్‌లోనే మూర్తి, విజయకుమార్ కూడా కూర్చుని వున్నారు.

"రెడ్డీ! అదిగో అతనే హంతకుడు. విజయకుమార్‌ని అరెస్ట్‌చెయ్యి." అన్నాను గంభీరంగా.

"నన్నా?" ఆశ్చర్యంగా అడిగాడు విజయ్‌కుమార్.

"ఆశ్చర్యం నటించకు మిస్టర్! నువ్వు హత్య చేసినప్పుడు మూర్తి నిన్ను స్వయంగా చూసాడు"

అంటూ చీకట్లోకి బాణం వదిలాను.

"నో! నో! నన్నెవరూ గమనించలేదు. నో!" అంటున్న విజయకుమార్ చేతికి కఫ్స్ తగిలించాడు రెడ్డి.

భుజగోవిందం, మూర్తి ఆశ్చర్యంగా చూసారు నావంక.

"విజయకుమార్! ఇప్పటికైనా నిజంచెప్పు. శ్రీలేఖను ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందో?"

అతను తల దించుకొన్నాడు.

"మీరు అనుమానించినది నిజమే. శ్రీలేఖను హత్య చేసింది నేనే."

గర్వంగా చూసాను మిగిలిన వారివంక.

"ఎందుకంటే...." అంటూ విజయకుమార్ గొంతు విప్పాడు.

"శ్రీలేఖను నేను ప్రేమించాను, కామించాను, అభిమానించాను.

ఆమె మహానటి. అందుకే నన్ను నిర్లక్ష్యంగా మాట్లాడింది. తన వెనకపడితే 'నా ప్రాణాల్ని తీయిస్తానని' కఠినంగా అంది అప్పుడే ఆమె ప్రాణాలు తీయాలని నిశ్చయానికొచ్చాను.

అవకాశం కోసం ఎదురుచూసాను. నాగార్జునసాగర్ వెళుతున్నానని చెప్పి బయల్దేరి, ఎవ్వరికీ కన్పడకుండా, నా రూమ్‌లోకి చేరుకొన్నాను.

కరెక్టుగా 12 గం॥లకి శ్రీలేఖ రూమ్‌లోకి వెళ్ళాను. అక్కడ విచ్చలవిడిగా పడున్న ఆమెను, భుజగోవిందా చూడగానే నాలో ద్వేషం యింకా పడగెత్తింది.

భజగోవిందం తాగితే మనిషికాడు. అందుకే ప్రక్క నున్నా ధైర్యంగా పొడిచాను ఒక్క దెబ్బకే చచ్చి ఊర్కొంది. మత్తులో వున్న భజగోవిందం కదలగానే కత్తి అతని చేతిలో వుంచి, ఒక్కడుగులో నా రూమ్ చేరుకొన్నాను.

ఎందుకైనా మంచిదని తలుపు కొద్దిగా తెరిచిన నేను భజగోవిందం తన రూమ్‌లోకి వెళ్ళిన తరువాత మూర్తి రావడం చూసి ఆశ్చర్యపడ్డాను.

ఎందుకయినా మంచిదని మూర్తి రూమ్‌వైపు వెళ్లాను. నిద్రమాత్రలు వేసుకుంటున్న అతన్ని నిద్రపోనిచ్చి, శ్రీలేఖ రక్తం పక్కపై పూసాను. అనుమానం అతనిమీదకే వస్తుందని ఆశించాను.

తెల్లవారి అందరికంటే ముందేవెళ్ళి క్రిందనున్న కామన్ లెట్రిన్‌లో దాక్కొన్నాను. నన్నెవరూ గమనించలేదు.

ఇంతలో హోటల్‌స్టాఫ్ రావడం, శ్రీలేఖ శవాన్నిచూపి పోలీసులకి ఫోన్ చేయడం—అంతా గందరగోళంగా వుండడంతో బైటకి జారుకొన్నాను ఆర్.టి.పి. టిక్కట్లు సంపాదించి, ఏమీ ఎరగనట్టు వచ్చేశాను" అన్నాడతను.

కేవలం ఈర్ష్యతో హత్యచేసిన అతన్ని అందరూ హేయంగా చూశారు.

కానిస్టేబుల్ని పిల్చి, విజయకుమార్‌ని అప్పగించాడు రెడ్డి. అతన్నితీసుకొని పోలీసులు బయటకు వెళ్ళిపోయారు.

"సార్! నా కో డౌట్ ...." అన్నాడు మూర్తి.

"నేను నిజంగా విజయకుమార్‌ని గమనించలేదు. కానీ మీరు ...."

చిన్నగా నవ్వాను.

"నిజమే! మీరు చూడలేదు. విజయకుమార్ చేత నేరం

ఒప్పించడానికి అలా చెప్పాను. అంతే."

భజగోవిందం చకచక చెక్ రాసిచ్చాడు. దాన్ని అందుకొని, రెడ్డితో బైటపడ్డాను.

"అన్నట్టు మిత్రమా! నాక్కూడా ఓ అనుమానం" అన్నాడు రెడ్డి.

"ఏమిటది?"

"విజయకుమార్ హంతకుడని ఎలా నిర్ణయించావ్?"

"చాలా సింపుల్! సాగర్ నుంచి వచ్చానని విజయకుమార్ చెప్పాడు. ఆర్. టి. పి. లో వచ్చానన్నాడు. నెంబరు కూడా చెప్పాడు APP 2136 అని. కానీ ఆర్. టి. పి. కి నెంబర్లు వేరు కావచ్చు. రిజిస్ట్రేషన్ మటుకు APZ అనిగాని AAZ అనిగాని వుంటుంది. ఇందాకటి యాక్సిడెంట్‌లో బస్ నెంబర్ చూపి, కంట్రోల్‌కి ఫోన్ చేశాను. అతను నా అనుమానం నిజమేనన్నాడు.

ఉత్త నెంబరైతే విజయకుమార్ బుకాయిస్తాడని, మూర్తి పేరు చెప్పాను అంతే!" అంటూ నేను చెప్పాని, రెడ్డి బుల్లెట్ అధిరోహించాం. □

డబ్బులివ్వని జాతకం!

25 లక్షలు

క్రైంబాబు



సుబ్రమణ్యం సాయంత్రం ఆరుగంటలకు గారేజ్ ముందు ఆటో దిగాడు.

“సత్యసాయి ఆటోవర్క్స్” అనే బోర్డు గారేజ్ ముందు జయప్రదంగా వ్రేల్లాడుతోంది.

సుబ్రహ్మణ్యాన్ని చూడగానే గుర్తుపట్టి నవ్వుతూ విష్

చేశాడు గారేజ్ మెకానిక్.

"బండి రెడీ సార్!" అన్నాడు ఓ ప్రక్కనవున్న నల్ల రాజ్‌దూత్ మోటార్‌సైకిల్‌ను చూపెడుతూ.

సుబ్రమణ్యం చిన్నగా తలవూపి మోటార్‌సైకిల్ దగ్గరికి వెళ్ళాడు రీ పైయింట్ చెయ్యబడి బండి తళతళ మెరుస్తోంది. ఇదివరకు పగిలిపోయిన రియర్‌వ్యూ అద్దానికి బదులు యిప్పుడు లేటెస్ట్‌మోడల్ ఎలాంగేటెడ్ డిస్టెన్స్ మిర్రర్ బిగించి వుంది... సీట్ కవర్ కూడా కొత్తది. ఫోమ్ రబ్బర్ ప్లాస్టిక్ సీటు చూడ్డానికే సుఖంగా కనబడుతుంది.

"బ్రైల్ వేస్తారా? పెట్రోలు కూడా అయిదు లీటర్లు పోయించి వుంచాను?" అన్నాడతను.

"పారిస్ కార్నర్‌వరకూ ఓ రౌండ్ కొట్టొస్తా!" అన్నాడు మెకానిక్ యిస్తున్న తాళాలు అందుకొంటూ.

"ఇంజన్ మరీ యెక్కువ రైజ్ చెయ్యకండి.... క్రొత్త రింగులు వేశాంకదా కాస్త పట్టు ఇస్తాయి—" అన్నాడు హెచ్చరికగా.

స్టాండ్‌తీసి కిక్‌కొట్టి బండి స్టార్ట్ చేశాడు. మొదటి కిక్‌కే మోటార్‌సైకిల్ స్టార్టు అయింది. ఎక్కి కూర్చొని ఫస్ట్‌గేర్‌లో రోడ్డుమీదికి పోనిచ్చాడు. రోడ్డుమీదికి రాగానే గేర్లు మార్చి మెల్లిగా యాక్సిలేటర్ రైజ్ చేశాడు. పోర్ట్ ప్రాంతాల్లో వుంది ఆ గారేజ్. తిన్నగా పారిస్ కార్నర్ వరకూ వెళ్ళి, అక్కడి నుండి హైకోర్టు ముందు నుండి బ్రాడ్‌వే మలుపువరకూ వెళ్ళి వెనక్కి తిరిగాడు.

రీబోర్ చెయ్యడంవలన ఇంజన్ స్ట్రోక్ శబ్దంలో కాస్త తేడా తప్ప వాహనం స్మూత్‌గా నడుస్తోంది. ఎక్కడా నలభై కిలోమీటర్లకు మించి పెంచలేదు వేగాన్ని. తిరిగి

గారేజ్ ముందు ఆపి టైము చూసుకున్నాడు. ఆరుగంటల పది నిముషాలయింది.

గారేజ్ యజమానికి డబ్బు చెల్లించి తిరిగి బండి స్టార్ట్ చేశాడు.

"రెండ్రోజులు పోయాక మళ్ళీ ఓసారి బండి తీసుకు రండి....చెకప్ చెయ్యాలి...."—చెప్పాడు గారేజ్ యజమాని.

అలాగే నన్నట్లు తలాడించాడు....ఆరుంబావయింది.

తను అనుకున్నవన్నీ పథకం ప్రకారం పూర్తయితే తెల్లవారేప్పటికి తను మద్రాసు నగరంలోని లక్షాధికార్లలో ఒకడవుతాడు....యిక....ఒకటీ రెండూ కాదు....దాదాపు పాతిక లక్షల ఆస్తి....ఈ మాత్రం ధైర్యం, చొరవ, ప్రణాళిక తప్పవు. లేకపోతే అంతా చెయ్యిజారి పోయే అవకాశం కూడా వుంది.

మూర్‌మార్కెట్ ప్రక్కనేవున్న పెట్టిసైడ్స్ షాపు ముందు మోటార్‌సైకిల్ ఆపాడు ...

షాపు ప్రొప్రయిటర్ పొగాకురసంతో నల్లబడిన పళ్ళను బయటపెడుతూ ఇకిలించాడు సుబ్రహ్మణ్యాన్ని చూడగానే.

"లితోక్రాన్ అరలీటర్ టిన్నులు రెండు కావాలి"—అన్నాడు సుబ్రమణ్యం.

"డెబ్భై ఎనిమిది రూపాయిలివ్వండి"—అని రెండు అర లీటరు టిన్నుల్ని కౌంటరుమీద పెట్టి బిల్ చేశాడు షాపు ఓనరు.

సుబ్రమణ్యం జేబులో నుండి కొత్త రూపాయినోట్ల కట్ట బయటికి తీశాడు....పైనుండి ఇరవై రెండు నోట్లు తీసేసి, మిగిలినది కౌంటర్‌మీద పడేశాడు నిర్లక్ష్యంగా....

చటుక్కున అందుకొని నోట్లకట్టను ముద్దుపెట్టుకొన్నాడు

షాపు ఓనర్ ...నోట్లను ఓసారి పెళపెళ లాడించి సంతోష పడ్డాడు "అబ్బో అన్నీ కొత్తనోట్లు ...ఈ మధ్య క్రొత్త రూపాయి నోట్లే కరువయిపోయాయి....తీసుకెళ్ళి మా ఆవిడ కిచ్చి పూజగదిలో దాచమని చెపుతాను...."—

"డోన్ట్‌వర్రీ! కావాలంటే రేపు మరో కట్ట తెచ్చి ఇస్తాలే!"—అన్నాడు సుబ్రమణ్యం టిన్నులు. బిల్ తీసుకొని బయటికి నడుస్తూ.

"వుంటే మరోకట్ట కూడా ఇచ్చివెళ్ళండి సామీ!"—అన్నాడు ఓనర్ వంపకాగితం బయటికి తీస్తూ

టిన్నుల్ని మోటర్‌సైకిల్‌కు వున్న సైడ్ బాక్స్‌లో పెట్టి, బండి స్టార్ట్‌చేసి కొట్టువాడివైపు చూసి నవ్వాడు సుబ్రమణ్యం. "ఇవ్వాళ లాభంలేదయ్యా! ఇందాకే ప్రింట్ వేసి ఆరబెట్టాను ...రేపటిగ్గాని ఆరవు"—

"ఆ!!"—అన్నాడు ప్రొప్రయిటర్ కంగారుగా....

నవ్వుతూ మోటర్‌సైకిల్‌ను ముందుకు దూకించాడు సుబ్రమణ్యం ....పథకంలో మొదటిభాగం జయప్రదమవడం అతనికెంతో సంతోషాన్నిచ్చింది.

2

టైము ఆరున్నర దాటింది....అప్పుడే చీకటిపడి కార్పొరేషన్ దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి మహాబలిపురం వెళ్ళే రోడ్డువెంట రాజ్‌దూత్ మోటర్‌సైకిల్ దూసుకుపోతోంది.

మద్రాసునుండి దాదాపు పదికిలోమీటర్లు వచ్చేక రోడ్డుకీ, సముద్రానికీ మధ్య పెద్దపెద్ద రాతి గుట్టలున్నాయి. మోటర్ సైకిల్ను ఆ రాతి గుట్టల చాటున ఆపి సైడ్‌బాక్స్‌లోనుండి రెండు టిన్నులను బయటికి తీసి ఇసుకలోకి నడిచాడు సుబ్రమణ్యం.

సముద్రంమీద దూరంగా వెళుతున్న ఓడమీది దీపాలు మిణుకుమంటూ కనిపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ దీపాలు లేక పోవడంవలన, చంద్రుడింకా వుదయించకపోవడం వలన సముద్రతీరం చీకటిగా, భయంభయంగా వుంది. అప్పు డప్పుడూ రోడ్డుమీద వెళ్ళే వాహనాల చప్పుడు, సముద్రపు అలలఘోష నిర్మానుష్యమైన ఆ సముద్రతీరాన్ని మరింత భయం కలిగించేదిలా చేస్తోన్నాయ్.

సుబ్రమణ్యం అలలకు దూరంగా తడిగావున్న ఇసుక తవ్వి అడుగులోతు గొయ్యితీశాడు. లితోక్రాన్ డబ్బాలు రెండూ అందులో పడేసి పూడ్చేశాడు ... నారింజ తోటలకు కాయలుకాసే సీజన్లో పట్టే ఒక ప్రత్యేకమైన క్రిముల్ని చంపే మందు అది. దాన్తో తనకు అవసరంలేదు నిజానికి నిన్న అలాంటి టిన్నులు రెండు థౌజండ్ లైట్స్ సెంట ర్లోని ఓ షాపులో కొని తన తోటమాలి రామలింగానికి ఇచ్చివచ్చాడు. అప్పుడే ఏం చెయ్యాలో, ఎలా చెప్పాలో అన్నీ విపులంగా చెప్పివచ్చాడు.

రామలింగం చాలా నమ్మకస్తుడు. తనని చిన్నప్పటి నుండి పెంచాడు. సుబ్రమణ్యం తండ్రికాలం నుండి అతను వాళ్ళ ఇంట్లో నౌకరుగా వుండేవాడు. ప్రాణంపోయినా సుబ్రమణ్యం చెప్పిన మాట జవదాటడు. తన పథకంలో రామలింగం ఒక ముఖ్య పాత్రదారి.

రేడియం డయిల్ వాచ్‌లో టయిం ఏడుంబావయినట్లు చూపెడుతోంది.

ఇక ఆలశ్యం చెయ్యగూడదు....ఎనిమిదిన్నర లోపల పని ముగించాలి అనుకొన్నాడు సుబ్రమణ్యం.

మోటర్‌సైకిల్ని మద్రాసువైపు త్రిప్పి రయ్యిన పోని చ్చాడు.

3

గోడగడియారం యెనిమిది గంటలు కొట్టింది ...

మురుగావతారం అప్పుడే భోజనం పూర్తిచేసి మేడమెట్లు యెక్కి పైభాగాన వున్న పడగ్గదిలో ప్రవేశించాడు.

మురుగావతారం లక్షాధికారి. అయినా అతనికి ఆడంబరంగా వుండడం ఇష్టముండదు. అతని స్థిర చరాస్తులన్నీ పాతిక లక్షలపై చిలుకు వుంటాయని అభిజ్ఞుల అంచనా.

అయినా; మురుగావతారానికి స్వంత మనుషులెవరూ లేరు.... వున్న భార్యా, ఇద్దరు పిల్లలు అయిదేళ్ళ క్రితం కారుప్రమాదంలో మరణించారు. తిరుపతి నుండి తిరిగి వస్తున్నప్పుడు వాళ్ళు ప్రయాణిస్తున్నకారు ఒక మలుపులో బ్రేకులు ఫెయిలయ్యి, ఫెన్సింగ్ వున్న రాళ్ళను జంప్‌చేసి, దొర్లి లోయలోకి పడిపోయింది. డ్రయివరుతో బాటు భార్యా పిల్లలు క్షణాల్లో మరణించారుగాని, మురుగావతారం మాత్రం చిత్రంగా చిన్నచిన్న గాయాల్తో బయటపడ్డాడు ప్రమాదంలోనుండి.

మురుగావతారానికున్న ఒకే ఒక బంధువు సుబ్రమణ్యం. సుబ్రమణ్యం అతని చెల్లిలి కొడుకు. పట్టుదల, తెలివి తేటలు సుబ్రమణ్యానికి ఏమాత్రం లేవని అతని ప్రగాఢ విశ్వాసం. అంచేతే పిల్లు లేకుండా తను చస్తే తన ఆస్తికి వారసుడయ్యే సుబ్రమణ్యాన్ని అతను దగ్గరకు చేరనివ్వ లేదు.

చచ్చి స్వర్గానవున్న చెల్లెలుగాని, తన వ్యాపారానికి మొదటి పెట్టుబడి పెట్టిన బావగారి వుదార స్వభావంగాని, వారి ఏకైక సంతానాన్ని చేరదియ్యడానికి మురుగావతారానికి అంతగా గుర్తులేవు.

అయితే; మేనమావ ఆస్తిపాస్తుల గురించి, స్థితిగతుల

గురించి సుబ్రహ్మణ్యం పూర్తి అమాకీతెలుసుకునేవున్నాడు. ముసలాడు బ్రతికుండగా ఆ లక్షలు తన చేతికొచ్చే అవకాశం లేదని సుబ్రహ్మణ్యం గ్రహించాడు.

సుబ్రహ్మణ్యం ఆస్తిపరుడుకాడు.... కాని తండ్రి సంపాయించి యిచ్చిన పదెకరాల నారింజతోట, మద్రాసులోని బర్మాబజార్‌లో ఫాన్సీ వస్తువులు అమ్ముకొనే వ్యాపారం అతన్ని ఏదోరకంగా జీవితాన్ని నెట్టుకువచ్చేలా చేస్తున్నాయ్. దానికితోడు మురుగావతారానికి ఆస్తి తనకు ఇచ్చే ఉద్దేశ్యం లేదని తెలిసినప్పుడు అతనికి చాలా బాధకలిగింది. చేతికందిన పండును యెవరో లాక్కుపోతున్న ట్లనిపించింది. ఇంకొంతకాలం ఆగితే మురుగావతారం ఆస్తిని ఏ ధర్మ సంస్థకో వ్రాసిపారేసే అవకాశంకూడా వుంది.

అందుకే ఆలోచించడం మొదలుపెట్టాడు సుబ్రహ్మణ్యం- మేనమామ ఆస్థి చేజిక్కించుకోవడానికి ఏం చెయ్యాలా అని. చివరికి మురుగావతారాన్ని చంపకపోతే తనకు చాలా కష్టం అని నిర్ణయించుకొన్నాడు.... అప్పుడు ప్రారంభించాడు తన పథకానికి రూపకల్పన.

మురుగావతారం డబ్బు యెప్పుడూ ఇంట్లో వుంచడు. ఆ సంగతి అందరికీ తెలుసు.... ఎక్కడ వుంచుతాడో ఎవరికీ తెలియదు. డబ్బు యింట్లో వుండడం తన ప్రాణాలకు ప్రమాదం అని ఎప్పుడో గ్రహించి డబ్బు దాచుకొనేందుకు వేరే పద్ధతులు అతను ఏర్పాటు చేసుకొన్నాడు. అందుచేత ఏ అర్థరాత్రో ఏ దొంగో వచ్చి తన కేదన్న హానిచేస్తాడనే భయంలేదు అతనికి.

రోజు రాత్రి ఏడున్నరకు భోజనంచేసి యెనిమిదింటికల్లా పడకమీద నిద్రకుపక్రమిస్తాడు మురుగావతారం. అది తని అలవాటు. తెల్లవారుఝాము మూడింటికి లేచి పూజలూ

వగైరాలు చేసే వ్యక్తి ఆమాత్రం ముందు పడుకోకపోతే ప్రయోజనంలేదని అతని వాదన.

మురుగావతారం భోజనం పూర్తవగానే వంటమనిషి, పనివాడు వెళ్ళిపోతాడు. అప్పటినుండి మరుసటిరోజు తెల్లవారుఝామువరకూ అతనొక్కడే వుంటాడు ఇంట్లో.. ఈ విషయం సుబ్రమణ్యానికి వుపకరించింది.

పడగ్గదిలోకి ప్రవేశించిన మురుగావతారం ఒక్కక్షణం అనీజీగా ఫీలయ్యాడు. గుర్తించలేని అదృశ్య శక్తేదో అతన్లో భయాన్ని కలుగచేసింది. భయంగా వెనక్కి తిరగబోయాడు. కాని మురుగావతారం చరిత్ర ఆ రోజుతో ముగియవలసి వుంది.

అతను పూర్తి వెనక్కు తిరగకముందే అతని వీపులో పదునైన కత్తి దిగింది....సుబ్రమణ్యం యెడమచెయ్యి అతని నోటిని మూసింది.

పెద్ద మూలుగు మినహా మురుగావతారం అరవలేదు.... బోర్లా నేలమీద పడ్డాడు. కాళ్ళు చేతులు రెండు నిముషాలు కొట్టుకొన్నాయి.

ఒక్కక్షణం తన షర్టువైపు చూసుకొన్నాడు సుబ్రమణ్యం....నాలుగయిదు రక్తం మరకలు అంటుకొన్నాయి.

మురుగావతారంలో చలనం ఆగిపోయింది గదిలో ఏటవాలు వున్నవైపుకు తల పడడం వలన కాబోలు గుండెల్లోంచి కారిన రక్తం తలదగ్గర మడుగుకడుతోంది.

సుబ్రమణ్యం చొక్కా విప్పాడు....లోపల బనియన్ లాంటి రెడీమెడ్ చొక్కా వుంది....అంచేత బయటెవరూ అతన్ని ప్రత్యేకంగా చూడరు. విప్పిన చొక్కాతో కత్తి పిడిమీద వేలిముద్రలు తుడిచాడు.

బల్లమీద వున్న న్యూస్‌పేపర్ తీసి షర్టును అందులో

చుట్టాడు.

గదిలో లైటు ఆర్పి బయటకు వచ్చి తలుపుదగ్గరికిలాగి బోల్ట్ వేశాడు....బోల్టుమీద, హేండిల్ మీద వున్న వ్రేలి ముద్రలు తుడిచి హుషారుగా మెట్లవైపు నడిచాడు.

4

మురుగావతారం ఇంటివెనుక చీకటిసందులో నుండి చక చక నడవసాగాడు సుబ్రమణ్యం.

అతని మనసులో అనేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. ఆస్తి చేజిక్కించుకొనే పథకంలో రెండు ఘట్టాలు జయప్రదంగా పూర్తయ్యాయి. ఇంకా చివరి ఘట్టం మిగిలివుంది. చాలా జాగ్రత్తగా పొరపాట్లు దొర్లకుండా చెయ్యాలి....కాసేపునడిచి మోటార్ సైకిల్ను చేరుకున్నాడు.

మోటార్ సైకిల్ సైడుబాక్స్లో షర్టుపొట్లాన్ని పడేశాడు.

పది నిముషాలకు పదవుతుందనగా వాషర్ మన్ పేట ప్రాంతంలో వున్న ఓ ఇరానీ రెస్టారెంట్ ముందు ఆపాడు మోటార్ సైకిల్ను.

రకరకాల వ్యక్తుల్తో కిటకిటలాడుతోంది రెస్టారెంట్.

"పరోటా, మటన్ కుర్మా!"—అన్నాడు వెయిటర్ రాగానే.

అయిదు నిముషాల్లో ఆర్డరు వచ్చింది... అప్పటికే సుబ్రమణ్యం సిద్ధంగా వున్నాడు. అతని చేతివ్రేళ్ళ మధ్య మెడవెనుక ప్రాంతం నుండి లాగిన నాలుగు వెంట్రుకలున్నాయి.

యాధాలాపంగా వెంట్రుకల్ని మటన్ కుర్మా వున్న సాసర్లో పడేసాడు.

పరోటాముక్క విరిచి కుర్మాసాసర్ వైపు పరీక్షగా చూసినట్లు క్షణం నటించాడు....అవతలి టేబిల్ దగ్గర సర్వ్ చేస్తున్న వెయిటర్‌ను దగ్గరకు రమ్మని సైగచేశాడు.

"ఎన్నాసార్?"—అన్నాడు వాడు దగ్గరికి రాకుండానే.

"ఇలా దగ్గరికొచ్చి చూడుబే ..."—అరిచాడు సుబ్రమణ్యం కోపంగా.

వెయిటర్ ఒక్క నిముషం బిత్తరపోయాడు....అలా దుడుకుగా మాట్లాడే కస్టమర్స్ తక్కువగా వుంటారు. కోపంగా సుబ్రమణ్యం కూర్చొన్న టేబిల్ దగ్గరికి వచ్చాడు.

"ఈ కుర్మా చూడు....మటన్‌తోపాటు వెంట్రుకలు కూడా వండుతారా మీ హోటల్లో?" —అరిచాడు.

వెయిటర్ అనుమానంగా సాసర్లోకి చూశాడు. కుర్మా గ్రేవిలో చిన్నచిన్న వెంట్రుకలు తేలియాడుతున్నాయి. ఒక్కక్షణం తెల్లబోయాడు వాడు.

"ఏం? మాట్లాడవేం?....మీ ఇష్టం వచ్చింది మా మొహాన పోస్తే తినడానికి మనుషుల మనుకొన్నారా! పశువుల మనుకొన్నారా?"—గట్టిగా అరిచాడు సుబ్రమణ్యం.

చుట్టుప్రక్కల టేబిల్‌వాళ్ళు ఏమిటని అడగసాగారు. నలుగు రయిదుగురు తింటున్న పదార్థాలు వదిలేసి అనుమానంగా వాటివైపు చూడసాగారు

"సారీసార్! పొరపాటయింది...."—అన్నాడు వెయిటర్ చటుక్కున ఆ సాసర్ తీసుకొని వెళ్ళిపోబోతూ.

"ఏమిటయ్యా పొరపాటు మీ ప్రొప్రయిటర్ని ఇలా పిలువు....ఇలాంటి చెత్తతింటే కలరాతో చచ్చిపోతాము" వెయిటర్‌ని అడ్డగించాడు సుబ్రమణ్యం.

"అవును. నా ప్లేట్లో కూడా వాలా వెంట్రుకలు వున్నయ్"

అరిచాడు కోడిపలావ్ తింటున్న మరో కష్టమరు. అతని ప్లేటు అప్పటికే ముప్పాతికవంతు ఖాళీ అయింది.

ప్రొప్రయిటర్ పరుగు పరుగున వచ్చాడు. చాలా గలభా అయింది. అందర్నీ శాంతింపచేసి మళ్ళీ సుబ్రమణ్యానికి స్పెషల్ పరోటా చికెన్ మసాలా ఇప్పించి సంధి చేసుకొన్నాడు ఇరానీ హోటల్ వాడు. పదిన్నర ప్రాంతంలో ఇంటి దారి పట్టాడు సుబ్రమణ్యం.

5

సి.ఐ.టి. కాలనీలోని ఓ పెద్ద భవంతి అవుట్ హౌస్‌లో అద్దెకుంటున్నాడు సుబ్రమణ్యం.

ఇంటి యజమాని మద్రాసు యూనివర్సిటీలో హిస్టరీ ప్రొఫెసరు. టర్మినల్ హాలిడేస్ కావడం మూలాన్న భార్యా పిల్లల్తో కలిసి ఉత్తరదేశ తీర్థయాత్రలకు వెళ్ళాడు. మరో వారం రోజులవరకూ వాళ్ళు తిరిగిరారని సుబ్రమణ్యానికి తెలుసు.

సుబ్రమణ్యం వుండే అవుట్‌హవుస్ యింటి వెనుక భాగంలో వుంటుంది.

ఇంటికి రాగానే ముందు మోటార్ సైకిల్ అవుట్ హౌస్ దగ్గర పెట్టి వెనక్కి తిరిగివచ్చి ప్రహరీగేటు కుండే ఇనుప ఊచల తలుపు మూసి తాళం పెట్టాడు....ఇంటిచుట్టూ ఎత్తైన ప్రహరీగోడ వుండడంవలన లోపలివాళ్ళు బయటకు కనబడరు. తర్వాత బాక్స్‌లోని రక్తం మరకలున్న చొక్కా తీసుకొని కుళాయి దగ్గరకు వెళ్ళాడు. దాన్ని చక్కగా వుతికి ఆరేశాడు.

తర్వాత తను స్నానం చేసి, బట్టలు మార్చుకొని, అవుట్‌హవుస్ వరెండాలో పడకకుర్చీ వేసుకొని తాపీగా స్పెన్సర్ చుట్ట వెలిగించాడు.

ఘాటైన చుట్ట పొగ వదుల్తూ ఒక్కసారి ఆ సాయం త్రపు నాటి ఘటనలన్నీ మననం చేసుకొన్నాడు ...అన్నీ అనుకున్నట్లే సక్రమంగా జరిగాయనిపించాయి.

మురుగవతారాన్ని చంపడానికి మోటివ్ వున్న ప్రథమ వ్యక్తిగా పోలీసులు తననే అనుమానించడం సహజం. అయితే అతన్ని చంపడానికి తనకు అవకాశం లేదని. హత్య జరిగిన సమయానికి తనకు నిర్భేద్యమైన ఎలిబీ వుందని నిరూపించుకోడానికే ఈ పథకమంతా.

ఆ రోజు సాయంత్రం 'రీబోర్' చేసిన మోటార్ సైకిల్ తీసుకొని మద్రాసుకు సుమారు వందమైళ్ళ దూరంలో గూడూరుకు దగ్గరగా వున్న తన నారింజ తోటకు వెళ్ళా ననీ, తోటలో కాయిలకు పట్టిన పురుగుల్ని చంపడానికి అవసరమైన లితో క్రాన్'అనే మందును తోటమాలి రామ లింగానికి అప్పజెప్పి వెంటనే మద్రాసు తిరిగివచ్చాననీ చెప్పాలని సుబ్రమణ్యం పథకం.

క్రొత్త రూపాయినోట్ల కట్ట ఇచ్చి లితో క్రాన్ కొన్న కష్టమర్‌ని పెస్టిసైడ్స్ అమ్మే షాపుయజమాని తప్పక గుర్తుంచుకొంటాడు. కనుక పురుగుల మందు కొనడం అనే విషయం నిజమని ఋజువవుతుంది బిల్‌తో సహా.

అంతకు ముందురోజే తోటమాలి రామలింగానికి పురు గుల మందు డబ్బిలు కొనిచ్చి పోలీసులు వచ్చి ప్రశ్నిస్తే ఏం చెప్పాలో ముందే చెప్పివుంచాడు. పోలీసులు అడిగితే ఆ రోజు సాయంత్రం ఎనిమిది-ఎనిమిదిన్నర మధ్య సుబ్ర మణ్యం లోపలకు వచ్చి పురుగుల మందు యిచ్చి వెళ్ళి నట్లు సాక్ష్యం చెపుతాడు రామలింగం.... సందేహము లేదు.

రామలింగం సాక్ష్యానికి కొరాబరేటివ్ ఎవిడెన్స్‌గా

వాషర్‌మన్ పేటలోని ఇరానీ హోటల్‌వాడి సాక్ష్యం వుంటుంది. తోట నుండి తిరిగివస్తూ 'ఇరానీ హోటల్' దగ్గర ఆగినట్లు సుబ్రమణ్యం చెపుతాడు. గూడూరు నుండి మద్రాసులోకి రావాలంటే వాషర్‌మన్‌పేట మీదుగానే రావాలిగనుక ఆ సంఘటనకు కొంత వాస్తవికతవుంటుంది. హోటల్ సర్వరు, యజమాని తప్పక సుబ్రమణ్యాన్ని గుర్తుపట్ట గలుగుతారు.

గుడ్! వెరీగుడ్! ఏ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసరూ దీన్ని స్వాల్ చెయ్యలేడు. మురుగావతారాన్ని చంపడానికి కావలసిన 'మోటివ్' తనకే వున్నా అవకాశం ఏ మాత్రం లేదని తెలుస్తుంది.

సుబ్రమణ్యం తనను తానే మనసులో తృప్తిగా అభినందించుకొన్నాడు.

6

ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తన ముందు ఫైల్లోని వివరాలు మరొక్కసారి జాగ్రత్తగా చదివాడు.

ఉదయం మూడు గంటలకు పనివాడు మురుగావతారం శవాన్ని చూసి పోలీసులకు తెలియబరిచాడు. పదిహేనంగుళాల కసాయి కత్తితో వీపులో పొడిచి హత్య చేశారు మురుగావతారాన్ని. ఇంట్లో వస్తువులు కాని, వున్న కొద్ది డబ్బుగాని పోయినట్లు అనిపించకపోవడం వలన హత్యకు మోటివ్ దొంగతనం కాదని స్పష్టంగా తెలుస్తోంది.

మురుగావతారం అంతకు ముందురోజు రాత్రి ఎనిమిది-ఎనిమిదిన్నరకు మధ్య మరణించి వుండాలని పోస్ట్‌మార్టమ్ రిపోర్టులో ధృవపరిచాడు డాక్టరు.

మురుగావతారం మరణంవల్ల లాభించేది సుబ్రమణ్యాని కొక్కడికే. మురుగావతారం ఇంతవరకూ విల్లు వ్రాయక

పోవడంవలన అతని ఆ స్తంతా అతని వారసుడిగా సుబ్ర మణ్యానికి దక్కుతుంది. పాతిక లక్షల ఆస్థి కన్నా హత్య చెయ్యడానికి మంచి మోటివ్ ఏముంటుంది?

కాని; హత్య జరిగిన సమయంలో సుబ్రమణ్యం మద్రాసుకు సుమారు వంద కిలోమీటర్ల దూరంలోని తన నారింజతోట దగ్గర వున్నట్లు తోటమాలి రామలింగం సాక్ష్యం చెప్పినట్లు గూడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ దగ్గరనుండి వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది.

సుబ్రమణ్యం పురుగుల మందు కొన్నట్లు, రాత్రి పది గంటల ప్రాంతంలో వాషర్‌మన్‌పేటలోని ఇరానీ హోటల్ వాడితో గొడవపడినట్లూ నిర్భేద్యమయిన ఎలిబీలువున్నాయి.

గారేజ్ మెకానిక్ సాక్ష్యం ప్రకారం ఆ రోజే రిపేర్ చేసిన మోటర్‌సైకిల్‌ను సుబ్రమణ్యం తీసుకొన్నట్లు తెలిసింది. అందుచేత అతను నారింజ తోటకు వెళ్ళిరావడం నిజమే అయివుండాలి.

అయితే! మురుగావతారం యెందుకు హత్యచేయబడ్డాడు? వరదాకి పనిగట్టుకొని అతన్ని హత్యచేయవలసిన అవసరం యెవరికుంది? అతని కెవరైనా శత్రువులున్నారా? లేక సుబ్రమణ్యమే తనకు ఎలిబీ ఏర్పాటు చేసుకొని మరెవరి ద్వారా నన్నా ఈ హత్య చేయించాడా...?

ఇంతకు ముందే సుబ్రమణ్యాన్ని పోలీస్ కష్టడీ నుండి వదలిపెట్టడం జరిగింది. అతను చెప్పిన విషయాలన్నీ యధార్థం అని ఋజువులు దొరగ్గానే....

బుర్ర వేడెక్కిపోతోంది ఆ లోచనలతో కృష్ణ మోహన్‌కు...

తల విదిలించి సిగరెట్ వెలిగించి క్షణం కళ్ళు మూసుకొని ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఎందుకో సుబ్రమణ్యమే ఈ హత్య చేసుండాలని అతని అనుభవం హెచ్చరిస్తోంది.

ఫైలు తెరిచి మళ్ళీ అందరి వాఙ్మూలాలూ ఓసారి జాగ్రత్తగా చదివాడు కృష్ణమోహన్. సత్యసాయి గారేజ్ మెకానిక్ సాక్ష్యం చదువుతూ ఓ వాక్యం దగ్గిర క్షణం ఆలోచిస్తూ ఆగిపోయాడు

చటుక్కున లేచినిలబడి గదిలోంచి బయటకు వచ్చాడు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే వుంచిన సుబ్రమణ్యం రాజ్‌దూత్ మోటార్ సైకిల్ వైపు చర చర నడిచాడు.

7

పడక్కుర్చీలో పడుకొని చిద్విలాసంగా చుట్ట కాలుస్తున్న సుబ్రమణ్యం కళ్ళు ఆశ్చర్యంగా తెరుచుకొన్నాయి.

ఎదురుగా—జింకపిల్లపై దూకబోయే పులిలా ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, అతన్తోపాటు బేడీలు పుచ్చుకొని కాన్‌స్టేబుల్స్ నిలబడి వున్నారు.

"సుబ్రమణ్యం! యు ఆర్ అండర్ అరెస్టు!"— అన్నాడు కృష్ణమోహన్ దిగ్విజయంగా.

"వాట్ డుయు మీన్?" అరిచాడు సుబ్రమణ్యం ఆశ్చర్యంగా....

"నీ మేనమామ మురుగావతారాన్ని చంపిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాను...." అన్నాడు కృష్ణమోహన్.

"అబ్సర్డ్....ఇన్‌స్పెక్టర్ మీరు పొరబడ్డారు." అరిచాడు సుబ్రమణ్యం మళ్ళీ కంగారుగా....

"నో మైడియర్ ఫెలో....చాలా తెలివిగా చేశావు నువ్వీ హత్య. కాని చిన్న పొరపాటు చేశావు గారేజ్ మెకానిక్ అయిదు లీటర్ల పెట్రోలుతో బండి నీ చేతికిచ్చాడు. ఎంత జాగ్రత్తగా డ్రైవ్ చేసినా రెండొందల కిలోమీటర్లు తిరిగితే

ఆ పెట్రోలు దాదాపు అయిపోయి వుండాలి. కాని నీ మోటర్ సైకిల్ టాంకులో ఇంకా నాలుగు లీటర్లు పైబడి పెట్రోలు వుంది... అంటే నిన్న సాయంత్రం వూరు వదలి నీ వెక్కడికీ వెళ్ళలేదని అర్థమయిపోతోంది. ఈ విషయం తెలియగానే రామలింగాన్ని అరెస్టు చేయించాను. గూడూరు ఇన్‌స్పెక్టర్ సెల్‌లోవుంచి నాలుగు తగిలించగానే నిజం చెప్పేశాడు. అంతేకాదు—నీ తోటలోవున్న 'లితోక్రాన్' మందు డబ్బాలు తాము అమ్మినవికావని, ఆ డబ్బాలపై బ్యాచ్ నెంబరు వేరేవుందని, వాటిని పరీక్షించిన పెస్టిసైడ్స్ షాప్ ఓనరు చెప్పాడు—" అన్నాడు కృష్ణమోహన్ కానిస్టేబుల్‌కు సైగచేస్తూ....

సుబ్రమణ్యానికి నోటమాటలేదు. స్థాణువులా నిలబడిపోయాడు. పాతికలక్షలు కరెన్సీ మురుగావతారం చితితో పాటు రగలబడిపోతున్న దృశ్యం అతని కళ్ళముందు కదిలింది.... □

వేడి కాఫీ!



5 నెంబరు బూట్లు

కె.వి.రమణి

సుమారు ఇరవై ఏళ్ళ వయసు. తగిన ఎత్తు లావూ కలిగి పోతపోసిన విగ్రహమల్లేవుంది. గులాబీరంగు ఒళ్ళు నునుపుగా నిగనిగలాడుతోంది. అందం; ఆరోగ్యం; ఆమె శరీరంలో ఒకదానితో ఒకటి పోటీలు పడుతున్నట్టున్నాయ్. స్విమ్మింగ్ డ్రెస్‌లో వున్న సుందరాంగిని ఆడా మగా

కళ్ళప్పగించి అలా చూస్తూ వుండిపోయారు.

దివినుండి దిగివచ్చిన దేవకన్యలా. కదిలే అజంతాశిల్ప సుందరిలా నెమ్మదిగా అడుగులువేస్తూ రెయిలింగ్ ఆసరాగా స్విమ్మింగ్‌పూల్‌లో దిగిందామె. కేరింతలు కొడుతూ స్విమ్మింగ్‌పూల్ మధ్యకు వచ్చింది. వెల్లకిలా తిరిగి ఈదు తోంది హుషారుగా!

ఇంతలో 'సర్!'మనే ధ్వని సన్నగా రెండుమార్లు విన పడింది. అంతే! నీటిలో వెల్లకిలా తేలుతూ ఈదుతున్న ఆమె నోటినుండి బాధగా ఒక ఆర్తనాదం వెలువడింది. కాళ్ళూ చేతులు తపతప కొట్టుకుంటూ నీటిలో మునిగి పోయిందామె. స్విమ్మింగ్‌పూల్ క్షణాలమీద రక్తమయ మయింది.

జనం ఆ దృశ్యాన్ని చూసి భయంతో కేకలు వేయ సాగారు. స్విమ్మింగ్‌పూల్ ప్రాంతమంతా గగ్గోలయి పోయింది: క్షణాలమీద పోలీసులు చేరుకున్నారు అక్కడకు.

హేట్ వంకనపెట్టుకొని స్విమ్మింగ్‌పూల్ గట్టుమీద శవంముందు మోకాళ్ళమీద కూర్చున్నాడు ఇన్‌స్పెక్టర్ షరీఫ్. ఛాతీమీద సరిగ్గా వక్షోజాలకు మధ్యగా దూసుకు పోయాయి తుపాకిగుళ్ళు ఫలితంగా వెంటనే ప్రాణాలు పోయాయని గ్రహించాడు షరీఫ్.

ఇంతలో హెడ్ ఐరావతం ఇద్దరు పురుషులతో వచ్చి "సార్! వీరు ఈ హత్యను కళ్ళారా చూసినవాళ్ళు తుపాకీ కాల్పులగురించి మీతో కొన్ని వివరాలు చెప్పాలని వచ్చారు" అన్నాడు. షరీఫ్ లేచి తలవూపుతూ "చెప్పండి" అన్నాడు.

ఇద్దరిలోనూ ఒక వ్యక్తి "ఆమె స్విమ్మింగ్‌పూల్ మధ్యకు ఈదుకుంటూ వచ్చేసరికి సర్‌మంటూ చప్పుడు రెండు సార్లు వినిపించింది. ఛాతీ రక్తమయంకాగా ఆమె

నీట మునిగిపోయింది. ఎవరో ఆమెను సైలెన్సర్ వుపయోగించి తుపాకీ కాల్పులు జరిపారని వూహించి, శబ్దం విన వచ్చిన దిక్కుగా చూసాను. హోటల్ ఎనిమిదో అంతస్థు కుడివేపున ఒక గది కిటికీ చటుక్కున మూసుకుందా క్షణంలో. ఆ కొద్దిపాటి సమయంలో మూసుకుంటున్న కిటికీ తలుపు సందులో నుండి ఒక పురుషాకారం కనబడింది. అతని దగ్గర రైఫిల్‌లాంటిది లీలగా కనబడింది. అంతే!" అన్నాడు.

షరీఫ్ తలతిప్పి అజంతాహోటల్ ఎనిమిదో అంతస్థుకేసి చూసాడు. కుడివేపునుండి స్విమ్మింగ్‌పూల్‌లో వున్న మనిషి చాలా స్పష్టంగా అగుపడే వీలుంది. అదే ఎడమ నుండయితే ఒక పెద్ద చెట్టు అడ్డుగా వుంటుంది. హంతకుడెవరో అన్నీ బాగా పరిశీలించిన మీదటే రంగంలోకి దిగాడన్నమాట!

"కుడివేపంటే ఏ గది? స్పష్టంగా చెప్పలేరా?" ప్రశ్నించాడు షరీఫ్ అతన్ని.

పెదవి విరిచాడావ్యక్తి నిస్సహాయంగా. "అంతా క్షణాలమీద జరిగిపోయింది సార్! కుడి చివరినుండి రెండు మూడు గదులు తప్పితే మరో రెండు మూడు గదుల్లో ఏదయినా కావచ్చు ఇంతకుమించి ఖచ్చితంగా నేను చెప్పలేను అన్నీ ఒకేమోస్తరు గదులాయె" అన్నాడతను నిరాశగా ఎనిమిదో అంతస్థు వెనక భాగాన్ని పరిశీలనగా చూస్తూ.

రెండోవ్యక్తి కూడా ఇంచుమించు అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

షరీఫ్ హెడ్ ఐగావతం చేసి తిరిగి "నువ్వు వెంటనే ఎనిమిదో అంతస్థు కుడిభాగంలో వున్న గదులన్నీ సోదా చేయించు. వీరు చెప్పిన ఆ నాలుగయిదు గదులూ మరింత

జాగ్రత్తగా చూడు" ఆజ్ఞాపించాడు షరీఫ్.

ఐరావతం కొందరు పోలీసులను వెంట బెట్టుకొని హోటల్ వేపు పరుగందుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ ప్రక్కనే చేతులు కట్టుకొని వినయంగా నిలబడివున్న అజంతా హోటల్ మేనేజర్ రంగారావ్ వంక తిరిగి "ఈ అమ్మాయి ఎన్నాళ్ళుగా మీ హోటల్లో వుంటోంది. ఈమెకు సంబంధించి మరెవరూ లేరా?" అని ప్రశ్నించాడు.

"ఈమె మా హోటల్‌లో వుండడంలేదు సార్. ప్రతి రోజూ స్విమ్మింగ్‌కని వస్తూ వుంటుంది. బిజినెస్‌మాగ్నెట్ భూపతిగారి మేనకోడలు. పేరు రాధ. భూపతిగారబ్బాయి రమేష్‌తో వారం రోజుల్లో ఈమెకు వివాహం కూడా నిశ్చయమైంది" అన్నాడు రంగారావు రాధగా.

ఇంతలో అక్కడికి దాదాపు పరుగున వచ్చారిద్దరు వ్యక్తులు. వారిలో ఒకరికి సుమారు యాభైయేళ్ళ వయసు వుండగా, రెండో వ్యక్తి పాతికేళ్ళ యువకుడు. పెద్దాయన రాధ శవందగ్గర కూలబడిపోయి "ఏంటమ్మా ఇది.... ఎవరు చేశారీ ఘాతుకం...." అంటూ మొహాన్ని చేతుల మధ్య దాచుకొని విలపించసాగాడు. యువకుడు దిగ్భ్రమ చెందినవాడికి మల్లే శవం మొహంలోకి వెర్రిగా చూస్తూ వుండిపోయాడు.

హోటల్ మేనేజర్ రంగారావు, షరీఫ్‌తో నెమ్మదిగా "భూపతిగారాయనే" అన్నాడు.

"మరి ఆ కుర్రాడెవరు? రమేషా?" అడిగాడు షరీఫ్.

కాదన్నట్టు తలాడిస్తూ "అతడెవరో నాకు తెలియదు" అన్నాడు మేనేజర్.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ భూపతిని సమీపించి అనునయంగా

"టేకిట్ ఈజీ సర్! బాధపడి మనం చేయగలిగేది లేదు" అన్నాడు.

భూపతి నెమ్మదిగా లేచి జేబు రుమాలుతో కళ్ళుతుడుచుకున్నాడు.

"ఇంతకూ ఈ వార్త మీ కెలా తెలిసింది?" అడిగాడు షరీఫ్ అతణ్ణి.

"అంతా మా ఖర్మ ఇన్‌స్పెక్టర్! చేరువలో వుండి కూడా ఏమీ చేయలేకపోయాం. బిజినెస్ విషయాలు పార్ట్నర్స్‌తో చర్చించేందుకని ఈ హోటల్‌లోనే ఒక రూమ్ బుక్‌చేసి వుదయమే చేరానిక్కడికి" అన్నాడు భూపతి.

"మరి ఈ అబ్బాయి?" ప్రక్కనున్న యువకుణ్ణి చూపి ఆగిపోయాడు షరీఫ్.

"వీడు మా తమ్ముడి కొడుకు సురేష్. వీడూ ఏదో పార్టీకని ముందుగా హోటల్‌కొచ్చి రూమ్ బుక్‌చేసి వున్నాడిక్కడ. స్విమ్మింగ్‌పూల్ దగ్గర ఎవరో అమ్మాయిని షూట్‌చేసారంటే మామూలుగా చూసేందుకని నేను వస్తూ వుంటే సురేష్ నా ముందుగా గాభరాగా పరుగెడుతున్నాడు. సంగతేమిటంటే రాధను స్విమ్మింగ్‌పూల్ దగ్గర ఎవరో హత్యచేసారట అన్నాడు. ఇద్దరం పరుగున ఇలా వచ్చాం" అన్నాడు భూపతి.

షరీఫ్ సురేష్‌వంక తిరిగి, "చనిపోయిన అమ్మాయి రాధని మీకెలా తెలిసింది?" అని ప్రశ్నించాడు.

"నేనూ పెదనాన్నగారిలానే ఎవరో అమ్మాయి ఇక్కడ హత్యచేయబడిందని విని ఇటుగా బయలుదేరివస్తుండగా మా ఫ్రెండొకడు ఎదురయి 'రాధను స్విమ్మింగ్‌పూల్‌లో ఎవరో షూట్‌చేసారు' అని చెప్పాడు. అదే విషయాన్ని

నేను పెదనాన్నతో అన్నాను" అన్నాడు సురేష్.

షరీఫ్ తల వూపుతూ "మీరు హోటల్‌లో ఏ ఏ అంత స్థుల్లో రూమ్స్ తీసుకున్నారు" అడిగాడు కాజువల్‌గా.

"ఇద్దరం ఎనిమిదో అంతస్థులోనే. అదీ ప్రక్క ప్రక్క రూములు. ఆ సంగతీ మా కిప్పుడే తెలిసింది. నాది రూమ్ నెంబరు పది, వీడిది పదకొండు." అన్నాడు భూపతి.

షరీఫ్ చటుక్కున మేనేజర్ రంగారావ్‌కేసి తిరిగి "పది, పదకొండు గదులు ఏవు వేపు వున్నాయి?" అని ప్రశ్నించాడు

"పడమటివేపు"

షరీఫ్ నొసలుముడుస్తూ "అలాగా?" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ ఎనిమిదో అంతస్థు కుడిభాగానవున్న గదుల చెక్ చేసాడు.

రూమ్ నెంబరు పది, పదకొండూ వాటిలో వున్నాయి. భూపతి సురేష్‌లకు సంబంధించి ఆ రెండు గదుల్లోనూ కనీసం సూట్‌కేసయినా లేదు. రెండు రూములు గతరాత్రే ఖాళీ చేయబడి రాధ హత్యజరిగే సమయానికి తాళాలు వేసి వున్నాయి. మరో గది నెంబరు తొమ్మిది. ఆ గదిలోవున్న ఒక యువకుడు మాత్రం హత్య జరిగిన ఐదు నిముషాలకు హడావుడిగా గది ఖాళీచేసిపోయినట్లు తెలిసింది.

రిజిష్టరులో ఆ యువకుణ్ణి గూర్చి - మధుసూదన్ ఫ్రమ్ కలకత్తా. టూరిస్టు; అని మాత్రంవుంది. రిజిష్టరు మేనేజరు రంగారావ్ చేతికియిస్తూ "ఈ మధుసూదన్ గురించి మనకు ఇంతకుమించి వివరాలెలా తెలుస్తాయి?" అని అడిగాడు.

"రిసెప్షనిస్టుకు ఏమన్నా తెలుసేమో! పిలిపించ మంటారా?" అన్నాడు రంగారావ్. పిలవమన్నట్టు తల

వూపాడు షరీఫ్

ఐదు నిముషాల్లో వయ్యారంగా శరీరమంతా కుదుపుతూ నడచివచ్చి "గుడ్ మార్నింగ్ సర్!" అంది రిసెప్షనిస్టు మరకతం.

మరకతాన్ని ఎగాదిగా చూసాడు షరీఫ్. మేకప్‌కోసం ఎంత లేదన్నా ఒకగంట టయిము పడుతుందామెకు, అనుకున్నాడు.

"మిస్ మరకతం! రూమ్‌నెంబర్ తొమ్మిది నుంచి వెళ్ళిపోయిన మధుసూదన్ సరిగ్గా ఆ సమయానికే రూమ్ ఖాళీ చేయాల్సివుందా?" ప్రశ్నించాడామెను షరీఫ్

"నో సర్! అతడు సాయంత్రం ఆరింటివరకూ వుండొచ్చు. అతడు గది తీసుకున్నది కూడా అంతకు ఒక గంట ముందుమాత్రమే!"

"మరి అంత అర్ధాంతరంగా అతడు గది ఖాళీచేసి పోతుంటే ఏం అనుమానం రాలేదా?"

"ఎందుకుసార్! ఎందరో వస్తుంటారు. ఎప్పుడుబడితే అప్పుడు పోతూవుంటారు. ఎవర్నని అనుమానించి ప్రశ్నలు వేయగలం. అదీగాక ఆ సమయానికి హత్యావార్త మాలో ఎవరికీ తెలియదు కూడా" మధ్యలో కల్పించుకుంటూ చెప్పాడు రంగారావ్.

షరీఫ్ అతణ్ణి తీవ్రంగా చూస్తూ "నేను ప్రశ్న వేసింది ఆమెను. ఏ జవాబయినా ఆమెనే చెప్పనివ్వండి?" అన్నాడు గట్టిగా.

మేనేజర్ "సారీసర్!" అంటూ నోరు మూసేసాడు.

షరీఫ్ మరకతం వంక చెప్పమన్నట్టు చూసాడు.

"అతడు రావడమే హడావుడిగా వచ్చాడుసార్. కౌంటర్‌మీద తాళాలు పడేసి గది ఖాళీచేసి పోతున్నట్టు

సైగచేసాడు. నేను నవ్వుతూనే "వచ్చి గంటకూడా కాలేదు అప్పుడే వెళ్ళిపోతున్నారా! మీకు మా హోటల్ నచ్చలేదా అన్నాను." అతడు నవ్వుమొహంతో అర్జంటు పని తగిలిందన్నట్టు సైగచేసాడు. గది అద్దెపోనూ అడ్వాన్సుగా ఇచ్చిన వందరూపాయల్లో బేలెన్సు తిరిగి ఇవ్వబోతుండగా అక్కర్లేదన్నట్టు చేతితో సంజ్ఞచేసి. వెనక్కి తిరిగయినా చూడకుండా వెళ్ళిపోయాడు" అంది మరకతం.

షరీఫ్ చిన్నగా నవ్వుతూ "అది సరే! ఎంతసేపూ సైగ చేసాడనే చెబుతున్నావు. అతనికి నోరులేదా?" అన్నాడు.

మరకతం సయితం నవ్వేస్తూ "అవున్సార్! ఆ మాట చెప్పడమే మరచాను. అతను మూగవాడు" అంది.

"మనిషి ఎలా వుంటాడు. తిరిగిచూస్తే పోల్చగలవా?"

"మనిషి పొడవూ పొట్టికాక మధ్యస్థంగా. కాస్తంత పుష్టిగా వుంటాడు సార్. తెలుపురంగు. హిప్పీజుత్తు దాదాపు మొహమంతటినీ కప్పేస్తూ నల్లని కళ్ళద్దాలు. పుల్ హేండ్స్ షర్టును లూజ్‌గా టక్‌చేసాడు. చేతిలో ఒకే ఒక సూట్‌కేసు చూడగానే కులాసా పురుషుడల్లే కనపడతాడు సార్!" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంది మరకతం.

"అమ్మా మరకతం ఇంతకూ నీకు పెళ్ళయిందా" చిలిపిగా నవ్వుతూ అడిగాడు షరీఫ్

"భలేవారండీ నే నింకా మిస్‌నే" అంది ఒంకరులు తిరుగుతూ మరకతం.

3

షరీఫ్ తన ముందున్న బూట్లజతను మరోమారు దీక్షగా పరికించి చూసాడు. అవి మధుసూదన్ ఖాళీచేసిన గదిలో మంచంకింద వున్నాయి. ఇవితప్ప ఆ గదిలో ఒక కాగితం ముక్క కూడా దొరకలేదు. కానీ వీటి నంబరు ఐదు.

పాతికేళ్ళ మధుసూదన్ కాలిబూట్లు ఐదోనంబరా! ఈ పైజు బూట్లు ఏ పన్నెండేళ్ళ పిల్లలివో అయివుంటాయి. బూట్లు సరికొత్తగా వుండి ఓ ఫర్లాంగు దూరమయినా నడిచి నట్టులేవు.

ఈ బూట్లు మరి ఆ గదిలో ఎందుకున్నట్టు? ఒకవేళ మధుసూదన్‌కు ముందు ఆ గదిలో వుండినవాళ్లెవరయినా వీటిని అక్కడ మరచిపోయారా? అదే ప్రశ్న రంగారావ్‌ని అడిగాడు షరీఫ్.

రంగారావ్ తల గోక్కుంటూ "సాధారణంగా అలా జరగదుసార్! ఎందుకంటే ఏ గది ఖాళీ అయినా వెంటనే పూచికపుల్లను సయితం విడవకుండా శుభ్రం చేసేస్తారు మావాళ్ళు. పొరపాటున ఎవరయినా ఏ వస్తువును మరచి పోయినా జాగ్రత్తచేసి వుంచుతాం తప్ప గదిలో వదిలే యడం జరిగదు. అయినా ఎందుకయినా మంచిది. ఈ గదిలో అంతకుముసుపు వున్నవాళ్ళ లిస్టు చూస్తే కొంత అనుమానం తీరుతుం"దని రిజిష్టరు తెప్పించి చూసాడు.

ఆ గదిలో రిజిష్టరు ప్రకారం అంతకుముసుపు ఓ బెంగాలీ కుటుంబం దిగినట్టు తేలింది. వారిలో పది, పన్నెం డేళ్ళు వయసుగల కుర్రాళ్ళు ఇద్దరున్నారు.

రంగారావ్ మొహాన్ని నీరసంగా పెడుతూ "ఈ బూట్లు బహుశా వాళ్ళలో ఎవరివో కావచ్చు సార్!" అన్నాడు.

షరీఫ్ తల వూపుతూ "అది నిజమే కావచ్చు. అయినా ప్రస్తుతానికి వీటిని మా దగ్గరే వుంచుతాం" అన్నాడు.

ఈలోగా భూపతి, సురేష్‌లు రాధ శవాన్ని తమతో తీసుకు వెళతామన్నారు. పోస్టుమార్టమ్ జరిగేవరకూ శవాన్ని ఇవ్వడం కుదరదని చెబుతూ షరీఫ్:

"మీ ఇద్దరిలో యెవరికయినా షూటింగ్ తెలుసా!" అని

ప్రశ్నించాడు.

భూపతి తల వూపుతూ "మా యింట్లో అందరం తుపాకీ పేల్చగలం. నేనూ, సురేష్, రమేష్....అందరం రైఫిల్ షూటింగ్‌లో ఎక్స్‌పర్టులమే!" అన్నాడు గర్వంగా.

4

స్టేషనులో కూర్చొని రాధ కేసులో అప్పటివరకూ తెలిసిన వివరాలు పరిశీలించి ఒక అభిప్రాయానికి వచ్చే ప్రయత్నాలు ప్రారంభించాడు షరీఫ్.

రాధ హత్య సరిగ్గా వుదయం ఏడూ నలభై ఐదు నిముషాలకు జరిగింది. తామంతా శవం దగ్గర వుండగా యెనిమిది గంటల సమయంలో భూపతి సురేష్‌లు వచ్చారక్కడికి రాధను తామున్న గదుల్లోనుండి షూట్ చేసి తుపాకీని ఏదో ఒకచోట దాచిపెచ్చేందుకు ఇద్దరికీ అవకాశం వుంది. ఇద్దరూ షూటింగ్‌లో ఎక్స్‌పర్టులే!

మరోవ్యక్తి మధుసూదన్. ఇతడూ అనుమానించవలసిన వ్యక్తే. రాధను హత్యచేసే అవకాశం ఇతనికీ వుంది. కానీ మధుసూదన్ ప్రస్తుతం ఎక్కడ వున్నాడు? కలకత్తా నివాసికి ఇక్కడి మనిషిని హత్యచేసే అవసరమేముంది? లేక మధుసూదన్ ఇక్కడివాడేనా?

కణతలు నొక్కుకున్నాడు షరీఫ్. ముందు భూపతి ఇంటి వివరాలు తెలుసుకోవాలి పూర్తిగా.

వెంటనే భూపతి ఇంటికి బయలుదేరాడు.

భూపతి నివాసం రాజభవనంలా వుంది. ఏ మూల చూసినా ఐశ్వర్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

భూపతి కొడుకు రమేష్‌లో మరకతం వర్ణించిన మధుసూదన్ పోలికలు వున్నాయి. కానీ రమేష్ చక్కగా

మాటాడగలడు. రాధ మరణం రమేష్‌ను బాగా క్రుంగ దీసింది. ఏం అడిగినా వేదాంతం చెబుతున్నాడు.

హతురాలు రాధ భూపతి భార్య వర్ధనమ్మ తమ్ముడి కూతురు. తలిదండ్రులకు రాధ ఏకైక సంతానం. లక్షలాది ఆస్తికి వారసురాలు. అయినా స్వంతవూరు పల్లెటూరు కావడం మూలంగా చదువుకోసమని రాధ భూపతి ఇంట్లో వుంటోంది.

రాధ కాక ఆ యింట్లో మరో యువతి సునీత వుంది. సునీత భూపతి చెల్లెలికూతురు. నిజానికి సునీతను కోడలిగా చేసుకోవాలన్నది భూపతి కోరిక. భూపతి ఆ మేరకు ఒక నాడు చనిపోయిన తన చెల్లెలికి మాట కూడా యిచ్చాడు. అయితే వర్ధనమ్మ తన కొడుక్కి తన తమ్ముడికూతురు రాధను చేసుకుంటానని పట్టుబట్టడంవల్లనూ, రమేష్ సయితం రాధనే యిష్టపడిన కారణంగానూ భూపతి మరి మాటాడలేక పోయాడు.

ఇకపోతే సురేష్ భూపతి యింట్లో చాన్నాళ్ళుగా వుంటు న్నాడు. సురేష్ గురించి చెబుతూ "రమేష్‌లాగే ఐశ్వ ర్యంలో పుట్టి పెరగవలసినవాడు. తండ్రి దుర్వ్యసనాల మూలంగా బికారిగా మారాడు. తప్పదు గనక యేదో చేర దీసాను" అన్నాడు భూపతి.

సురేష్ కూడా రాధను ప్రేమించాడు. కానీ రాధ అతడి ప్రేమను తిరస్కరించింది.

షరీఫ్ భూపతి యింట్లో వున్న పనివాళ్ళతో సహా అందరితోనూ మాటాడాడు. యెన్నో విషయాలు తెలుసు కున్నాడు.

అంతా అయ్యాక భూపతిని "మీరు షూటింగ్‌కి వుప యోగించే గన్ చూపెడతారా?" అని అడిగాడు షరీఫ్.

"వై నాట్?" అంటూ భూపతి లోపలినుండి ఒక సూట్ కేస్ తెచ్చి షరీఫ్ ముందుంచాడు.

షరీఫ్ తానడిగింది భూపతి సరిగా విన్నాడో లేదో నని "నే నడిగింది ..." అంటుండగా భూపతి నవ్వుతూ "మీ రడిగింది యిదే ఇన్ స్పెక్టర్!" అంటూ సూట్ కేస్ మూత తెరిచాడు. సూట్ కేస్‌లో ఒక రైఫిల్ ఏ భాగానికది విడ దీయబడి అరల్లో పేర్చబడి వుంది. బుల్లెట్సు సయితం వరుసగా పేర్చబడి వున్నాయందులో.

భూపతి గర్వంగా "ది మోస్ట్ పవర్ ఫుల్ అండ్ పెర్ఫెక్ట్. టెలిస్కోపిక్ అండ్ సైలెన్సర్ సిస్టమ్స్ అటాచ్డ్. జర్మన్ యింపోర్టెడ్" అన్నాడు.

షరీఫ్ ఒక్కొక్క భాగాన్నీ తీసి పరిశీలనగా చూశాడు. రైఫిల్ బారల్‌ను ముక్కు దగ్గర వుంచి "భూపతిగారూ! ఈ రైఫిల్‌ని మీరు ఆఖరుసారిగా ఎప్పుడు వుపయోగించారు?" అని ప్రశ్నించాడు.

భూపతి వేలితో నొసటిమీద రాస్తూ ఆలోచనగా "ఖచ్చితంగా చెప్పలేను. ఏముయినా పదిరోజుల పైమాటే" అన్నాడు.

షరీఫ్ ఆ మాటకు కాదన్నట్టు తల అడ్డంగా వూపుతూ "ఈ రైఫిల్ వుపయోగించి కేవలం కొన్ని గంటలు మాత్రమే అయిందని నేను ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు స్థిరంగా.

భూపతి ఆశ్చర్యపోతూ కోపంగా "అంటే ఏమిటి మీ వుద్దేశం? యామ్ ఐ టెల్లింగ్ లైస్" అన్నాడు.

షరీఫ్ చిన్నగా నవ్వుతూ "ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. ఇందులో వున్న బుల్లెట్సుకు లెక్కేమన్నా వుందా" అన్నాడు.

"ఉంది" అంటూ లెక్క చెప్పాడు భూపతి నమ్మకంగా.

షరీఫ్ వాటిని లెక్కపెట్టి "రెండు తక్కువ వున్నాయ్" అన్నాడు.

భూపతి ఆశ్చర్యంగా "ఏమిటీ!" అంటూ తనూ లెక్కపెట్టాడు వాటిని. అతని మొహం క్షణాలమీద వివర్ణమైంది. "ఇన్‌స్పెక్టర్! నా కిదంతా అయోమయంగా వుంది. ఆ బుల్లెట్స్ రెండూ యేమయి వుంటాయ్?" అన్నాడు సీరసంగా.

షరీఫ్ "బహుశా, అవి రాధ గుండెల్లో భద్రంగా వుండి వుంటాయ్" అన్నాడు గంభీరంగా.

"నో! అలా జరిగే వీల్లేదు. నా రైఫిల్‌ను నేనుగాక బయటికెవరు తీసుకువెళతారు....?" అరిచాడు భూపతి ఆవేశంగా.

"ఆ విషయం మేం త్వరలోనే తేల్చుతాం. రాధ పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చేంతవరకూ ఈ సూట్‌కేస్ మా దగ్గరే వుంటుంది" అని లేచాడు షరీఫ్.

5

పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చింది. రాధ గుండెల్లో దిగబడిన బుల్లెట్లు భూపతి రైఫిల్ నుండి వెలువడినవే. షరీఫ్ కావాలనుకుంటే భూపతిని ఆ క్షణంలో అరెస్టు చేయొచ్చు. కానీ ఏ విషయమూ నిర్ధారణ కానిదే చర్య తీసుకోవడం అతని అభిమతానికి విరుద్ధం.

ఇంతకూ రాధను హత్యచేసే అవసరం, అవకాశం ఎవరికుంది?

భూపతి: చెల్లెలు కూతురు సునీతమీద అంతు లేని వాత్సల్యం వుంది. ఆమెను తన యింటి కోడలుగా తెచ్చు

కోవాలన్న కోరిక రాధ కారణంగా నెరవేరే అవకాశం లేదు. రాధను ఏదోలా తప్పించగలిగితే సునీత తన యింటి కోడలు కావడం పెద్ద కష్టంకాదు. సునీత సయితం రాధకు సరితూగగల అందగత్తె. విద్యావంతురాలు కూడా. రాధ కళ్ళెదుట లేనపుడు రమేష్ సునీతను పెళ్ళాడే అవకాశాలు బాగా వున్నాయ్!

సురేష్: రాధను ప్రేమించాడు. పెళ్ళాడాలనుకున్నాడు. కానీ రాధ అతణ్ణి తిరస్కరించింది. పైగా అంతస్థుల ప్రసక్తి తెచ్చి అతణ్ణి అవహేళన చేసింది. సురేష్ రాధను హత్యచేసేందుకు ఆ కారణం చాలు. తను మనసారా ప్రేమించిన స్త్రీ తన పరిస్థితిపట్ల జాలి చూపకపోగా హేళనగా మాటాడడం ఒకో ప్రేమికుడు సహించలేక పోవచ్చు. మనుషులందరి స్వభావాలూ ఒకేలా వుండాలనే రూలేం లేదు.

రమేష్: రాధను వలచి వలపించుకున్న వ్యక్తి. కొద్ది రోజులలో ఆమెతో వివాహం కూడా జరగబోతోంది. అందం, చందం, ఐశ్వర్యంవున్న రాధను అతను ఎందుకు వదిలించుకోవాలనుకుంటాడు.

ఇక మిగిలిన వ్యక్తి అజంతా హోటల్లోని తొమ్మిదో నంబరు గదిలో బసచేసిన మధుసూదన్. సాయంత్రం వరకూ వుంటానన్న అతడు అంతలోనే, అదీ రాధ హత్య జరిగి సరిగ్గా ఐదు నిముషాలకే హడావుడిగా రూమ్ ఎందుకు ఖాళీ చేసినట్టు. ఆ గదిలో దొరికిన ఐదో నంబరు బూట్లు ఎవరివి? ఒకవేళ మధుసూదనే హంతకుడనుకుంటే భూపతి రైఫిల్ అతడికెలా దొరుకుతుంది?

ఇంతాచేసి తాను మధుసూదన్‌ను గురించి అనవసరంగా

బుర్ర పాడుచేసుకుంటున్నాడా? అతడు నిజమయిన టూరిస్టే నేమో!

జుత్తు పీక్కున్నాడు షరీఫ్. అన్నీ ప్రశ్నలే? సమాధానాలు మాత్రం లేవు!

షరీఫ్ ఆలోచనలకు అడ్డకట్టు వేస్తూ టెలిఫోన్ మ్రోగింది. రిసీవరులో మాటలు వింటూనే "మైగాడ్! సురేష్‌నా! యిప్పుడే బయల్దేరుతున్నాం" అన్నాడు.

షరీఫ్ తన బృందంతో భూపతి నివాసంలోపలికి వెళ్ళేసరికి సురేష్ గదిముందు మిగిలిన కుటుంబ సభ్యులు గుమిగూడి వుండడం కనిపించింది. మంచంమీద వెల్లకిలా పడుంది సురేష్ శవం గుండెల్లో దిగబడి వుందొక బాకు. బాకు దిగబడిన ప్రాంతంనుండి రక్తం ధారలా ప్రవహించి మంచాన్ని తడిపేసింది.

సురేష్ వంటిమీద లుంగీ మాత్రమే వుంది. కళ్ళు ఆశ్చర్యాన్ని సూచిస్తూ విప్పారివున్నాయి. హంతకుడితో సురేష్ పెనుగులాడిన లక్షణాలేం లేవు దీనినిబట్టి హంతకుడు సురేష్‌కు బాగా తెలిసినవాడనీ; అతడి నుండి సురేష్ ఏ ప్రమాదమూ వూహించి వుండడనీ అర్థం చేసుకున్నాడు షరీఫ్.

భూపతి కుటుంబసభ్యుల మొహాల్లో భయాందోళనలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. భూపతిని పిలిచి "రాత్రి యిది యెలా జరిగిందో మీరేమయినా చెప్పగలరా?" అని ప్రశ్నించాడు.

నిట్టూర్చాడు భూపతి. "అంతా అగమ్యగోచరంగా వుంది మొన్న రాధ, నిన్న సురేష్. రాత్రి యధాప్రకారం భోజనాలయ్యాక ఎవరి గదుల్లోకి వారు పోయారు. తెల్లారాక

పనిమనిషి వచ్చి గగ్గోలు పెట్టాక తెలిసింది. వెంటనే మీకు ఫోన్ చేసాను అంతే!" అన్నాడు.

ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్టుబూ ఫోటోగ్రాఫర్లూ తమ పనులను చకచకా చేసుకుపోతున్నారు. శవం దగ్గర హంత కుడికి సంబంధించి ఏ ఆధారమూ దొరకలేదు.

అంతా అయ్యాక సురేష్ శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపి రమేష్‌ని పిలిచాడు షరీఫ్.

"సారీ; నాకు ఏమీ తెలియదు. రాధ పోయాక నేనీ లోకాన్నే మరచిపోయాను" అని జవాబిచ్చాడు రమేష్ నిర్వికారంగా వేదాంతిలా. ఆ స్థితిలో అతణ్ణి ఏమడిగినా ప్రయోజనం లేదని పంపేసాడు షరీఫ్.

భూపతి మేనకోడలు సునీత వచ్చింది.

"అమ్మా సునీతా! మీ యింట్లో యిప్పటికి రెండు హత్యలు జరిగాయి. ముందు ముందు ఏమీ జరక్కూడ దనుకుంటే హంతకులు పట్టుబడాలి. అది జరగాలంటే మీ సహకారం కావాలి" అన్నాడు షరీఫ్ నెమ్మదిగా.

సునీత విషాదంగా నవ్వుతూ "అడగండి. నాకు తెలిసి నంతవరకూ చెబుతాను" అంది.

షరీఫ్ ఏదో ప్రశ్న అడగబోతూ వుండగా అతడి దృష్టి ఆమె కుడిచెవిమీద పడింది. ఆ చెవికివున్న దుద్దుల్లో ఎర్రని తెల్లని పొడులు ఒకదాని తర్వాత ఒకటి అందంగా అమర్చ బడి వున్నాయి. కానీ ఒకచోట వరుసగా మూడూ ఎర్ర పొడులే వుండి అసహజంగా వుండడంతో పరీక్షగా చూశాడు షరీఫ్.

సునీత తల వంచుకొని వుండడంవలన ఇన్‌స్పెక్టర్ దృష్టి తన చెవిమీదున్న సంగతి గ్రహించలేదు. అది ఎర్ర

పొడులు మూడూ వరసగా వుండడం కాదు. ఏ కంసాలీ అంతలా పొరబడి వస్తువు తయారుచేయడు.

సునీత పాదాలవంక చూసాడు షరీఫ్. అతడి పెదవుల మీద చిన్నగా నవ్వు కదలాడింది. తను మొదటి నుండీ "హంతకుడు" అనే పదంతోనే కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ కారణంగానే ఏ చిక్కుముడీ విప్పలేకపోయాడు. ఇప్పుడు ఆలోచిస్తే చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకు తున్నాయి.

తొమ్మిదో నెంబరు గదిలో ఐదో నెంబరు బూట్లు ఎలా వున్నాయి? మధుసూదన్ మూగవాడెందుకయ్యాడు? భూపతి రైఫల్ ఎలా బయటకు వెళ్ళి తిరిగి యధాస్థానానికి వచ్చింది? అన్నిటికీ సమాధానాలు దొరుకుతున్నాయి. మబ్బులు క్రమేపీ విడిపోతున్నాయి.

"సునీతా! ఒక్క క్షణం?" అంటూ షరీఫ్ గదిగుమ్మం వరకూ వెళ్ళి ఐరావతాన్ని కేకేసి నెమ్మదిగా ఏదో చెప్పి పంపాడు?

మొదట భూపతి తమ కుటుంబ సభ్యులందరూ షూటింగులో ఎక్స్పర్టులే అంటే తను దానిని మగవాళ్ళకే పరిమితం చేసుకుని తప్పటడుగు వేసాడు. అందుకే ఇప్పుడు నెమ్మదిగా:

"అమ్మా సునీతా! నీకు రైఫిల్ షూటింగ్ తెలుసా?" అని ప్రశ్నించాడు.

సునీత ఆ ప్రశ్నకు వులిక్కిపడుతూ ఇన్స్పెక్టర్ మొహంలోకి చూసింది. చెప్పక తప్పదన్నట్టు చిరునవ్వు నవ్వాడు షరీఫ్. సునీత మౌనంగా తలాడించి నేలచూపులు చూడసాగింది.

"సునీతా పరో ప్రశ్న. నీ చెవిదుద్దుకు వున్న రక్తపు చుక్క ఎలా వచ్చింది?" అన్నాడు.

సునీత కంగారుగా "రక్తమా? ఏదీ?" అంటూ చేతిని పైకెత్తబోగా షరీఫ్ ఆమెను వారిస్తూ "ఇక లాభంలేదు సునీతా! అంతా తెలివిగా పకడ్బందీగానే చేశావు. కానీ నీ దురదృష్టం రక్తపుచుక్క రూపంలో నీ చెవి ఆభరణాన్ని అంటిపెట్టుకుని వుండకపోతే, మా దృష్టి నిజానికి నీ మీద లేనేలేదు" అన్నాడు షరీఫ్.

సునీత కోపంగా "ఇంతకూ మీ రనేదేమిటి?" అంది.

అదే సమయానికి చేతిసంచితో గదిలో అడుగుపెట్టాడు ఐరావతం. షరీఫ్ సునీత ప్రశ్నకు సమాధానంగా సంచిలో నుండి బూట్లజత తీసి చూపించాడు.

సునీత మొహం వెలవెల బోయింది.

"ఇన్‌స్పెక్టర్‌గారూ? రాధను, సురేష్‌ను హత్య చేసింది నేనే. నేను నేరం ఒప్పుకుంటున్నాను" అంది నీరసంగా.

షరీఫ్ ఆమెను జాలిగా చూస్తూ "సునీతా! రాధను యెందుకు హత్యచేశావో తెలుస్తూనే వుంది. సురేష్‌ను యే కారణంగా హత్య చేయాల్సి వచ్చింది?" అన్నాడు.

ఆ మాటకు సునీత కళ్ళల్లో నీళ్ళు గిర్రునతిరిగి చెంపల మీదుగా జారాయి.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! నేను రమేష్‌ను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించాను. కానీ రాధ రమేష్‌ల పెళ్ళి జరగబోతోంది. రాధ లేకపోతే రమేష్ నా నుండి యెక్కడికీ పోలేడు. అందుకే రాధను అడ్డు తొలగించుకోవాలనుకున్నాను. రాధ ప్రతిరోజూ ఉదయంపూట అజంతా

హోటల్ స్విమ్మింగ్‌పూల్‌కి వెళుతుంది. ఆమెను హత్య చేసేందుకు అదే అనువయిన చోటు.

మగవేషం ధరించి మామయ్య రైఫిల్‌తోసహా అజంతా హోటల్‌లోని ఎనిమిదో అంతస్థులోని తొమ్మిదోనెంబరులో కాపుకాసాను. గొంతుమబట్టి నా గుట్టురట్టుకాకుండా మూగ వాడిలా నటించాను. ఛాతీ కనపడకుండా కమీజు వదులుగా టక్ చేశాను. మొహాన్ని దాచేందుకు పెద్దనల్ల కళ్ళద్దాలు వాడాను. హిప్పీ జుత్తు మొహంమీద పడేలా చేశాను. షాపులో కొత్త బూట్లు కొన్నాను. బూట్లు అలవాటు లేని కారణంగా పాదాలు నొక్కుకుపోయి బాధపెడుతూంటే, వాటిని విప్పి మంచంకింద పెట్టాను.

సరయిన సమయానికే రాధ స్విమ్మింగ్‌పూల్‌కి వచ్చింది. ఆమెను షూట్ చేసి, బూట్లు అక్కడే వదిలేసి వచ్చేసాను.

ఇన్ని జాగ్రత్తలతో వేషంమార్చినా అజంతా హోటల్లో సురేష్ నన్ను గుర్తించగలిగాడు. మామయ్యా సురేష్ సమయానికి యింట్లో లేనందుకు సంతోషించాను గానీ తీరా వాళ్ళు అదే హోటల్లో వుంటారని తెలుసుకోలేకపోయాను.

సురేష్ నిన్న సాయంత్రం నన్ను పిల్చి జరిగిన సంగతి పోలీసులకు చెబుతానని బెదిరించాడు. నేను నా బాధ చెప్పుకొని కాళ్ళావేళ్ళా పడ్డాను. నేను తనకు లొంగిపోయి తన కోరిక తీరుస్తానంటే నా రహస్యం కాపాడుతానన్నాడు సురేష్.

నాకు పరిస్థితి ఏమిటో అర్థమయ్యింది. సురేష్ బ్రతికి వుండగా నా బ్రతుకిక్క భద్రత లేదు. అప్పటికప్పుడు ఏం చెయ్యాలో నిర్ణయించుకొని రాత్రి సద్దుమణిగాక తన గదికి

వస్తానని సురేష్‌కి చెప్పి వచ్చేసాను.

రాత్రి గదిలోకి వెళ్ళగానే నన్ను వాటేసుకొని మంచం దగ్గరకు లాక్కుపోయాడు సురేష్. అందిన ప్రతి చోటా నన్ను ముద్దుల్లో ముంచెయ్యసాగాడు. అదే అదనుగా బొడ్లో దోపుకువచ్చిన బాకుతో అతణ్ణి ఒకే ఒక పోటు పొడిచాను.

సురేష్ కిక్కురుమనకుండా మంచంమీద వాలిపోయాడు. నేను నా గదికి వచ్చేసాను. రక్తం అంటిన నా శరీరాన్ని జాగ్రత్తగానే శుభ్రం చేసుకున్నాను. అయినా దురదృష్టం రక్తపుచుక్క రూపంలో నా చెవి దుద్దుమీద మిగిలిపోయింది" అంది దీర్ఘంగా నిట్టూరుస్తూ సునీత. □

మైకు ప్రియుడు!



నూతన సంవత్సరం

టెంపోరావ్



న్యూయియ్యర్ డ్రింక్ పార్టీ ఏదో అంతస్థులో ఆహ్లాదంగా సాగుతోంది.

ఒక టేబుల్‌మీద యెన్నో బాటిల్సు పెట్టబడి వున్నాయి. విస్కీ, బ్రాండీ, జిన్. రమ్. బీర్. ఎవరకి కావలసింది వాళ్ళు తాగొచ్చు!

టేబుల్ దగ్గర యూనిఫామ్‌లో వున్న యిద్దరు నౌఖర్లు నిలబడి వున్నారు. అతిథులు అడిగింది వాళ్ళు గ్లాసుల్లోపోసి

యిస్తున్నారు.

హాల్లోని ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. హాల్లో నూరుమంది పైన అతిధులు వున్నారు. అక్కడ గుమిగూడిన వాళ్ళందరూ ఆ పిడంతస్థుల భవనంలో నివశించేవాళ్ళే.

ప్రతి సంవత్సరం న్యూయియ్యర్ డ్రింక్‌పార్టీ ఏర్పాటు చేయడం తిలక్ అపార్ట్‌మెంట్స్ మేనేజర్ కేశవరావు డ్యూటీ. రెండు నెలలు ముందుగా అతడు ఫ్లాట్స్‌లో వుండే వాళ్ళనుంచి చందాలు వసూలుచేస్తాడు. కొన్నివేలు పోగవుతుంది. ఆ డబ్బంతా న్యూయియ్యర్ డే నాడు వాళ్లు ఖర్చుపెడ్తారు.

మోహన్ స్కాచ్ విస్కీ సేవిస్తున్నాడు. అతడి పక్కనే రేవతి కూర్చొని వుంది. మరోవైపున వెంకట్ కూర్చొని బ్రాందీ తాగుతున్నాడు.

మోహన్, వెంకట్ ఒకే ఫ్లాట్‌లో పక్కపక్క గదుల్లో వుంటున్నారు.

మోహన్ వెంకట్‌వైపు నవ్వుతూ చూశాడు.

"నీ ఫ్రెండ్ మీనా యింకా రాలేదే!" అన్నాడు మోహన్.

వెంకట్ టైమ్‌చూశాడు పది కావస్తోంది. మరో రెండు గంటల్లో కొత్త సంవత్సరం అవతరిస్తుంది.

తను తాగే గ్లాసును మొజయిక్ ఫ్లోర్‌మీద బెట్టి వెంకట్ కుర్చీలోంచి లేచాడు. "ఆమెకు ఫోన్‌చేసి వస్తాను" అని వెళ్ళిపోయాడు.

"విష్‌యు గుడ్‌లక్!" అన్నాడు మోహన్.

మోహన్ తన దగ్గరగా కూర్చొన్న రేవతి కళ్ళలోకి చూశాడు. కొంచెం విస్కీ సేవించి ఆమె వంక మళ్ళా

చూశాడు.

"కొత్తసంవత్సరపు కాంతులు నీ కళ్ళలో మెరుస్తున్నాయి!" అన్నాడతను.

"ఆ సంవత్సరంలోనేగా మనం పెళ్ళి చేసుకొనేది!" అంది రేవతి తీయగా నవ్వుతూ.

అతడామె నడుంచుట్టూ చెయ్యిని పోనిచ్చాడు.. ఆమెను ముద్దాడబోయాడు.

"ఎవరో వస్తున్నారు?" అందామె.

"స్వర్గంలో దోమలా!" అన్నాడతను.

ఒకతను వాళ్ళవైపు చూసి నవ్వాడు.

"హవ్ యీస్ లైఫ్?" అన్నాడతను.

"గ్లోరియస్ అండ్ లవ్లీ" అన్నాడు మోహన్. అతడు నవ్వుతూ వెళ్ళిపోయాడు.

"మైడియర్, నువ్వు ఏం తాగుతావు?"

"వద్దని చెప్పానుగా" అందామె.

"అయితే తిను" అని అతను లేవబోయాడు.

"నేనే వెళ్ళి తెచ్చుకొంటాను" అని లేచిందామె.

కాస్సేపట్లో ఒక ప్లేటుతో తిరిగి వచ్చింది.

చికెన్ బిర్యానీ, శాండ్విచస్, కట్లెట్లు, చిప్స్ వగైరా వున్నాయి ప్లేట్లో.

ఆమె వుత్సాహంగా తింటోంది. అతడామెవైపు చూస్తూ గ్లాసులోని విస్కీని తాగేశాడు.

"ఈ డ్రింక్పార్టీ ఎంతవరకూ సాగుతుంది?"

"తెల్లారిందాకా."

"కొంతమంది తప్ప తాగి యీ హాల్లోనే పడిపోతారేమో?"

"సంవత్సరానికి ఒకసారేగా! పడినా యెవ్వరూ యేమీ

అనరు."

"నువ్వు ఎప్పుడేనా పడ్డావా?" అడిగిందామె.

"కింద పడేవరకూ నేను తాగను."

"నీ ఫ్లాట్ మేట్?"

"వెంకట్ బాగా తాగుతాడు కాని కిందపడడు!" అన్నాడతను.

వెంకట్ వాళ్ళముందుకు వచ్చాడు.

నేలమీదున్న తన గ్లాసును అందుకొని వెంకట్ గడగడ తాగేశాడు.

"ఏమైంది మీనా?" అడిగాడు మోహన్.

"ఆమె రాడంలేదు. తలనొప్పిగా వుందట."

"శారిడాన్ మింగితే తలనొప్పి యెగిరిపోతుంది."

"ఏం చెప్పినా వినదు. నన్నే వాళ్ళింటికి రమ్మంటోంది. నిజంగా ప్రేమించేవాడివి ఆడది అలాగే చూస్తుంది!" అన్నాడు వెంకట్.

కుర్చీలోంచి వెంకట్ లేచాడు.

"గ్లాసు నింపుకోవాలి!" అని వెళ్ళిపోయాడు.

రేవతి తినడం పూర్తయింది. మోహన్ చేతిలోని గ్లాసు ఖాళీ అయింది.

హాల్లో పురుషులు, స్త్రీలు హుషారుగా తిరుగుతున్నారు. అందరి చేతుల్లోనూ గ్లాసులున్నాయి. మొగాళ్ళు బ్రాందీ సేవిస్తే స్త్రీలు సాఫ్ట్ డ్రింక్స్ తాగుతున్నారు.

"నా గదికి వెళ్దాం పద" అన్నాడు మోహన్.

ఆమె తీయగా నవ్వింది.

ఇద్దరూ బయటకు నడిచారు. ఆరో ఫ్లోర్‌లో వున్న అతడి గదికి వెళ్ళారు.

2

అతడు లాక్ తెర్చి తలుపు తీశాడు. వాళ్ళు లోపలకు నడిచారు. తలుపును మూశాడతను. లోపల లైట్ వెల్గుతోంది.

మోహన్ ఆమెను అమాంతంగా కౌగలించుకున్నాడు. ఎర్రటి ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు. ఆమె చేతులు అతడి వెనక పెనవేసుకున్నాయి.

చాలా వుషారుగా వుంది. రేవతి దేవతలా అతడి కళ్ళకు కనిపిస్తోంది.

ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. చిరునవ్వు ఆమెకో కొత్త అందాన్ని యిస్తోంది.

"మైడియర్, వుయ్ విల్ గో టుది మూన్?" అన్నాడతను.

"నీ మనస్సు ఎప్పుడూ చంద్రమండల ప్రయాణంమీదే వుంటుంది" అందామె కొంటెగా.

"నీ మైండ్ దేనిమీదుంటుంది?" అడిగాడతను.

"నీ కెదురుగా వుంటే చాలు నాకు ఆనందంగా వుంటుంది" అందామె, బాల్కనీలోకి నడుస్తూ.

వెనకనే వెళ్ళాడతను. ఆమె పక్కనే నిలబడి కిందకు చూశాడు. తలను పైకి తిప్పాడు. ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అమాంతంగా ఆమెను చేతుల్తో ఎత్తాడు. గిర్రున తిప్పుతూ గదిలోకి తీసుకెళ్ళి పరుపుమీద పడేసి పక్కనే కూర్చొన్నాడు.

"యు ఆర్ లవ్లీ టుడే!" అన్నాడతను.

"మొన్న యిక్కడి కొచ్చినపుడు లవ్లీగా లేనా?" అందామె.

"రోజురోజుకీ నీ అందం పెరిగిపోతోంది" అన్నా

డతను.

"నీ కళ్ళు అలా చూస్తున్నాయి!" అందామె.

అతడు టైమ్ చూశాడు. పదకొండయింది. మరో గంటలో, సరిగ్గా పన్నెండింటికి, జీరో అవర్‌కి కొత్త సంవత్సరం అవతరిస్తుంది!

కొన్ని నిమిషాలపాటు యిద్దరూ మేఘాలమీద కదుల్తూ, సముద్రపు అలలమీద తేల్తూ సురలోకంలో విహరించారు. వెనక్కి తిరిగొచ్చారు.

అతడు టైమ్ చూశాడు. 11-15 అయింది. న్యూ యియ్యర్ దగ్గరవుతోంది.

"డ్రెస్సప్, పైకి వెళ్దాం" అన్నాడతను.

"నాకు నిద్రొస్తోంది. ఇలాగే పడుకోవాలనిపిస్తోంది" అందామె.

ఆమె ఆవులిస్తోంది.

"ప్రతిరోజూ నేను పదిలోపల పడుకుంటాను. అలవాటైపోయింది."

"అయితే పడుకో!" అని అతడామె నగ్నశరీరంవైపు నవ్వుతూ చూశాడు.

ఆమెపైన దుప్పటి కప్పాడు.

"తలుపు లాక్ చేసి వెళ్తాను. తొందరగా వచ్చేస్తాను. నీకు దూరంగా వుండలేను" అని, అతడు బయటకు నడిచాడు.

తలుపు మూశాడు. ఎర్‌లాక్ క్లిక్‌మంది. లైట్లు ప్రకాశిస్తూన్న హాల్లోకి నడిచాడతను. టేబుల్ ముందుకు వెళ్ళి మరోగ్లాసు తీసుకొని విస్కీ పొయ్యమన్నాడు. విస్కీ తాగుతూ కిటికీ దగ్గరగా వున్న కుర్చీలో కూర్చొన్నాడు.

హాల్లో నూరుమంది పైనవున్నారు. అందరూ నవ్వుతూ ఆహ్లాదంగా తాగుతూ, కబుర్లు చెప్పుకొంటున్నారు. వెంకట్ గ్లాసుతో అతడి దగ్గర కొచ్చాడు.

"బ్రదర్, ఎక్కడికి పోయావు?" అడిగాడతను.

"ఆమె యింటికి పోతానంది. వెళ్ళి దింపివచ్చాను" అన్నాడు మోహన్.

"ఆమె అలా ఎప్పుడూ అనదు! షి లవ్స్ యు!" అన్నాడు వెంకట్.

"ఆమె నా గదిలో నిద్రపోతోంది. యూ ఆర్ రైట్" అన్నాడు మోహన్.

వెంకట్ టైమ్ చూశాడు. 11-30 అయింది. "మోహన్, నీ స్కూటర్ కీ యియ్యి. మీనాకి మళ్ళా ఫోను చేశాను. నేను వస్తే నాతో వస్తానంది. ఇరవై నిమిషాల్లో ఆమెతో తిరిగి వస్తాను" అన్నాడు వెంకట్.

తన జేబులోని కీ తీసి అతడు వెంకట్ కి యిచ్చాడు.

"విష్ యు గుడ్ లక్! మీనాని నా కీసారి తప్పక పరిచయం చెయ్యి" అన్నాడు మోహన్.

గ్లాసులోని బ్రాందీని వెంకట్ గడగడ తాగేశాడు. బై బై చెప్పి అతడు హాల్లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

విస్కీ తాగుతూ కూర్చున్నాడు మోహన్.

3

నిమిషాలు దొర్లిపోతున్నాయి. రెండు రౌండ్లు విస్కీ తాగేసి మళ్ళా గ్లాసులో మోహన్ విస్కీ పోయించుకున్నాడు.

ఇరవై నిమిషాలు దాటింది. అయినా తన ఫ్రెండ్ వెంకట్ రాలేదు. ఎక్కడేనా యాక్సిడెంట్ అయిందా? వెంకట్ యెంత తాగినా స్కూటర్ని నడపగలడు! ఎలర్ట్

డ్రంకర్డ్! మోహన్ తనలో తను నవ్వుకున్నాడు.

జీరో అవర్ వచ్చేసింది!

హాల్లో గందరగోళంగా వుంది. గంటలు చెవులు పగిలేటట్లు మ్రోగుతున్నాయి. హేపీ న్యూయియ్యర్, లక్కీ న్యూయియ్యర్ అని అందరూ నిలబడి అరుస్తున్నారు. హాల్లో ఒకే అరుపులు!

అయిదు నిముషాల తర్వాత కేకలు తగ్గాయి. అందరూ న్యూయియ్యర్ పెగ్స్ తాగుతున్నారు.

దూరంలో వున్న ఒకతని వైపు మోహన్ చూశాడు. అతడి దగ్గరకు గబగబా వెళ్ళాడు. ఒక కుర్చీలో కూర్చుని వెంకట్ గ్లాసులోని బ్రాందీని తాగుతున్నాడు.

"ఎంతసేపయింది వచ్చి?"

"పది నిమిషాలు దాటింది" అన్నాడు వెంకట్.

"మీనా ఏది?"

"నన్ను చూడాలని ఆమె అలా అందిట. ఆమె తలనొప్పితో బాధపడ్తోంది. ఆమెకు హేపీ న్యూయియ్యర్ చెప్పేసి వచ్చేశాను."

అక్కడే కూర్చొని మోహన్ గ్లాసును ఖాళీ చేశాడు.

"ఇద్దరం మరో పెగ్ వేద్దాం" అన్నాడు వెంకట్.

"పోదాం పద. చాలా తాగాను" అన్నాడు మోహన్.

అతడివైపు వెంకట్ నవ్వుతూ చూశాడు.

"నీకోసం ఆమె గదిలో వేచివున్న సంగతి మర్చిపోయాను. గివ్ హర్ మై బెస్ట్ విషెస్!"

గ్లాసును అక్కడ వదిలేసి మోహన్ బయటకు వెళ్ళాడు. మెట్లమ్మట కిందకు దిగాడు. కీ తీసి తలుపు తెర్చాడు. లోపలకు నడిచి తలుపును లాక్ చేశాడు.

"మైడియర్, ఐయామ్ బాక్ టు యు!" అంటూ పరుపు

దగ్గరకు వెళ్ళాడు.

పులిక్కిపడ్డాడు.

పరుపుమీద రేవతి లేదు!

ఆమె ఏమైంది? బాత్‌రూమ్‌కి వెళ్ళిందేమో! అతడు బాత్‌రూమ్‌లోకి పరుగెత్తాడు. అక్కడ లేదు! గది నలువైపులా చూశాడు. ఎక్కడా ఆమె రూపం కనిపించలేదు.

మంచంకింద దాక్కుందేమో! అతడు కిందకు వంగి చూశాడు; అక్కడా లేదు రేవతి! బాల్కనీలోకి వెళ్ళి చూశాడు.

రేవతి ఏమైంది? ఆమె దుస్తులకోసం చూశాడతను—అవికూడా ఎక్కడా లేవు.

ఆమె యింటికి వెళ్ళిపోయిందా? తనకు చెప్పకుండా ఆమె వెళ్ళదు.

అతడు టెలిఫోన్ దగ్గరకు నడిచి, రిసీవర్ ఎత్తి ఆమె నంబరు తిప్పాడు.

"హలో" అంది రేవతి తల్లి.

"నేనండి మోహన్ని! రేవతి అక్కడకు వచ్చిందా?"

"నీతోనే వుంటానని చెప్పి వెళ్ళింది. రాలేదా, నీతో లేదా?"

"ఇక్కడే ఎక్కడో వుంటుంది .. "

"అమ్మాయి వుందని ఫోన్ చేసి చెప్పు. లేకపోతే నాకు నిద్రపట్టదు" అందామె.

"మీరు గాభరా పడకండి!" అని అతడు రిసీవర్ని పెట్టేశాడు.

మోహన్ పైనున్న హాల్లోకి పరుగెత్తాడు. అక్కడింకా యెనభై మంది పైన వున్నారు. వెంకట్ దగ్గరకు వెళ్లాడు మోహన్.

కూర్చీ పక్కనే నేలమీద పడివున్నాడు వెంకట్. అతడి ప్రక్కనే గ్లాసువుంది.

"వెంకట్!" అని తట్టి లేపాడు మోహన్.

వెంకట్ కళ్ళు తెరచాడు.

"వెంకట్, నా గదిలో రేవతి లేదు! ఏమైందో!" అన్నాడు మోహన్.

"ఎక్కడో వుంటుంది! నిన్ను ఏడ్పించడానికి ఎక్కడో దాక్కొని వుంటుంది" అని వెంకట్ కళ్ళుమూశాడు.

మోహన్ విచారవదనంతో లేచి నిలబడ్డాడు. హాల్లో నడుస్తున్నాడు. ఎవరో అతడి భుజంమీద చెయ్యివేశారు.

పక్కకి తిరిగి చూశాడతను. తిలక్ అపార్టుమెంట్స్ మేనేజర్ కేశవరావు!

"మీకోసమే చూస్తున్నాను" అన్నాడతను.

"దేనికోసం?"

"చిన్న యాక్సిడెంట్ అయింది."

"ఎవరికి?"

"మీ గర్ల్‌ఫ్రెండ్ రేవతికి."

"ఆమె ఎక్కడుంది?"

"నాతో రండి."

ఇద్దరూ లిఫ్ట్‌లో కిందకు దిగారు. కేశవరావు పక్కనే మోహన్ తోటలోకి నడిచాడు. ఒక చెట్టుకింద, రాళ్ళమీద ఆమె పడివుంది టార్చి కాంతిలో ఆమెవైపు చూసి, చూడ లేక కళ్ళు మూసుకున్నాడు మోహన్.

నగ్నంగా రేవతి కింద పడుంది, రక్తం మడుగులో. ఆమె తల పగిలింది. చెయ్యి కాలు విరిగివున్నాయి.

ఏడుస్తూ ఆమెమీద పడిపోయాడు మోహన్.

"మోహన్, ఆమె మీతో తాగిందా?" అడిగాడు కేశవ రావు.

"ఆమె తాగలేదు. ఎప్పుడూ తాగదు."

"బాల్కనీ నుంచి ఆమె కింద పడుండాలి? కాలు జారిం దేమో!" అన్నాడు కేశవరావు.

మోహన్ ఏడుస్తున్నాడు.

"మోహన్, పోలీసు రిపోర్టివ్వాలి" అన్నాడు కేశవ రావు.

4

పోలీసు జీప్ కాంపౌండులో ఆగింది. ఇన్‌స్పెక్టర్ నాయర్, నలుగురు కానిస్టేబుళ్ళు కిందకు దిగారు.

మోహన్, కేశవరావు యిన్‌స్పెక్టర్‌కి యెదురుగా వెళ్ళారు.

"శవం ఎక్కడుంది?" అడిగాడు యిన్‌స్పెక్టర్.

అందరూ తోటలోకి నడిచారు. టార్చి కాంతిలో యిన్‌స్పెక్టర్ నాయర్ శవంవైపు చూశాడు.

"మిస్టర్ మోహన్, ఏమైందో చెప్పండి!" అడిగాడు.

మోహన్ కన్నీళ్ళతో అంతా చెప్పాడు.

"ఈ సంవత్సరం మార్చినెలలో మా పెళ్ళి అయి వుండేది. ఆమె నన్ను వదిలి వెళ్ళిపోయింది" అన్నాడు మోహన్.

పెట్రోమాక్స్ లైట్‌ను పోలీసులు వెలిగించారు.

"నలువైపులా వెతకండి" అన్నాడు యిన్‌స్పెక్టర్.

ఆమె ధరించిన చీర, పావడా, జాకెట్, బ్రాశియర్ సమీపంలో దొరికాయి. ఇన్‌స్పెక్టర్ వాటివైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఆమె నగ్నంగా కింద పడింది. ఈ దుస్తులన్నీ ఇక్కడకు యెలా వచ్చాయి?" అడిగాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

"నాకు తెలియదు" అన్నాడు మోహన్.

ఇన్‌స్పెక్టర్ నాయర్ ఆలోచిస్తూ తోటలో పచార్లు చేశాడు.

"మీ గది యెక్కడుంది?"

"ఆరో అంతస్తులో" అన్నాడు మోహన్.

"పదండి, అక్కడకి వెళ్దాం" అన్నాడతను.

ఇద్దరు కాన్‌స్టేబుళ్ళు కింద కాపలా వున్నారు. లిఫ్ట్‌లో యిన్‌స్పెక్టర్ నాయర్, మోహన్, కేశవరావు, యిద్దరు కాన్‌స్టేబుళ్ళు పైకి వెళ్ళారు.

మోహన్ గదిముందుకు వాళ్ళు నడిచారు. అతడు తాళం తీసి తలుపు తెర్చాడు. అందరూ లోపలకు వెళ్ళారు. ఇన్‌స్పెక్టర్ గది నలువైపులా చూశాడు. ఒక గుమ్మంముందు యిన్‌స్పెక్టర్ ఆగాడు.

"ఈ గదిలో యెవరుంటారు?"

"నా ఫ్రెండ్ వెంకట్" అన్నాడు మోహన్.

ఇన్‌స్పెక్టర్ నాయర్ బాల్కనీలోకి వెళ్ళాడు. కిందకు చూశాడు. పెట్రోమాక్స్ లైట్ కాంతిలో శవం కనిపిస్తోంది.

బాల్కనీలో లైటు వెలుగుతోంది. ఇన్‌స్పెక్టర్ నాయర్ కిందకు వంగి ఒక తాళంచెవిని తీశాడు. దానివైపు చిత్రంగా చూశాడు.

స్కూటర్ తాళం చెవి!

"ఇది నా స్కూటర్‌ది" అన్నాడు మోహన్.

"ఇది యిక్కడ యెలా పడివుంది?" అడిగాడు యిన్‌స్పెక్టర్.

"నా స్కూటర్ తాళంచెవిని నేను వెంకట్‌కి ఇచ్చాను. అతడు తన గర్ల్‌ఫ్రెండ్ మీనాను తీసుకువస్తా నన్నాడు" అన్నాడు మోహన్.

"మీనాను అతడు తీసుకువచ్చాడా?"

"లేదు" అన్నాడు మోహన్.

"ఆమె ఎందుకు రాలేదు?"

"ఆమెకు తలనొప్పిట. అతడామెను అందువలన తీసుకు రాలేకపోయాడు" అన్నాడు మోహన్.

"వెంకట్ యెక్కడున్నాడు?"

"పైన పార్టీ యింకా సాగుతోంది. అతడు పై హాల్లో వుంటాడు" అన్నాడు మోహన్.

"పైకి వెళ్దాం, పదండి" అన్నాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

మెట్లెక్కి అందరూ పైకివెళ్ళారు. హాల్లో ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

ఇన్‌స్పెక్టర్ నాయర్ హాల్లోకి వెళ్ళాడు. అందరూ అతడివైపు భయంతో చూశారు. సగంమంది బయటకు వెళ్ళిపోవడానికి ప్రయత్నించారు.

"ఎవ్వరూ కదలకండి" అరిచాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

అందరూ భయంతో నుంచుండిపోయారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ ఒక కుర్చీ వైపు నడిచాడు. కుర్చీ ప్రక్కనే వెంకట్ నేలమీద పడుకొని వున్నాడు. అతడిని యిన్‌స్పెక్టర్ గట్టిగా తట్టి లేపాడు.

అతడు లేవలేదు. అతడి ముఖంమీద చన్నీళ్ళు జల్లాడు యిన్‌స్పెక్టర్ నాయర్. వెంకట్ కళ్ళు తెర్చాడు. తృళ్ళి పడ్తూ అతడు లేచి కూర్చున్నాడు.

"మిస్టర్ వెంకట్, మోహన్ తన స్కూటర్ తాళం చెవిని మీకు యిచ్చాడు. ఆ స్కూటర్‌మీద మీరు ఎక్కడికి కెళ్ళారు" అడిగాడు యిన్‌స్పెక్టర్.

"నా ఫ్రెండ్ మీనా యింటికి" అన్నాడతను.

"ఆమె యింటి అడ్రెసు చెప్పండి" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"కరెక్టు అడ్రెసు నాకు తెలియదు" అన్నాడతను.

"ఇల్లు తెలుసా?"

"తెలుసు" అన్నాడు.

"పదండి అక్కడకు వెళ్దాం" అన్నాడు యిన్‌స్పెక్టర్.

వెంకట్ టైము చూశాడు. ఒంటిగంటన్నర అయింది.

"ఈ టైమ్‌లో ఆమెను లేపడం సభ్యతగా వుండదు" అన్నాడు వెంకట్.

"మిస్టర్ వెంకట్, ఇది హత్యకేసు. ఆమెతో అత్యవసరంగా మాట్లాడాలి" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"నేను రాలేను" అన్నాడు వెంకట్.

"రాక తప్పదు" అన్నాడు యిన్‌స్పెక్టర్ నాయర్ గంభీరంగా.

ఇన్‌స్పెక్టర్ నాయర్ ఒక కానిస్టేబుల్‌వైపు చూశాడు.

"ఈయన్ని తీసుకెళ్ళి జీప్‌లో కూర్చోబెట్టండి" అర్చాడు యిన్‌స్పెక్టర్.

వెంకట్ గాభరాగా యిన్‌స్పెక్టర్‌వంక చూశాడు.

"ఇన్‌స్పెక్టర్, నాకు మీనా అనే గర్ల్‌ఫ్రెండు లేదు"

అన్నాడు వెంకట్.

"అటువంటి ఫ్రెండ్ వున్నదని యెందుకు అబద్ధం ఆడావు?"

"నన్ను క్షమించండి. నా ఫ్లాట్‌మేట్ మోహన్‌కి చక్కటి గర్ల్‌ఫ్రెండ్ రేవతి వుంది. అతడిముందు నా కెవ్వరూ లేరని చెప్పడం యిష్టంలేక అలా అబద్ధం చెప్పాను."

"మీరా స్కూటర్ కీ తీసుకుని ఎక్కడకెళ్ళారు? నిజం చెప్పండి."

"నా గదికి వెళ్ళి పడుకున్నాను. ఇరవై నిమిషాల తర్వాత యిక్కడికొచ్చి కూర్చున్నాను."

"యూ బాస్టర్డ్! నా రేవతిని నువ్వే చంపివుంటావు!" అరిచాడు మోహన్.

పోలీస్ డాక్టర్ సుధాకర్ అప్పుడే పైకి వచ్చాడు.

"ఇన్‌స్పెక్టర్, పైనుంచి క్రింద పడ్డంవలన ఆమె వెంటనే మరణించింది. పన్నెండు ప్రాంతంలో ఆమె మరణించి వుండాలి" అన్నాడు పోలీసు డాక్టర్ సుధాకర్.

"పన్నెండింటికి మీ రెక్కడున్నారు?" ఇన్‌స్పెక్టర్ నాయర్ అడిగాడు వెంకట్‌వైపు చూస్తూ.

"నేనిక్కడే వున్నాను" అన్నాడు వెంకట్.

"యూ లయ్యర్! నువ్వు యిక్కడ లేవు. పన్నెండు తర్వాత నిన్ను నేను చూశాను" అన్నాడు మోహన్.

"పన్నెండు తర్వాత మెట్లెక్కి వెంకట్ యిక్కడకు వస్తూంటే నేను చూశాను" అన్నాడు తిలక్ అపార్ట్‌మెంట్స్ మేనేజర్ కేశవరావు.

వెంకట్, చురచుర చూశాడు కేశవరావు వైపు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ వెంకట్ వైపు కోపంగా చూశాడు.

"మిస్టర్ వెంకట్. స్కూటర్ కీని మీరు తీసుకున్నారు. కాని బయటకు వెళ్ళలేదు. మీ గదికి వెళ్ళారు. మోహన్ గదిగుండా మీరు వెళ్ళాలి! ఆ సమయంలో పరుపుమీద పడుకున్న రేవతిని మీరు చూశారు. ఆమె దగ్గరకు కామంతో వెళ్ళారు. ఆమె లేచింది. మీవైపు ఆగ్రహంతో చూసింది. మీరు బాగా తాగి నిషాలో వున్నారు. ఆమెను బలాత్కరించడానికి ప్రయత్నించారు. ఆమె లొంగలేదు. మీతో పోట్లాడింది. బాల్కనీలోకి పరుగెత్తింది. అక్కడకు మీరు వెళ్ళారు. ఆమెను చేతుల్లో ఎత్తారు. అదే సమయంలో పైన గంటలు మ్రోగుతున్నాయి. న్యూయియ్యర్ అవతరించిందని అందరూ పైన అరుస్తున్నారు. మీకామె లొంగలేదన్న కసితో ఆమెను మీరు కిందకు విసిరేశారు!" అన్నాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

"అది నిజంకాదు. నేను ఆమెను విసరలేదు" అన్నాడు వెంకట్.

"బతికుంటే ఆమె మీ గురించి మోహన్‌కి చెప్తుంది. ఆమె చావాలి! ఆమెను మీరే కిందకు విసిరి చంపవుండాలి" అర్చాడు యిన్‌స్పెక్టర్.

వెంకట్ నోటమ్మట మాట పెగల్లేదు. అతడు మోహన్ వంక చూశాడు. అతడి చెయ్యి పట్టుకున్నాడు.

"మైడియర్ ఫ్రెండ్. క్షమించగల్గితే నన్ను క్షమించు! నేను నీకు ద్రోహం చేశాను. బాగా తాగిన నిషాలో నేను ఆమెమీద పడ్డాను. ఆమె నాతో పోట్లాడింది. నన్ను తప్పించుకుని బాల్కనీలోకి పరుగెత్తింది, నగ్నంగా. ఆమె

నగ్న శరీరం చూస్తే నాకు పిచ్చెక్కింది. బాల్కనీలో ఆమె నన్ను తప్పించుకోలేక పోయింది. ఆమెను పట్టుకుని పైకి ఎత్తాను. నిషాలో నా చేతుల్లోంచి ఆమె జారి పోయింది. కిందకు దూసుకుపోయింది. ఆమె అరుపు మీరు వినలేకపోయారు. గంటల ధ్వనిలో!" అన్నాడు వెంకట్.

ఇన్‌స్పెక్టర్ నాయర్ అతడి చేతులకు బేడీలు వేశాడు. వెంకట్ కన్నీళ్ళతో మోహన్‌వైపు చూశాడు.

"తప్ప తాగిన నిషాలో నేనలా చేశాను. నా కామం నన్ను గుడ్డివాడిని చేసింది. నీకింత ద్రోహం చేసినందుకు నేను చాలా బాధపడుతున్నాను. ఇంకా బతికుండాలనే కోరిక నాకు లేదు. నన్ను ఉరితీసి చంపేస్తే సంతోషిస్తాను" అన్నాడు వెంకట్ వెక్కి వెక్కి ఏడుస్తూ. □

ట్రాన్స్‌ఫర్



పన్నీరు సుందరి

ఓరుగంటి పద్మావతి.



రిక్షా దిగి పెళ్ళిపందిట్లోకి బెదిరే గుండెలతో నడిచింది శైలజ. రిక్షా అతను పక్కకి తీసి రిక్షా ఆపుకొని కూచొన్నాడు.

ఆ పెళ్ళి సందడిలో, ఆ జన సముద్రంలో శైలజని పట్టించుకొనేవారే లేరు. అదీ మంచికే అనుకొని నెమ్మదిగా అటూ ఇటూ చూస్తూ కళ్యాణ మంటపం దగ్గరికి వచ్చింది

శైలజ. కళ్యాణమంటపం చాలా బాగా అలంకరించారు. పెళ్ళికి వచ్చిన జనం చాలామంది అక్కడే వున్నారు.

అక్కడనుంచి శైలజ లోపలికి నడిచింది. ఒకపక్కగా భోజనాల కార్యక్రమం సాగుతోంది. వంటకని వేసిన పందిళ్లోంచి నోరూరించే వాసనలు పెళ్ళివందిరంతా పరుచుకొన్నాయి. శైలజ తిన్నగా నడిచి పెళ్ళికూతురి గదిదగ్గర ఆగింది. లోపల ఇద్దరు స్త్రీలు కూర్చొని పువ్వులతో మాల కట్టుకొంటున్నారు. పెళ్ళికూతురు స్వప్న అద్దం ముందు కూర్చొని తన అందం చూసుకొని మురిసిపోతోంది.

"అమ్మా!" అన్న పిలుపు వినపడి ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది శైలజ. ఎదురుగా సీతాపతి కనిపించాడు.

"అమ్మాయి ముస్తాబు త్వరగా తెముల్చుకోమను. అవతల ముహూర్తానికి టైము అవుతోంది నేను ఒకసారి భోజనాల ఏర్పాట్లు చూసివస్తాను" అని శైలజకి చెప్పేసి హడావుడిగా వెళ్ళిపోయాడు సీతాపతి. అప్పటికి గాని శైలజలో వున్న వణుకు తగ్గలేదు.

"నన్ను తన బంధువు అనుకొంటున్నాడో, లేక పెళ్ళికూతురు స్నేహితురాలు అనుకొంటున్నాడో పాపం" అనుకొని సీతాపతిని తలుచుకొని జాలిపడింది శైలజ. నెమ్మదిగా ఆ గదిలోకి నడిచింది.

మాల కట్టుకుంటున్న యిద్దరూ శైలజకేసి చూసారు. పెళ్ళికూతురు స్వప్న మాత్రం అద్దం ముందు నుంచి కదలలేదు.

"మిమ్మల్ని సీతాపతి బాబయ్య అర్జంటుగా వంట గదిలోకి వెళ్ళమన్నారు. వడ్డించేవాళ్ళు తక్కువయ్యారట. పిలుస్తున్నాడు" అంది శైలజ లేని గంభీరం తెచ్చిపెట్టుకొని.

"ఎప్పుడూ యింతే. ఇందాక పెళ్ళికూతురి దగ్గర కూర్చోండి, ఎక్కడికీ కదలకండి, అన్న పెద్దమనిషి అప్పుడే మరొక పని పురమాయించాడు. నడవ్వే సుభద్రా పోదాం" అని సుభద్ర అనే స్త్రీని తీసుకొని విసురుగా ఆ గదిలోనుంచి నిష్క్రమించింది భవాని.

"అమ్మయ్య! ఒక దరిద్రం వదిలింది. ఇప్పుడు అసలు కార్యక్రమం అమలు జరపాలి" అని మనస్సులో నిశ్చయించుకొని, ఆ గదికి వున్న తలుపులు లోపలనుంచి గడియపెట్టి, తృప్తిగా నిట్టూర్చింది శైలజ. నెమ్మదిగా స్వప్న దగ్గరికి నడిచింది.

అద్దంలో కనిపించిన శైలజ ప్రతిరూపాన్ని చూసి, స్వప్న "ఎవరా?" అన్నట్టు వెనక్కి తిరిగిచూపింది.

ఊహించనంత వేగంతో అక్కడ వున్న పన్నీరు బుడ్డి తీసి స్వప్న తలమీద బలంగా ఒక్కటి వేసింది శైలజ.

చిన్నగా ఒక మూలుగు మూలిగి తల పక్కకు వాల్చేసింది స్వప్న. శైలజ నెమ్మదిగా పన్నీరుబుడ్డిని టేబుల్ మీదపెట్టి, తన చీరకొంగుతో వేలిముద్రలు లేకుండా ఆ పన్నీరుబుడ్డిని తుడిచివేసింది.

స్వప్న ఒంటిమీద వున్న నగలన్నీ తన ఒంటిమీదకి మార్చుకొంది చిన్న ముక్కుపుడక దగ్గర నుంచి, పెద్ద వడ్డాణంవరకు స్వప్న ఒంటిమీద వున్న బంగారం అంతా శైలజ సింగారించుకొంది.

ఇంతలో ఆ గది తలుపులు చప్పుడయింది.

శైలజ కంగారుపడకుండా యింకా ఏమైనా దొరుకుతాయేమో అని చుట్టూ చూసింది. టేబిల్‌మీద స్వప్న రిస్టువాచి వుంది. అది కూడా తీసుకొని తన చేతికి పెట్టు

కొంది.

ఇంతలో ఆ గది తలుపు మళ్ళీ చప్పుడయింది.

"ఆ వస్తున్నా" అని ఒక అరుపు అరిచి, నెమ్మదిగా తలుపుదగ్గరికి వచ్చి, తలుపు పిడీమీద వేలిముద్రలు లేకుండా తుడిచి, చీర కొంగుతోనే తలుపు గడియ తీసింది శైలజ.

"అవతల ముహూర్తానికి వేళ మించిపోతుంటే తలుపులు వేసుకొని గదిలో ఏమిచేస్తున్నారే" అని శైలజని తన కూతురి స్నేహితురాలే అనుకొని లోపలికి వచ్చింది స్వప్న తల్లి సత్యవతి

ఇదే అదననుకొని చీరకొంగు నిండుగా కప్పుకొని, నెమ్మదిగా ఆ గదిలోనుంచి బయటపడింది శైలజ.

అటూ, యిటూ చూసుకుంటూ కళ్యాణమంటపం దగ్గరకి వచ్చింది శైలజ. అప్పటికే పెళ్ళికొడుకుతో ఏదో తతంగం జరిపిస్తున్నారు పురోహితులవారు.

శైలజని దాటుకొని గదిలోకి వెళ్ళిన సత్యవతి. స్వప్నని చూపి నిద్రపోతోందేమో అనుకొంది మొదట. కాని తల మీద గాయం, శరీరంమీద నగలు మాయం. గమనించి లబో దిబో మంది ఒక్కసారిగా.

మంటపం దాటి అవతలకు నడిచింది శైలజ. ఇంకొక్క పది అడుగులు వేస్తే రిక్షాలో పారిపోవచ్చు అనుకొంది.

"దొంగలు, దొంగలు, అమ్మాయిని చంపేసారు బాబోయ్!" అని అరుస్తూ ఆ గదిలో నుంచి బయటకి వురికింది సత్యవతి. పెళ్ళిపందిట్లో అందరూ నిశ్చేష్టులై పోయారు.

2

"ఇదే గదా పెళ్ళివారిల్లు?" అన్నాడు అవధాని సందేహంగా.

"అందుకు సందేహం యెందుకు? సీతాపతిగారి యిల్లు యిదే. పదండి పోదాం ముందుకు. పసందయిన విందుకు" అన్నాడు శర్మ ముందుకి నడుస్తూ.

డిటెక్టివ్ అవధాని లోపలికి నడపబోతూ యథాలాపంగా అక్కడ ఆగివున్న రిక్షాకేసి చూశాడు. ఆ రిక్షా అప్పారావుది.

"ఏమోయ్ అప్పారావు? బాగున్నావా, బండి యిక్కడ ఆపావేం? పెళ్ళికి వచ్చావా?" అని కుశలప్రశ్నలు వేశాడు అవధాని.

అప్పారావు రిక్షాస్టాండు అవధానివాళ్ళ ఆఫీసు దగ్గరే. అవధాని చాలాసార్లు అప్పారావు రిక్షా ఎక్కే ఎక్కడికన్నా వెళ్ళేవాడు.

"బాబయ్యా! తమరా. ఎవరో అమ్మగారు లోపలికి వెళ్ళినారు బాబు. అరగంటలో వచ్చేస్తానన్నారు. అందుకనే ఇక్కడ కూకున్నానండి" అన్నాడు అప్పారావు వినయంగా.

"సరే! మేం లోపలకి పోయొస్తాం" అని అప్పారావుకి చెప్పి పెళ్ళిపందిట్లోకి నడిచాడు అవధాని శర్మ అనుసరించాడు.

"అవిడ కూడా మనలా భోజనం చేసేసి వెళ్ళిపోయే బాపతు అయివుంటుంది. అందుకే తిరుగు ప్రయాణానికి రిక్షా సిద్ధంగా వుంచుకొంది" అన్నాడు శర్మ చేయబోయే భోజనాన్ని తలచుకుంటూ.

"ష్! నెమ్మదిగా మాట్లాడు. ఎవరైనా వింటే బాగుం

దదు. ఏదో ఈ ఏలూరులో మనం కాస్త పేరుమోపిన డిటెక్టివ్‌లం కాబట్టి. సీతాపతి ఈ పెళ్ళికి మనల్ని ఆహ్వానించాడు భోజనాలవేళ కూడా దాటిపోతోంది. నువ్వేమో ఆడదానిలా ఆరు గంటలకి ముస్తాబు తెమిల్చావు నడు నడు" అని విసుక్కున్నాడు అవధాని. శర్మ క్రాఫ్ సవరించుకొని ముందుకి నడిచాడు.

పెళ్ళిపందిట్లో వున్న జనం అంతా కంగారుగా పెళ్ళికూతురు వున్న గదిలోకి పరిగెత్తారు.

ఆ సమయంలో శైలజ గుమ్మం దాటబోతుంటే, "ఏమండీ!" అన్న పిలుపు వినిపించి చటుక్కున నిలబడిపోయింది.

"ఏమండీ! కాస్త యిక్కడ నిలబడి వచ్చిపోయేవాళ్ళ మీద ఈ పన్నీరు చల్లండి. నేను లోపలికి వెళ్ళి ఏం జరిగిందో చూసొస్తాను" అని శైలజ చేతిలో పన్నీరుబుడ్డి పెట్టి, హడావుడిగా లోపలికి పరిగెత్తింది పెళ్ళికూతురి చెల్లెలు విజయ.

"ఆహా! ఎంత బాగాచేస్తున్నాడు ఈ సీతాపతి పెళ్ళి.చాలా ఖర్చుపెట్టి వుంటాడు" అన్నాడు అవధాని చుట్టూచూస్తూ.

"దానికేం గానీండి ఆ పన్నీరుబుడ్డి పుచ్చుకొన్న అందాల సుందరిని చూశారా? ఆహా!" అన్నాడు శర్మ, శైలజకేసి చూస్తూ.

"ఆ! ఆ! గట్టిగా మాట్లాడకు. ఎవరన్నా వింటే కట్టె పుల్లెకి బదులు మనల్నే పొయ్యిలో పడేసి పెళ్ళివాళ్ళందరికీ విందు భోజనాలు వండుతారు" అన్నాడు అవధాని. శర్మ మౌనంగా శైలజ అందాలు తిలకించసాగాడు.

"అన్నీ బాగానే అలంకరించారు కాని టైము అవుతున్నా పెళ్ళిపందిట్లో సందడి కనపడదేం?" అన్నాడు అవ

థాని దిక్కులు చూస్తూ

"లోపలికి వెళ్ళి చూద్దాము" అన్నాడు శర్మ.

అవథాని లోపలికి నడిచాడు కుతూహలంగా. శర్మ మాత్రం అక్కడే ఆగిపోయి శైలజ అందాలు తిలకించ సాగాడు.

ఇంతలో సైరన్ ఊదుకుంటూ పోలీసు జీపు వచ్చి ఆగింది.

శైలజ గుండెలు దడ దడ కొట్టుకోసాగాయి. తప్పించుకొని పోదామని చూస్తుండగా శర్మ అడ్డుతగిలాడు.

"ఏంటి మేడమ్! కంగారుపడుతున్నారు!" అన్నాడు శర్మ.

"ఏంలేదండి! అర్జంటుగా బయటికి వెళ్ళాలి. అందాక యిదిగో యిక్కడ నిలబడి ఈ పన్నీరు వచ్చినవాళ్ళమీద చల్లండి" అని పన్నీరుబుడ్డి యిచ్చి, చీకట్లోకి నిష్క్రమించింది శైలజ.

శైలజ చేతిని అందుకున్నంత ఆనందంగా ఆ పన్నీరు బుడ్డిని అందుకొని టేబుల్ దగ్గర నిలబడ్డాడు శర్మ.

ఇంతలో బూట్లు టకటక లాడించుకుంటూ పోలీసులు, ఇన్‌స్పెక్టర్ గిరిబాబు వచ్చాడు.

"ఆపండి, ఆ వంగపండు రంగు చీర కట్టుకున్న అమ్మాయిని ఆపండి, శర్మా ఆపు" అని కేకలువేస్తూ అవథాని కేకలువేస్తూ అవథాని లోపలనుండి బయటికి పరిగెత్తు కొని వచ్చాడు. శర్మకి అసలు యేమీ అర్థంకాలేదు.

అవథాని బయటకి వచ్చి చూసేసరికి పన్నీరు పంచి పెట్టే సుందరి కనిపించడంలేదు. కోపం వచ్చింది అవథానికి.

"ఏం శర్మా! నా అరుపులు వినపట్టంలేదా? ఆ ఆడ

దొంగని యెందుకు వదిలిపెట్టావు?" అని శర్మని కసురు కొని.

"సార్! ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇప్పుడే యిక్కడ నుంచి వంగపండురంగు చీర కట్టుకొన్న ఒక ఆడదొంగ బయటికి వుడాయించింది. పెళ్ళికూతురి తల పగలగొట్టి, నగలు తీసుకొని ఆ మాయలాడి పారిపోయింది. పట్టుకోండి" అని అరిచాడు అవధాని.

ఇన్‌స్పెక్టర్ గిరిబాబు ఆజ్ఞాపించగానే నలుగురు కాన్‌స్టేబుల్స్ బయటికి వురికారు.

ఇంతలో పెళ్ళికూతురి గదిలోకి వెళ్ళిన జనం అంతా బయటకి వచ్చి ఏం జరిగిందో ఇన్‌స్పెక్టర్‌గారికి వివరించి చెప్పసాగారు.

ఈ లోపున బయటకి వెళ్ళిన పోలీసులు వాడిపోయిన మొహాలతో తిరిగివచ్చి, ఆ "ఆడదొంగ" దొరకలేదని చెప్పారు.

"సార్!" శుభమా! అంటూ పిల్ల పెళ్ళిచేస్తుంటే ఈ అపశృతి ఏమిటండి? లక్ష రూపాయలు విలువచేసే నగలు ఆ దొంగ పట్టుకొనిపోయింది. పెళ్ళిలో యిలాంటి సంగతి జరగడం శుభం కాదు. కనుక మీరు యెలాగయినా పట్టుకోవాలి సార్! ఆ దొంగని" అని ప్రాధేయపడసాగాడు సీతాపతి.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! నా దగ్గర తిరుగులేని సాక్ష్యం వుంది. ఆ ఆడదొంగ నా కిచ్చిన పన్నీరుబుడ్డి యిది. దీనిని నా కిచ్చి ఆ చిన్నది చీకట్లోకి చెక్కేసింది. దీనిమీద ఆమె వేలిముద్ర లుంటాయి. మీ రెగ్యులర్ కష్టమర్స్, అంటే పాత నేరస్థులవి ఎవరివన్నా అయితే తేలిగ్గా పట్టేయవచ్చు" అంటూ శర్మ తన చేతిలో వున్న పన్నీరుబుడ్డిని గిరిబాబుకి

యిచ్చాడు.

"ఉండండి. నాదో చిన్న అనుమానం" అని జనాంతికంగా అని విసురుగా బయటకి దూకి. కాసేపటికి నీరసంగా లోపలికి వచ్చాడు అవధాని. బయట రిక్షా అప్పారావు లేడు, అతని రిక్షానూ లేదు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ, అప్పారావనే మాకు తెలిసిన రిక్షా అతను కనిపించాడు ఇందాక. 'ఎవరికోసం వున్నావోయ్' అని నే నడుగుతే, 'ఎవరో లోపలనుంచి వస్తారని' చెప్పాడు. పెళ్ళి పూర్తిగా చూడకుండా అరగంటలో వచ్చేసే ఆ మహానుభావు లెవరా?" అని అనుకొన్నాను. బహుశా యిప్పుడు పారిపోయిన ఆ ఆడదొంగ ఆ అప్పారావు రిక్షాలోనే పారిపోయి వుండొచ్చు. కనుక అప్పారావును మనం వెతికితే సరి" అన్నాడు అవధాని ఆయాసంగా రొప్పుతూ.

"అదీ నిజమే. మనం రెండు కోణాల నుంచీ సమస్య పరిష్కరిస్తే సమస్య తేలిపోతుంది. మీరు ఆ రిక్షా అప్పారావుని పట్టుకొని, అతని సహాయంతో యెలాగైనా ఆ దొంగని పట్టుకోండి. నేను ఈలోపున ఈ పన్నీరుబుడ్డిమీద వేలిముద్రల సహాయంతో పాత నేరస్థుల వెవరివన్నా నేమో చూస్తాను" అని అవధానికి చెప్పి, పోలీసుల్ని తీసుకొని బయటికి నడిచాడు ఇన్‌స్పెక్టర్ గిరిబాబు హడావుడిగా.

ఇన్నాళ్ళకి ఇన్‌స్పెక్టర్ గిరిబాబు తమని డిటెక్టివ్‌లుగా గుర్తించినందుకు ఆనందపడుతూ బయటకి వురికారు అవధాని, శర్మలు.

3

హడావుడిగా తమ ఆఫీసు దగ్గరకి వెళ్ళేసరికి అక్కడే బీడీ కాలుస్తూ రిక్షాలో కునికిపాట్లుపడుతున్న అప్పారావు

కనిపించాడు.

"ఇదిగో అప్పారావు! యిందాక నీ రిక్షాలో వుడాయిం చింది ఒక ఆడదొంగ. దానిని పట్టుకోవాలి. ఇందాక దానిని ఎక్కడ దించావో అక్కడికి పద" అని ఒక్క ఎగురులో రిక్షా ఎక్కాడు అవధాని. అవధాని వెనకే తను కూడా రిక్షా ఎక్కి సర్దుకొని కూర్చొన్నాడు శర్మ.

"మీకు సాయం చేయటంకంటే నా కింకేం కావాలి బాబూ" అంటూ రిక్షా ఎక్కి శ్రీకృష్ణుడు రథాన్ని తోలి నట్టు, రిక్షాని లాగాడు అప్పారావు.

"అదే బాబు, ఆ అమ్మాయిగారు దిగిన యిల్లు" దూరంనుంచే ఆ యింటిని చూపించాడు అప్పారావు హుషా రుగా.

రిక్షాలో నుంచి ఒక్క ఎగురుతో క్రిందకి దూకి, ఆ యింటికి వెళ్ళి శైలజని బయటకి లాక్కొని వచ్చి. రిక్షా అప్పారావు సాయంతో సీతాపతి యింటికి తీసుకొనివెళ్లాడు అవధాని. అనుసరించాడు శర్మ.

శైలజ ఒంటిమీద వున్న నగలు సీతాపతి, తనవే అని ధృవీకరించాడు. శైలజ నేరం ఒప్పుకొంది.

ఇంతలో యిన్‌స్పెక్టర్ గిరిబాబు లోపలికి వచ్చాడు.

"నా కంటె మీరే ముందున్నారు. వేలిముద్రలు చూసే సరికి అవి పాత నేరస్థురాలు శైలజవని తేలింది. వెంటనే శైలజ యింటికి వెడితే చుట్టుపక్కలవాళ్ళు డిటెక్టివ్ అవ ధానిగారు వచ్చి శైలజని తీసుకొని వెళ్ళినట్టు చెప్పారు. నేను యిలా వచ్చాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గిరిబాబు.

"అయ్యా! ఇన్‌స్పెక్టర్‌గారు. ఫోన్ చేయగానే వచ్చి మీ సహాయం మాకు అందించినందుకు కృతజ్ఞతలు. అలాగే నేను పెళ్ళికి ఆహ్వానించగానే పెళ్ళికి వచ్చి, పోయిన

నగలు తిరిగి సంపాదించి తెచ్చినందుకు అవధానిగారికి, శర్మగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. రండి అమ్మాయిమీద అల్లుడిమీద అక్షింతలు వేసి ఆశీర్వదించండి'' అన్నాడు సీతాపతి వినయంగా.

"ఈ ఆడదొంగ శైలజని నేను పట్టుకొంటాను. వధూ వరుల్ని మీరు ఆశీర్వదించి రండి సార్!'' అన్నాడు శర్మ శైలజకేసి చూస్తూ.

"నువ్వా! అక్కరలేదు. ఇన్‌స్పెక్టర్‌గారు చూసుకొంటారు. మళ్ళీ నీకు ఏ అత్తరుసీసానో యిచ్చి వుడాయించ గలదు'' అన్నాడు అవధాని

వధూవరులను ఆశీర్వదించి సీతాపతిని ఒకసారి పోలీసు స్టేషన్‌కి రమ్మని చెప్పి, అవధాని, శర్మలకి మళ్ళీ కలుస్తానని చెప్పి శైలజని తీసుకొని బయటకి నడిచాడు ఇన్‌స్పెక్టర్ గిరిబాబు.

శైలజ వెళ్ళినవైపే చూస్తూ, అన్యమనస్కంగా వధూ వరులని ఆశీర్వదించి విందు భోజనం చేయటానికి నడిచాడు శర్మ. శర్మని అనుసరించాడు అవధాని హుందాగా. □

ఏంత లాయర్!

ఐ అబ్జెక్షన్ యువరానర్! వాడి తరుపున ఇంతగా వాదిస్తున్నాడూ అంటే ఆ నేరంలో ఆనకూ ఏదో సంబంధం వుందన్నమాట!

నన్నుచంపినవాడు

'విపంచి'



"స్టిల్ ఐ లవ్ యూ వెరీమచ్ ప్రతిమా!" చెబుతుంటే గొంతు వణికింది సిద్ధార్థకి.

ఉవ్వెత్తున విరుకుచుపడిన ఓ అల తీరాన్ని తడిపేసి, మళ్ళీ వెనక్కి వెళ్ళి, సముద్రపుటొడ్డుతో దాగుడుమూత లాడుకొంటుంది.

శీతాకాలపు చలిగాలి విసురుగా వీచింది. ఆ గాలి విసురుకి ఇసుకరేణువులు ఎగిరివచ్చి మొహంమీద పడ్డాయి.

మొహంమీద పడబోయిన యిసుకరేణువులను అడ్డుకోవటానికి అరచేయి పైకెత్తి, మొహాన్ని తుడుచుకొంటూ, నవ్వింది ప్రతిమ. "ఇంక చెప్పొద్దు సిద్ధార్థా! ఆ ముక్క విని, విని విసుగు పుట్టుకొచ్చింది. గత పదినెలలుగా పాడుతున్న పాటేగా! ఎన్నాళ్ళిలా? ఎప్పుడు నీ జీవితాన్ని పంచుకుంటానా అని నేను ఆత్రుత పడుతుంటే, నువ్వేమటుకు రేపు, మాపు వాయిదాలు వేస్తూ, నెట్టుకొస్తున్నావు. మనం త్వరగా పెళ్ళి చేసుకోవాలి సిద్ధార్థా! ఇంట్లో సంబంధాలు వెదుకుతున్నారు" ప్రతిమ గొంతులో బాధ, భయం, క్రోధం—అన్నీ కలగాపులగంగా.

"ప్లీజ్, ప్రతిమా! ఇంకొంత కాలమాగు. ప్రతిరోజూ రేపటి భవిష్యత్‌మీద అపారమైన ఆశపెట్టుకొని, గడిపాయిన్నాళ్ళూ. ఉద్యోగం రాదు, మరొక జీవనభృతి లేదు. ఎంత కాలమిలా గడపాలో నాకైతే అర్థం కావటంలేదు. ఓ ఆధారం లేనప్పుడు నిన్ను ప్రేమ పేరుతో పెళ్ళి చేసుకొని, పస్తులుంచలేను. ఆలస్యమైతే అయ్యింది. కనీసం నాకింకో రెండునెలలు గడువివ్వు" లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకొని చెప్పాడు సిద్ధార్థ.

"సరే సిద్ధార్థా!" చిన్నగా తలపంకించింది ప్రతిమ. "అన్నయ్యకి నా మీద అనుమానముంది—నిన్నిలా ప్రేమిస్తున్నట్లు."

"ఏమైనా అన్నాడా?" ఆత్రుతగా అడిగాడు సిద్ధార్థ.

"డైరెక్టుగా అనలేదు గాని పరోక్షంగా హెచ్చరించాడు—ప్రేమా గీమా అని పిచ్చి పిచ్చి వేషాలు వేసే వాళ్ళని పాతిపెడతాడట."

"పాతిపెడతాడేం?!" కసిగా పళ్ళు నూరాడు సిద్ధార్థ. అతని ముఖం ఎరుపురంగులోకి తిరిగింది—అస్తమిస్తున్న సూర్యుడు తన చివరి కిరణాన్ని అతని ముఖానికే వదలేసి వెళ్ళిపోయాడన్నంత ఎర్రగా.

"నాకు తెలుసు ... తెలుసు మీ అన్నయ్య తత్వం! మీ అన్నయ్య అని వూరుకొన్నా గాని.... లేకపోతే" వేగంగా వూపిరి పీలుస్తూ, చెప్పాడు. "ద డే విల్ కమ్! అప్పుడు చూస్తా."

"అనవసరంగా రెచ్చిపోవద్దు సిద్ధూ!" సిద్ధార్థ వెర్రి ఆవేశం తెలిపిన ప్రతిమ మృదువుగా అతడ్ని వారించింది.

చాలాసేపటి వరకూ మౌనంగా వుండి పోయారు యిద్దరూ.

చేతి వాచీకేసి చూసుకొంది ప్రతిమ. ఏడున్నర! "ఇక వెళ్ళిపోదామా?" అడిగింది సిద్ధార్థని.

జవాబివ్వకుండా ఆమె బుగ్గలమీదికి వంగి, ఎడమ చెక్కిలిమీదున్న పుట్టుమచ్చని ముద్దుపెట్టుకొని, చెప్పాడు "వెళ్దాం!"

ఆ తర్వాత నడుస్తూ, ఇద్దరు రోడ్డుమీదికొచ్చారు.

"రేపు ఇంటర్వ్యూ వున్నట్లుంది?!" చప్పున గుర్తొచ్చి, అడిగింది ప్రతిమ.

"అవును! శిల్పా ఎంటర్ప్రైజెస్ వాళ్ళది. దాని మీదే ఆశపెట్టుకున్నా!" చెప్పాడు సిద్ధార్థ.

"ఐ విష్ యూ ఆల్ సక్సెస్ డియర్!" అతడి చేతిని మృదువుగా నొక్కి, చెప్పింది ప్రతిమ.

"థాంక్యూ!" గొణిగాడు సిద్ధార్థ.

"గుడ్ నైట్" చెప్పి వెళ్ళిపోబోయిన ప్రతిమని ఆపి, అన్నాడు సిద్ధార్థ "ఒక్క క్షణం!"

"ఏమిటి?" ఆశ్చర్యంగా చూసిందామె.

రోడ్డుకి కుడివైపున గులాబీల బుట్టని పెట్టుకొని అమ్ము తున్న పూలకుర్రాడి దగ్గరికెళ్ళి, ఓ అందమైన ఎర్రగులాబీ కొని తీసుకొచ్చి, ఆమె చేతికిచ్చాడు.

"ఈ రాత్రికి నా చిరుకానుకగా—" చెప్పాడు చిరు నవ్వుతో.

2

తన రూమ్‌కి వెళ్ళే సందు మలుపు దగ్గరున్న కిళ్ళీకొట్టు దగ్గిరికి రాగానే అలవాటైన కాళ్ళు ఆగిపోయాయి.

జేబులు తడుముకున్నాను సిద్ధార్థ. పైసా కూడా లేదు. జేబులో వున్న ఆఖరి పావలా ఆ గులాబీకోసం ఖర్చు పెట్టాడు. ఇక యివ్వాల్టికి భోజనం, సిగరెట్లు, అన్నీ బంద్!

"సిగరెట్ ఒకటివ్వు డబ్బులు తర్వాత యిస్తా!" అడిగాడు సిద్ధార్థ.

కిళ్ళీకొట్టతను మారుమాట్లాడకుండా "చార్మినార్" సిగరెట్ యిచ్చాడు సిద్ధార్థ చేతికి.

ఆ సిగరెట్‌ని కిళ్ళీకొట్టు ప్రక్కనే వున్న స్ట్రీట్‌లైట్ స్తంభానికి వ్రేలాడుతున్న కొబ్బరి తాడుతో వెలిగించు కొన్నాడు.

గాఢంగా దమ్ము పీల్చి, వదిలేసరికి, పోయిన ప్రాణం తిరిగొచ్చినంత హాయిగా వుందతనికి.

రూమ్‌వైపు నడిచాడు. రూమ్ తాళం తీస్తుంటే అడిగాడు యింటి యజమాని. "ఏమయ్యా సిద్ధార్థా? అద్దె యిచ్చేదేదన్నా వుందా లేదా? రెండు నెలలనుంచి బకాయి పెట్టేసావు."

"యిస్తానండి—యింటి దగ్గర్నుంచి డబ్బులు రావటం

ఈసారే ఆలస్యమైంది. ఇంకో రెండుమూడు రోజుల్లో వస్తుంది. రాగానే యిచ్చేస్తాను" తల దించుకుని గొణిగాడు అస్పష్టంగా.

విసుక్కుంటూ, వెళ్ళిపోయాడు యింటి యజమాని. "అద్దె యివ్వనివాళ్ళకి రూమ్ లెందుకూ? ఏ ఫుట్‌పాత్ మీదో కాపురం పెట్టొచ్చుగా!"

చురుక్కుమని తగిలిందా మాట సిద్ధార్థకి. అతను టూ సెన్సిటివ్. ఏ చిన్న విషయానికైనా యిట్టే చలించి పోతాడు.

కత్తి వుంటే 'కసుక్కున' పొడి చేసుకోవాలన్పించిందతనికి "ఓగాడ్!" తల విదిలించాడు.

రూమ్‌లోని మడతమంచం, నేలమీది చాప, ఆ చాపపై పుస్తకాలు, గది మూలగా వున్న వంట సామగ్రి, దండెం మీద బట్టలు వీటన్నింటిని తదేకంగా క్షణంసేపు చూశాడు సిద్ధార్థ.

అతనికి పిచ్చిపిచ్చిగా వుంది. ఏదోదో చెయ్యాలని వుంది డబ్బులు పంపించని తండ్రిమీద, అద్దెగురించి పీడిస్తున్న ఓనర్‌మీద తనకి తగిన వుద్యోగం చూపించని ఈ సమాజం మీద, వేరే సంబంధాలు వెదుకుతున్న ప్రతిమ అన్నయ్య కుమారస్వామి మీద—అందరిమీద, తనమీద తనకే కసిగా వుంది. అసహ్యమేస్తుంది. అందర్నీ వరస పెట్టి, కిరసనాయిల్ పోసి, తగలెట్టెయ్యాలన్పిస్తుంది.

కడుపులో ఆకలి మొత్తం శరీరాన్నే దహించేస్తుంది.

నీరసంతో గోడకి జేరగిల్లాడు సిద్ధార్థ. ఆలోచనలు మెదడుని బద్దలు చేస్తున్నాయి.

పూర్తిగా కాలిపోయిన సిగరెట్ పీకని గదిమూలకి విసిరికొట్టాడు.

ప్రొద్దున్న 'ఉడిపి హోటల్లో' తిన్న రెండు ప్లేట్ల యిడ్లీ, సాయంత్రం తాగిన గ్లాసెడు 'టీ' తప్ప, మరేమీ లేదు కడుపులో.

చాపమీద పడున్న పుస్తకాలకేసి చూశాడు.

రకరకాల కాంపిటీటివ్ ఎగ్జామ్స్, జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలవి.

ఒక్క క్షణం—ఆ పుస్తకాలన్నింటిని తూకాల లెక్కన అమ్మేసి, ఆ రాత్రి ఆకలి తీర్చుకోవాలనుకున్నాడు సిద్ధార్థ. అంతలోనే ఆ మరుసటి రోజున్న పరీక్ష గుర్తుకొచ్చింది. చదవాలి! తనీ పుస్తకాలు బాగా మథించి, రేపు ఆన్సర్ చేయగలిగితే—దేవుడి దయవల్ల వుద్యోగం వచ్చి-తల్చుకొనేసరికి, కలిగిన సంతోషంతో అతని గుండె నిండిపోయింది.

"ఉద్యోగం వస్తే యిక ఈ ఆకలి పస్తులుండవు. రోజుకో సిగరెట్ పెట్టె! ఇంటి యజమాని మొహంమీద మహారాజాలా అద్దె పడెయ్యవచ్చు ప్రతిమ తన జీవితాన్ని పంచేసుకోవటానికి వచ్చేస్తుంది ఈ గదిలోకి. అప్పుడు తను.... ప్రతిమ—ఆ పల్చటి చెక్కిళ్ళు, మృదువైన గులాబీరేకుల వంటి ఎర్రటి చిన్ని పెదవులు, ఆ పెద్ద పెద్ద నల్లకళ్ళు, ఆ శరీరంలోని వొంపుసొంపులు—ఈ గదిలో.. ఆనందం తన పాదాక్రాంతం!" భవిష్యత్ ఆశల లోకం లోకి వెళ్ళిపోయి, తాత్కాలికంగా ఆకలిని మర్చిపోయాడు సిద్ధార్థ.

ఆ హుషారులో 'మనోరమ ఇయర్ బుక్' తిరగెయ్యసాగాడు.

అతడు మర్చిపోయినా తను మర్చిపోనన్నట్లు కడుపులో చురకత్తిలా కదులుతూనే వుంది ఆకలి. నీరసం ముంచు

కొచ్చేస్తుంది. కనీసం 'బన్' తిని టీ త్రాగగలిగితే—?

ఎవరిస్తారు తనకి అప్పు? ఈ వూళ్ళో తనకి డబ్బులివ్వ గలిగే తెలిసిన మహాదాత లెవ్వరు?

సిద్ధార్థకి చప్పున స్ఫురించిందొక పేరు—ఆ పేరుతో తనకున్న పరిచయం. ఇస్తే అతనొక్కడే యివ్వాలి. అతని జేబు యెప్పుడూ వందరూపాయల నోట్లతో నిండి వుంటుంది. బాగా పరిచయస్థుడు! ఆ మాత్రం అప్పు యివ్వడా?

ఆ పేరు—కుమారస్వామి! తన క్లాస్‌మేట్.

ప్రతిమకి అన్నయ్య! సిద్ధార్థకి మిత్రుడు(?)!!

ఆ సమయానికి కుమారస్వామి ఎక్కడుంటాడో బాగా తెలుసు సిద్ధార్థకి.

రాత్రి ఎనిమిది గంటల తర్వాత పదకొండింటి వరకూ "బ్లూ నైట్" బార్‌లో—

3

"ఆట నాది!" చెప్పాడు కుమారస్వామి. టేబిల్‌మీద పేకముక్కలు పరుస్తూ.

ఓడిపోయిన వారందరి మొహాల్లో వోటమి తాలూకు బాధ చోటు చేసుకుంది.

"హలో, కుమార్!"

ప్రక్కకి తిరిగాడు కుమారస్వామి—ఆ పిలుపు విని.

సిద్ధార్థ!

అతడ్ని చూడగానే మొహం చిట్లించాడు కుమారస్వామి. ప్రతిమకి, సిద్ధార్థకి మధ్య నడుస్తున్న ప్రేమాయణం గురించి అతనికి బాగా తెలుసు!

సిద్ధార్థంటే అతని కేమాత్రం ఇష్టంలేదు. తన అయిష్టం బయటకు కనబడనివ్వక, ముఖానికి చిరునవ్వు పులుముకొని

అడిగాడు "ఏమిటిలా వచ్చావ్? నాతో ఏదన్నా పనుందా?"

"కొంచెం పక్కకొస్తే...."

"ష్యూర్!" అంటూ లేచివెళ్ళాడు కుమారస్వామి.

"రేపు శిల్పా ఎంటర్‌ప్రైజెస్ వాళ్ళ యింటర్వ్యూ వుంది. ఇవ్వాళ భోజనం లేదు. డబ్బు లేమన్నా బదులు యిస్తావేమోనని—ప్లీజ్ శ్రీరూపీస్! ప్లేటు భోజనం" దీనస్వరంతో గబగబా చెప్పాడు సిద్దార్థ.

చిన్నగా నవ్వాడు కుమారస్వామి. జవాబేమీ చెప్ప కుండా ప్రక్కనే వున్న 'రెస్టారెంట్ సెక్షన్'వైపు దారి తీశాడు.

కొత్తశక్తి ముంచుకొచ్చింది సిద్ధార్థకి. కాలేజీరోజుల్లో తనకెన్ని నిక్‌నేమ్స్ పెట్టి, ఏడ్పించనీ—చినిగిపోయిన తన చొక్కాను మరింత చింపేసి, కేరింతలు కొట్టనీ—తనవన్నీ మర్చిపోతా డిప్పుడు!

వాళ్ళు కుర్చీలలో కూర్చోగానే వచ్చి, అడిగాడు వెయి టర్. "ఏం తీసుకురమ్మంటారు?"

"ప్లేట్ చికెన్ బిర్యానీ. ఫిష్ కట్లెట్స్, ప్లేట్ ప్రాన్ ఫ్రై" చెప్పాడు కుమారస్వామి.

వెయిటర్ వెళ్ళబోతుంటే, వెనక్కి పిల్చి, చెప్పాడు కుమారస్వామి "రెండు ప్లేట్లు కాదు—ఒకటే!"

కొద్దిసేపటి తర్వాత వచ్చాయి.

వాటిని చూడగానే సిద్దార్థ కడుపులోని ఆకలి విజృం భించింది. నాలిక తడిచేసుకున్నాడు. కళ్ళు పెద్దవిచేసుకొనీ, ఆశగా, ఆబాగా వాటికేసి చూశాడు.

కుమారస్వామి శుభ్రంగా అన్నీ తినటం ప్రారంభిం చాడు లొట్టలేస్తూ.

కడుపు రగులుకుపోయింది సిద్ధార్థకి. ఏమనలేని నిస్స

హాయతతో ఆ పదార్థాలమీద నుండి చూపు మళ్ళించుకోవ టానికి ప్రయత్నించాడు.

"ఏమిటి సిద్ధార్థా? అలా ప్రక్కకు తిరుగుతున్నావేమిటి? ఇలా నా కేసి తిరిగి మాట్లాడవోయ్! ఇవ్వాళ ఫిష్ కట్లెట్స్ అద్భుతమైన రుచి! చికెన్ ముక్కలు కొరికితే కరిగిపోయేలా వున్నాయి! ఏమైనా 'బ్లూనెట్' రెస్టారెంట్ రెస్టారంటే! రొయ్యలవేపుడు బ్రహ్మాండం...." నోటితో పెద్దగా చప్పుడు చేస్తూ, తింటున్నాడు కుమారస్వామి. అతని కళ్ళు క్రూరంగా నవ్వుతున్నాయి.

చూస్తున్నకొద్దీ కడుపులో ఆకలిబాధ తీవ్రతరమై పోయింది సిద్ధార్థకి 'అందులో ఒక్క కట్‌లెట్ యిస్తే!' యెందుకో వెక్కి వెక్కి యేడ్వా లనిపించిందతనికా క్షణాన.

సిద్ధార్థ పడుతున్న చిత్రహింస చూసేసరికి మహదా నందం కలిగింది కుమారస్వామికి. మనుషుల్ని ఏడ్పించటం అతనికి సరదా!

కళ్ళమ్మట రాలబోతున్న కన్నీళ్ళని బలవంతంగా ఆపు కొన్నాడు సిద్ధార్థ. చటుక్కున లేచి బయటకు వెళ్ళి పోయాడు.

4

"గుడ్!" మెచ్చుకోలుగా తల వూపాడు ఇంటర్వ్యూ ఆఫీసర్.

నీరసాన్ని నింపుకొన్న సిద్ధార్థ కళ్ళు మెరిసాయి— వాళ్ళు అడిగినవాటన్నింటికి తను చెప్పిన జవాబులు వాళ్ళని పూర్తిగా సంతృప్తిపరచగలిగాయని గ్రహించాడు. వెంటనే సంతోషమేసిందతనికి. అంటే వుద్యోగం....

"యూ ఆర్...." మిగిలిన వాక్యాన్ని పూర్తిచెయ్య

బోయిన 'శిల్పా ఎంటర్‌ప్రైజెస్' బాస్ ఆగిపోయాడు—మ్రోగిన టెలిఫోన్ శబ్దం విని.

రిసీవర్ ఎత్తగానే ఖంగుమంటూ వినబడింది కుమారస్వామి గొంతు "సిద్ధార్థ అనే కేండిడేట్ యింటర్వ్యూకొచ్చాడు. అతనికి వుద్యోగం యివ్వొద్దు."

క్షణంసేపు సిద్ధార్థ ముఖంకేసి, టెలిఫోన్‌కేసి మార్చి మార్చి చూశాడు శిల్పా ఎంటర్‌ప్రైజెస్ యజమాని. కుమారస్వామికున్న పలుకుబడి, అతనితో ముమ్ముందు తనకున్న అవసరాలు అన్నీ గుర్తుకొచ్చి, సిద్ధార్థకేసి తిరిగి, చెప్పాడు "ఉయ్ ఆర్ గ్రేట్! యూ కెన్ గో!"

కాళ్ళు తూలిపోతుంటే, బయటికి నడిచాడు సిద్ధార్థ.

రోడ్డు మీద నడుస్తుంటే, దార్లో తారసపడ్డాడు కుమారస్వామి.

కుమారస్వామి నోటిలోని సిగరెట్‌కొన ఎర్రగా వెలుగుతోంది. "హలో సిద్ధార్థా!" పలకరించాడు—నవ్వుతూ.

సిద్ధార్థకి తెలుసు—ఇందాక వచ్చిన ఆ ఫోన్‌కాల్ కుమారస్వామే చేశాడని.... తనమీద చాలా గ్రాండ్‌గా కక్ష తీర్చుకుంటున్నాడీ బాస్టర్డ్. బ్రూట్, స్టుపిడ్, ఇడియట్, బ్లడీ రాస్కెల్, డర్టీ డెవిల్, సన్ ఆఫ్ ఏ బిచ్.... పెదాలు బిగించాడు సిద్ధార్థ.

చటుక్కున సిద్ధార్థ చేతిలోని ఫైలు లాక్కున్నాడు. అందులోని సర్టిఫికెట్లని అటూ—యిటూ తిప్పుతూ, "ఇవే కదూ నీకు ఉద్యోగం యిప్పించేది?" అంటూ వాటిని పరపరా ముక్కలు ముక్కలుగా చింపేశాడు.

ఊహించని ఈ సంఘటనకు తెల్లబోయాడు సిద్ధార్థ. "యూ బాస్టర్డ్...." ఆవేశంతో ముందుకి రాబోయాడు.

విసురుగా బూటుకాలుతో సిద్ధార్థ పొత్తికడుపులో తన్నాడు కుమారస్వామి. "నా చెల్లెలు వెనక పడతావటరా రాస్కెల్? మీ యిద్దరి మధ్య డబ్బనే అడ్డుగోడ వుందన్న సంగతి మర్చిపోయి ప్రేమిస్తావా?! ఈ కుమారస్వామితో గొడవ పెట్టుకొని, అనవసరంగా నీకు నీవే....ఏమైతేనేం ఐ పిటీ యూ! నీ సర్టిఫికేట్లు గోవిందా....ఎక్కడికి పోయి చెప్పుకొంటావో చెప్పుకో!" కసిగా అన్నాడు కుమారస్వామి.

నిశ్చలంగా నిలబడిపోయాడు సిద్ధార్థ. అతని కళ్ళల్లో ప్రతీకార జ్వాల చెలరేగి, కళ్ళను ఎర్రగా మండిస్తుంది. పెదాలు అదురుతున్నాయి. పిడికిళ్ళు బిగించాడు "కుమారస్వామీ! తీర్చుకొంటా....నీమీద ప్రతీకారం తీర్చుకొంటా! డబ్బులేనివాడినని, శక్తి హీనుడ్ని అని....నా సర్టిఫికేట్లను చింపి, నా బ్రతుకుతో చెలగాట మాడతావా?! ఐ విల్ టీచ్ యూ!" పళ్ళు పటపటా కొరికాడు.

తన గదికి తిరిగి వచ్చాక బాగా ఆలోచించాడు సిద్ధార్థ.

కుమారస్వామిని చంపెయ్యాలి....ఎలా?? నవ్వින ఆ కళ్ళు వెలుపలికొచ్చేలా చంపాలి....అమ్మో తను చంపలేడు! డబ్బున్న ఆ రాక్షసుడ్ని ఏ విధంగా చంపుతాడు?!

తన జీవితాన్ని సర్వనాశనం చేసిన....వాడ్ని....వాడి వేలుతోనే వాడి కన్ను పొడవాలి! రాత్రివరకూ తీవ్రంగా ఆలోచిస్తుండిపోయాడు సిద్ధార్థ. అద్భుతమైన ఆలోచన రూపు దిద్దుకొంది అతని మెదడులో.

తను చచ్చిపోతాడు....కాదు కుమారస్వామిచేత హత్య చేయబడతాడు అలా ఆధారాలు సృష్టించి, వాడిని జైలుకు పంపి, ఉరివేయించి....ఓహ్!

వెంటనే బ్లూనైట్ బార్‌కి బయల్దేరాడు సిద్ధార్థ—తన పథకానికి తగ్గ ఆధారాల్ని ముందుగానే సృష్టించుకోవాలి!

5

"హలో బావా!"

"యూ డర్టీ రాస్కెల్! ఎవర్రా నీకు బావ! ప్రొద్దున్న బుద్ధిచెప్పినా నీ పొగరు అణగలేదన్నమాట" కోపంగా చూశాడు కుమారస్వామి.

"అదికాదు! మీ సిస్టర్ ప్రతిభను నేను ప్రేమించాను. పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఇవ్వవా?" నవ్వుతూ అడిగాడు సిద్ధార్థ.

ఆ బార్‌లోని వారందరూ వాళ్ళిద్దరికేసే చూస్తున్నారు- ఆసక్తితో.

"ఇవ్వటమా? నరికి పోగులు పెడతా నిన్నిపళంగా. ఏమనుకొంటున్నావో ఏమో?" విపరీతంగా రెచ్చిపోయాడు కుమారస్వామి.

ముందుగా అనుకొన్న విధంగానే కుమారస్వామి చేతిలో తన్నులు తిని, రూమ్‌కొచ్చేసాడు సిద్ధార్థ.

తనకి, కుమారస్వామికి గొడవలున్నట్లు ఆ బార్‌లోని వారందరికి తెలిసింది! చాలు—వాడ్ని ఉరికంబం ఎక్కించడానికి అది చాలు.

ఆ రాత్రి నిద్రపోలేదు సిద్ధార్థ-"ఎలా తను చచ్చిపోయి, ఆ నేరాన్ని కుమారస్వామి మీదికి నెట్టెయ్యాలి?"

పాత నోట్ బుక్కొకటి తీసి, పెన్నుతో పిచ్చిగీతలు గియ్యసాగాడు.

"ముందుగా డైరీలో వ్రాయాలి—కుమారస్వామి తననెలా బాధించింది. ఆఖర్న వ్రాయాలి 'చూస్తుంటే కుమారస్వామి నన్ను చంపేటట్లున్నాడు' అని. అప్పుడు డైరీ

సాక్ష్యం—కాకపోతే....ఎలా—ఎలా? ఆఁ, రేపు ప్రతిమని కుమారస్వామి 'టై' అడిగి తీసుకొంటాడు. ఆ 'టై' తో గట్టిగా పీకకి ముడేసుకొని, చచ్చిపోతాడు" ఉత్సాహం ముంచుకొచ్చింది సిద్ధార్థకి.

"సరిగ్గా.... రేపు రాత్రి పదింటికి తను చచ్చిపోతాడు. ఆ సమయానికి కుమారస్వామి 'బ్లూనైట్' బార్లో వుంటాడు. వుండకూడదు. వాడా సమయానికి వుండకూడదు. కుమారస్వామికి (ఆత్మ) హత్య జరిగిన సమయానికి ఎవిడెన్స్ వుండకూడదు. తను ఫోన్ చేసి, బయటికి రప్పిస్తాడు వాడ్ని —ఆ తర్వాత కొద్ది నెలలకే ఉరికంబానికి వ్రేలాడుతాడు నన్ను చంపిన హంతకుడు కుమారస్వామి" వెర్రిగా నవ్వాడు సిద్ధార్థ.

ఆ క్షణాన తనకి తెలియకుండానే ఒక దారుణమైన పొరబాటు చేసాడు సిద్ధార్థ.

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకే అతని రూమ్ ముందు ప్రత్యక్షమయ్యాడు కుమారస్వామి. తెల్లబోయాడు సిద్ధార్థ.

వచ్చి, రాగానే సూటిగా అసలు విషయంలోకి దిగిపోయాడు. "నీకెంత డబ్బు కావాలి? ప్రతిమని విడిచిపెట్టటానికి."

నవ్వాడు సిద్ధార్థ. "నువ్వెంత డబ్బిచ్చినా నాకక్కర్లేదు. నాక్కావల్సింది ప్రతిమ మాత్రమే."

క్రూరంగా చూశాడు కుమారస్వామి. "ప్రతిమని వదలకపోతే, తగిన ప్రతిఫలం అనుభవిస్తావు."

కుమారస్వామి స్వయంగా తన రూమ్‌లోకి వచ్చాడు. అవకాశం దొరికింది. చుట్టుప్రక్కల వాళ్ళకి ఈ విషయం తెలియాలి.

"ఒక్క క్షణం నన్ను ఆలోచించుకోనీ" అంటూ బయటకు వెళ్ళి, ఇల్లుగలాయనని పిల్చుకొచ్చాడు సిద్ధార్థ. "చూడండి, ఈయన నన్ను బెదిరించటానికొచ్చాడు" అంటూ.

అప్పుడు జరిగిన వాగ్వివాదాన్ని అంతా మౌనంగా విన్నాడా యిల్లుగలాయన.

"ఇల్లుగలాయన సాక్ష్యం కూడా తోడయ్యింది." నవ్వుకున్నాడు సిద్ధార్థ.

ఆ సాయంత్రం—

"ప్రతిమా! అర్జంట్‌గా ఒకసారి మీ అన్నయ్య 'టై' కావాలి."

"ఎందుకు?" ఆశ్చర్యంతో అడిగింది ప్రతిమ.

"ప్లీజ్! ఇంటర్వ్యూకి వెళ్ళాలి—సేల్స్‌మాన్ జాబ్‌కి. 'టై' వుంటే కొంచెం హుందాగా వుంటుందని" అందమైన అబద్ధాన్ని చెప్పాడు సిద్ధార్థ—కొంచెం నసుగుతూ.

రంగానికి అన్నీ సిద్ధమయ్యాయి. ఆచరణే తరువాయి.

రాత్రి పది గంటలకు తనింటికి దగ్గర్లో వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి 'బ్లూనైట్ బార్'కి ఫోన్ చేసాడు సిద్ధార్థ. "హలో కుమారస్వామీ! నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి. వెంటనే నా రూమ్‌కి రా" చెప్పి, ఫోన్ పెట్టేసాడు.

"వస్తాడు—వాడొచ్చే సమయానికి తన శవముంటుంది ఇంట్లో—వాడి అడుగుజాడలు...."

చుట్టూ అలుముకున్న చీకటికేసి చూస్తూ. చెప్పాడు సిద్ధార్థ "గుడ్‌బై టు ద వరల్డ్!"

* * *

తెల్లవారేసరికి—ఆ యింట్లో సిద్ధార్థ శవం—పీక పిసక బడి!

కుమారస్వామే హత్య చేసాడని నిరూపించబడే ఆధారాలు—అతని అరెస్ట్!

పగ తీర్చుకున్నాడు సిద్ధార్థ.

6

"యువరానర్! ముద్దాయి తన చెల్లెలు ప్రతిమని హతుడు సిద్ధార్థకి యివ్వలేదని, హతుడు ముద్దాయి కుమారస్వామి మీద కక్షగట్టాడు. చాలా తెలివిగా ముద్దాయిని చట్టబద్ధంగా ఉరితీయించడానికి బ్రహ్మాండమైన ప్రణాళిక వేసాడు.

అందులోని భాగమే హతుడి ఆత్మహత్య! ఆత్మహత్య చేసుకొని అది హత్య అని, హంతకుడు కుమారస్వామి అని లోకం నమ్మేలా సాక్ష్యాధారాలు సృష్టించి, మరణించాడు.

ఇదంతా 'ప్రీ—ప్లాన్డ్' అని నేను విన్నవించుకొంటున్నాను. దీనిని నిరూపించే ఏకైక సాక్ష్యం—ఇదిగో, ఈ నోట్ బుక్! ఈ నోట్ బుక్‌లో తన ప్లాన్‌ని స్పష్టంగా స్వదస్తూరీతో వ్రాసాడు హతుడు సిద్ధార్థ" జడ్జి చేతికి నోట్ బుక్ ఇచ్చి మిగిలిన తన వాదనని కొనసాగించాడు కుమారస్వామి తరఫు లాయర్.

"తనని చంపిన హంతకుడు కుమారస్వామి—" అని లోకం నమ్మాలని సిద్ధార్థ కోరిక! పాపం. నెరవేరలేదు. హతుడి ప్రణాళికలోని మిగిలిన భాగమే—సిద్ధార్థ చనిపోయిన సమయానికి కుమారస్వామి బార్‌లో లేకపోవడం సిద్ధార్థ రూమ్‌లో కుమారస్వామి వేలిముద్రలు. అడుగు

జాడలు సృష్టించబడలేదు.

"కావున నా క్లయింట్ అయిన ముద్దాయి కుమార స్వామిని కోర్టువారు నిరపరాధిగా గుర్తించి, విడుదల చెయ్యవలసిందిగా ప్రార్థిస్తున్నాను."

అమాయకంగా, దీనంగా చూస్తున్న కుమారస్వామి కళ్ళల్లో కొత్తజీవం—

కేసు కొట్టేసాడు జడ్జి.

* * *

"సిద్ధార్థ ఆత్మశాంతికి" తనకు తానే చెప్పుకొన్నాడు కుమారస్వామి ఆ రాత్రి ఒంటరిగా తన గదిలో కూర్చుని విస్కీ త్రాగుతూ.

"ఎలాంటి ప్లాన్ వేసాడు సిద్ధార్థ? చచ్చి, సాధించా లన్నట్లు. ఆ నోట్ బుక్ దొరకకపోతే....తనీపాటికి ఉరి కంబానికి వ్రేలాడుతుండేవాడు. తన అదృష్టం బావుంది-" ఆలోచిస్తూ ఆకాశంకేసి చూసాడు కుమారస్వామి.

వెన్నెల ఆహ్లాదకరంగా కురుస్తుంది.

చాలాకాలం క్రిందటి యిలాంటి వెన్నెలరాత్రే ఒకటి గుర్తుకొచ్చింది కుమారస్వామికి.

రెండు చేతులకేసి, ఆకాశంలో వెన్నెల కురిపిస్తున్న చంద్రుడికేసి మార్చి, మార్చి చూసాడు. "ఆరోజు ఆవే శంతో రెచ్చిపోయి, సిద్ధార్థ గొంతు నులిమి చంపేసాడు. ఆ తర్వాత భయపడ్డాడు తను—అనవసరంగా జైలు కెళ్ళ వలసి వస్తుందేమోనని. కాని హత్య చేసినా, నేరం తన మీదకి రాలేదు. పూర్ సిద్ధార్థ!"

వెన్నెల కుమారస్వామి మొహంమీద తారట్లాడు తుంది. □

హెటల్ సవేరా

మిస్ కె. మధుబాల

జంటనగరాలకు వారంరోజుల క్రితమే బదిలీ చేయబడ్డాను.

నేనొక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ని. మిత్రులందరూ నన్ను ఆప్యాయంగా ఇన్‌స్పెక్టర్ సుబ్బా అని పిలుస్తుంటారు. నా అసలుపేరు సుబ్బారావని ఈ పాటికి పాఠకులు ఊహించే వుంటారు.

హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరాలను విచిత్రంగా చూస్తూ సాయంత్రం సమయాల్లో అద్దెకొంపకోసం వెతకడం నాకు పరిపాటి అయిపోయింది. పెళ్ళయి రెండే

ళ్ళయింది. ఏదో యిల్లు కుదిరితే నా భార్యను తీసుకు రావచ్చు. ప్రస్తుతం హోటల్ సవేరాలో ఓ గది తీసుకుని కాలాన్ని గడిపేస్తున్నాను.

హోటల్ సవేరా మూడంతస్తుల భవనం. చాలా పెద్ద హోటల్. ప్రొప్రయిటర్ రమాకాంత్ నా కాలేజీమేట్. స్టేషనుకొచ్చి నన్ను కారులో తీసుకెళ్ళి, తన హోటల్లోనే వుండాలన్నాడు. ఎంత వద్దన్నా నా మాట వినలేదు.

ప్రొద్దుట తొమ్మిదిన్నరయింది. హోటల్ గదిలోంచి బయటకొచ్చి తాళం వేశాను. పోలీసు ఇన్స్పెక్టర్ యూనిఫామ్‌లో వున్నాను. పోర్టికోలోకి దిగేసరికి నన్నాఫీసులో దింపడానికి రమాకాంత్ కారు సిద్ధంగా వుంది. వెనుక సీటులో కూర్చుని తలుపు మూశాను. ఒక్కసారి నా కళ్ళు తళుక్కుమన్నాయి. గుండె దడదడ కొట్టుకుంది. మెరుపుతీగ లాంటి ఒక యువతి నా కళ్ళముందు నుంచి హోటల్లోకి వయ్యారంగా వెళ్తోంది. చాలా పొడుగైన విగ్రహం. పొడుగాటి స్త్రీలంటే నాకెంతో యిష్టం. పచ్చటి శరీరం. ఎంతో అందంగా జార్జెట్ చీర ధరించింది. మెళ్ళో ఏదో హారం మెరుస్తోంది. రెండు చేతులకూ గ్లవుస్ వున్నాయి. చేతిలో ఎర్రటి హేండ్‌బాగ్. కోలముక్కు. లిప్‌స్టిక్ పూసిన పెదిమలు, నల్లటి కళ్ళు. ఆమె నడుస్తూంటే మిస్ ఇండియా ఎర్ర తివాసీమీద అడుగులేస్తూన్నట్టు అనిపిస్తోంది. ఒక్కక్షణం ఆమె వెనక్కి తిరిగి నా వైపు ఓరగా చూపింది. డ్రయివర్ ఖాన్ కారుని పోనిచ్చాడు.

ఆనాటి రాత్రి తొమ్మిదయింది. సూటూ, బూటూ ధరించి హోటల్ సవేరా ఎయిర్‌కండిషన్డ్ డైనింగ్‌హాల్లో ప్రవేశించాను. కాలేజీమేట్ రమాకాంత్‌ని ఎంతేనా మెచ్చు

కోవాలనిపించింది డైనింగ్ హాల్లో ప్రవేశించేసరికి ఏ స్వర్గంలోనో అడుగెట్టినట్టనిపించింది. ఎక్కడా టేబుల్సు ఖాళీలు లేవు. ఫ్లోరసెంట్ దీపాలు ప్రకాశవంతంగా వెలుగు తున్నాయి. మెరుస్తూన్న యూనిఫామ్స్‌లో బట్లర్లు ఇటూ అటూ పరుగెత్తుతున్నారు. వైట్‌పాంట్లూ, వైట్ జాకెట్లు ధరించిన యువతులు సిగరెట్లు, చాక్లెట్లు అమ్ముతున్నారు. హాలుకి ఒక వైపునించి ఆర్కెస్ట్రా అమోఘంగా మ్రోగు తోంది. సమీపంలో జంటలు జంటలుగా ట్విస్టు డాన్సులో లీనమయిపోయి వానపాముల్లా కదులుతున్నారు. రమా కాంత్ నవ్వుమొహం నా కవుపించింది. చెయ్యూపాను. రమాకాంతుది చిన్న చెయ్యి. పచ్చగా పొట్టిగా వుంటాడు. చూడ్డానికి బొమ్మలా అవుపిస్తాడు కాని చాలా తెలివైన ధైర్యంగల వ్యాపారస్తుడు. ఒక్కోసారి రమాకాంత్‌కి కోపం వస్తే యేడడుగుల మనుష్యులు గజ గజ వణుకు తారు.

"సుబ్బూ, ఆలస్యంగా వచ్చావు. ఎక్కడా ఖాళీలేదు" అన్నాడు రమాకాంత్.

"డోన్ట్‌బాదర్!" అన్నాను మెల్లిగా.

"సుబ్బూ, నీకొక చిన్న ఐడియా ఇస్తాను. అటువైపు చూడు!"

రమాకాంత్ చూపించినవైపు చూశాను.

"సుబ్బూ, ఆ టేబుల్ దగ్గర రెండు కుర్చీలున్నాయి. ఒక కుర్చీలో మిస్ నీలా కూర్చుంది. ఆమె కెదురుగా వున్న కుర్చీని నువ్వెళ్ళి ఆక్రమించుకో. నీ పర్సనాలిటీ ఆమెను తప్పక ఆకర్షిస్తుంది. గుడ్‌లక్!" అన్నాడు రమా కాంత్.

"రమాకాంత్, నాకు పెళ్ళయిందన్న విషయం మర్చి పోతున్నావు" అన్నాను నవ్వుతూ.

"సుబ్బూ, నాకూ పెళ్ళయింది. పెళ్ళాంతో సుఖంగా కాపురం చేస్తున్నాను.ఇక్కడున్నప్పుడు వీళ్ళతో హాయిగా ట్విస్ట్ కూడా చేస్తూ వున్నాను" అన్నాడు రమాకాంత్ నవ్వుతూ.

రమాకాంత్ వీపుమీద తట్టి మిస్ నీలా కూర్చున్నవైపు అడుగువేశాను. ఆమె దగ్గరవగానే అనూంతంగా ఆగి పోయాను. ఏదో జ్ఞాపకం వస్తోంది. పొద్దున కారెక్కి తలుపు మూశాక నా కళ్ళను చెదరగొట్టిన యువతి ఆమె! ధైర్యం తెచ్చుకున్నాను. ఆమె ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ, "నే నిక్కడ కూర్చోడానికి మీకు అభ్యంతరం లేదనుంటాను" అన్నాను నవ్వుతూ

ఆమె నావైపు సూటిగా విసుగ్గా చూసింది. రెండు చేతులకు గ్లవుస్ వున్నాయి చెంచా. ఫోర్క్ అలాగే పట్టుకుని తింటోంది.

"మీరు పోలీసు ఆఫీసరు అనుకొంటాను," అందామె.

"అవును."

"క్షమించండి. దయచేసి మరో చోటకి వెళ్ళి కూచోండి."

"ఎక్కడా టేబుల్స్ ఖాళీగా లేవు."

"అదంతా నాకు తెలీదు. మీరు వెళ్ళకపోతే నేను భోజనం మాని వెళ్ళిపోతాను!" అందామె.

కోపంగా కుర్చీలోంచి లేచాను ఆమెవైపు క్షణకాలం రుసరుస చూశాను.

"మీరు ఇంతలా ప్రవర్తిస్తారనుకుంటే మీ టేబులు

దగ్గరకు వచ్చేవాడినికాదు. నిజం చెప్పాలంటే—యూ ఆర్ బ్రూటల్!" అన్నాను ఆగ్రహంతో.

"బ్రూట్స్‌తో బ్రూటల్‌గానే ప్రవర్తించాలి" జవాబిచ్చిందామె, నావైపు చూడకుండా.

డైనింగ్ హాల్లోంచి గబగబా బయటకు నడిచాను. రమాకాంత్ రూపం ఎక్కడా కనిపించనందుకు సంతోషించాను. ఈ డైనింగ్‌హాలు ఏదో స్వర్గమనుకున్నాను. కాని, ఈ అనుభవం నా భావాలను తారుమారు చేసింది. భోజనం చెయ్యాలనిపించలేదు. నా గదికి వెళ్ళిపోయాను. పస్తున్నాను. రాత్రంతా నిద్రపట్టక పరుపుమీద దొర్లుతూనే వున్నాను. మిస్ నీలా ఎందుకలా ప్రవర్తించింది? సాధారణంగా ప్రతిమానవుడూ మర్యాదకోసమైనా అభ్యంతరం లేదని చెప్తాడు. కానీ మిస్ నీలా నిర్లక్ష్యంగా, క్రూరంగా తన్ను తోసిపారేసింది. రాత్రంతా ఆలోచిస్తూనే వుండిపోయాను.

* * *

రోజులు గడచిపోయాయి. ఆ రోజు న్యూ ఇయర్ డే. మూడో అంతస్తులోవున్న బాల్‌రూమ్‌లో ట్విస్ట్ డాన్స్ రాత్రంతా సాగుతుందని రమాకాంత్ ముందే చెప్పాడు. అతని బలవంతాన బాల్‌రూమ్ గదిలో ప్రవేశించాను. పురుషులందరూ తెల్లటి సూట్లు ధరించారు స్త్రీలు రకరకాల డ్రెస్సుల్లో వున్నారు. ఒళ్ళంతా కనిపించే పల్చటి చీరలు, చేతుల్లేని జాకెట్లు. మెల్లిగా ఒక గుంపువైపు నడిచాను. ఇరవైమంది పురుషులం ఒకవైపు లైనులో నిలబడ్డాం. ఇరవై మంది స్త్రీలు మాకు ఎదురుగా

నుంచున్నారు.

"జంటిల్‌మెన్ అండ్ లేడీస్. నా చేతిలో ఇరవై కార్డులున్నాయి. మీలోని పురుషులందరూ కళ్ళు మూసుకుని ఒక కార్డు తీసుకోవాలి. అందుమీద ఒక నంబరుంటుంది. ఆ నంబరులో నిలబడ్డ స్త్రీతో మీరు ట్విస్ట్ డాన్స్ చెయ్యాలి. ట్రై యువర్ లక్!" అన్నాడు హోటల్ నియమించిన ఒక ట్విస్టు డాన్స్‌మాస్టర్. క్షణకాలం నా ఎదురుగా లైన్లో నిలబడ్డ యువతులవైపు చూశాను. తటాలున గుండె దడదడ కొట్టుకుంది. లైను మొదట్లో మిస్ నీలా అగుపించింది. ఆమెతో డాన్స్ చెయ్యవలసిన గతి పట్టకుండా కాపాడమని దేవుణ్ణి ప్రార్థించసాగాను. కార్డులు కళ్ళు మూసుకుని తీసుకున్నాం. నా కార్డుమీదున్న నంబర్ను చూడగానే తృళ్ళిపడ్డాను. నంబర్ వన్! అంటే మిస్ నీలాతో నేను డాన్స్ చెయ్యాలి!

"జంటిల్‌మెన్, విష్ యు గుడ్ లక్, కార్డుల మీదున్న నంబర్ని చూసి ఎదురు వరుసలో ఆ నంబరు ముందు నిలబడ్డ స్త్రీ వద్దకు నడవండి" అన్నాడు ట్విస్టు మాస్టర్.

పురుష లందరూ గబగబా ముందుకి వెళ్ళారు. కాస్సేపట్లో పంతొమ్మిది జంటలు రూపొందాయి. ఏం చెయ్యాలో తోచక అలాగే నిలబడి వుండిపోయాను. ఒంటరిగా నుంచున్న మిస్ నీలా నా వైపు కోపంగా చూస్తోంది.

"ప్లీజ్ ప్రొసీడ్! మీ పార్టనర్ అదుగో," అన్నాడు ట్విస్టుమాస్టర్. నా చేతిలో వున్న కార్డును అతని కందించి మెల్లిగా మిస్ నీలావైపు అడుగులేశాను. వెళ్ళి ఆమె ఎదు

రుగా నిలబడ్డాను. మెల్లిగా ఆమె చెయ్యిని పట్టుకున్నాను. చేతికి గ్లవ్ మెత్తగా తగిలింది. మిస్ నీలా చటుక్కున విదిలించుకుని దూరంగా జరిగింది.

"యూ పోలీస్ బ్రూట్, నన్ను మళ్ళా ముట్టుకోకు!" అరిచిందామె.

ఈసారి ఆమె తిట్టడం వింటే నాకు కోపం రాలేదు. ఈమె నన్ను యిలా యెందుకు తిడుతోంది? ఈమెకు నేను ఏ హానీ చెయ్యలేదు. ఈమె పిచ్చిదా? కనుక్కోవా లనిపించింది. నాలో క్యూరియాసిటీ రేకెత్తింది.

"మిస్ నీలా, మిమ్మల్ని రెండోసారి కలుసుకుంటుకుంటున్నాను. మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా బాధాకరంగా వుంది. మీ రెందుకిలా ప్రవర్తిస్తున్నారు?" అడిగాను.

మిస్ నీలా క్షణకాలం మాట్లాడలేదు. పైకి చూస్తోంది. మా సంభాషణ విని కొందరు వచ్చి సమీపంలో నిలబడ్డారు.

"పోలీసులంటే నాకు పరమ అసహ్యం," అందామె.

"ఎందువల్ల? వాళ్ళు మనుష్యులు కారా?"

"కారని నా అభిప్రాయం."

"అటువంటి అభిప్రాయం ఏర్పడడానికి తగిన కారణమేదైనా వుందా?"

"ఉంది. నేను మరువలేనిది. శాశ్వతంగా నన్ను నాశనం చేసిన సంఘటన!"

"ఏమిటది?"

"పదేళ్ళక్రితం. నా వయస్సప్పుడు పదహారేళ్ళు.

కాలేజిలో పి.యు.సి. చదువుతున్నాను. నా అందాన్ని చూసి అందరూ మురిసిపోయేవారు. ఒకనాటి సాయంకాలం కాలేజినుంచి యింటికొస్తూన్నాను. పేవ్‌మెంటుమ్మట నడుస్తున్నాను. ఇంకా చీకటి పడలేదు. కొంచెం దూరంలో వందలాది ప్రజలు గుంపులు గుంపులుగా వున్నారు. స్టీల్ హెల్‌మెట్లు ధరించిన పోలీసులు నా కళ్ళకు అపుపించారు. ఏదో అల్లరి జరుగుతోందని గ్రహించాను. వెనక్కి తిరిగి పోదామనుకున్నాను. కాని ఆ అదృష్టం నాకు లేకుండా పోయింది. పోలీసువాళ్ళు లాఠీలతో కొడుతున్నారు. జనం నలువైపులా పరుగెడుతున్నారు. పోలీసువాళ్ళు వాళ్ళను తరుముకొస్తున్నారు. నేనలాగే నిలబడిపోయాను. నా పక్కనుంచి పరుగెడుతున్న యిద్దర్ని ఒక పోలీసువాడు లాఠీతో గట్టిగా కొట్టాడు. కాని వాళ్ళిద్దరూ తప్పించుకుని పారిపోయారు. ఆ బలమైన లాఠీదెబ్బ నా కుడిచేతికి తగిలింది. వేళ్ళ ఎముకలు ఫ్రాక్చర్ అయ్యాయి. అంతవరకూ నిస్సహాయంగా నిలబడ్డ నాలో ఆగ్రహం విజృంభించింది. నా కోపాన్ని అపుకోలేక ఎడంచేత్తో జోడు తీసి కాన్‌స్టేబుల్ని ఫెడీఫెడీమని కొట్టాను. కాస్సేపట్లో మరికొందరు కాన్‌స్టేబుల్సు నామీద పడ్డారు. మరికొన్ని లాఠీలు నావైపు దూసుకువచ్చాయి. రక్తమయమయిన బట్టలతో నేలకూలిన పుస్తకాలమీద స్పృహతప్పి పడిపోయాను. నాకు మెలకువ వచ్చేసరికి హాస్పిటల్లో వున్నాను. కళ్ళు తెరవగానే అమ్మ కనిపించింది నన్నుచూసి వెక్కివెక్కి ఏడుస్తోంది. నా శరీరంమీద అనేకచోట్ల బాండేజీలున్నాయి. కుడిచేయి పూర్తిగా ప్లాస్టర్‌లో వుంది. ఈ స్థితికి నేనెందుకు వచ్చాను? అన్యం పున్యం ఎరుగని అమాయికపు యువతిని అయినా

నా కీ గతి పట్టింది. రోజులు గడిచిపోయాయి. విరిగిన ఏముకలు అతుక్కోలేదు. నాకు చావాలనిపించింది. కాని నేనెలాగేనా బ్రతికుండాలని అమ్మ ఏడుస్తూ కూర్చుంది. ఆమెకోసం బ్రతకటానికి నిశ్చయించుకున్నాను. మీ పోలీసు వారికి కళ్ళు లేవు ప్రకృతి యిచ్చిన నా అందాన్ని పోలీసు వాళ్ళు ధ్వంసం చేశారు. మిమ్మల్ని చూస్తే నే నెప్పుడూ అసహ్యించుకుంటూనే వుంటాను!"

మిస్ నీలా ఆగింది. ఆమెవైపే తదేకంగా చూస్తున్నాను. చటుక్కున కుడిచేతి గ్లవ్‌ని ఆమె తీసిపారేసింది. తన చెయ్యిని నావైపు చాచింది.

"చూడండి, వికృతమైన నా చెయ్యిని అందరూ చూడండి! ఒకప్పుడు ఎంతో అందంగా అగుపించిన వేళ్ళు యిప్పుడు నాకు లేకుండా పోయాయి. ఈ వికృత రూపాన్ని కప్పిపుచ్చడానికే గ్లవ్స్ ధరిస్తున్నాను" అందామె బాధతో.

మెల్లిగా ముందుకి జరిగాను. ఆమె కుడిచేతిని, వేళ్ళు లేక వికృతంగా వున్న ఆమె కుడిచేతిని నా రెండు చేతులతోటీ ఆప్యాయంగా పట్టుకున్నాను. ఆమె చేతివైపే చూస్తున్నాను. ఆమె చెప్పిందంతా మెదడులో తిరుగుతోంది. నా కళ్ళు నీళ్ళతో నిండాయి. మరుక్షణంలో నా కన్నీళ్ళు ఆమె చేతిమీదికి ధారలుగా రాలాయి. వేళ్ళులేని ఆమె చెయ్యిని నా హృదయానికి హత్తుకున్నాను. నా పెదిమలతో ముద్దెట్టుకున్నాను. ఆమె కళ్ళల్లోకి దీనంగా చూశాను.

"మిస్ నీలా, మీకు అన్యాయం జరిగింది. మన దేశంలోని,లోకంలోని పోలీసు వాళ్ళతరపున మమ్మల్ని క్షమించ

మని వేడుకుంటున్నాను. మేం గుడ్డివాళ్ళం కాదు. జంతువులం కాదు. ప్రజల క్షేమంకోసం అహర్నిశలూ పాటుపడ్డం మా విద్యుక్త ధర్మం. ఎప్పుడో మన ఊహాలకందని ఏ విధి మూలంగానో మీరు చిత్రించిన సంఘటన జరుగుతుంది. అది మేం చేసిన తప్పుగా భావించి క్షమించమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను" అన్నాను ఆవేశంతో.

మిస్ నీలావైపే చూస్తున్నాను. మిస్ నీలా ఎర్రటి పెదిమలమీద చిరునవ్వు రూపం దాల్చింది. ఆమె కళ్ళు నూతన కాంతులతో ప్రకాశిస్తున్నాయి. దూరం నుంచి ఆర్కెస్ట్రా మ్రోగుతోంది. ఆమె నా దగ్గరగా జరిగింది. ఆమె చేతులు నన్ను చుట్టేశాయి కాస్సేపట్లో నేనూ నీలా ట్విస్టులో నిమగ్నులమయి గతాన్ని మర్చిపోయాం. □

ప్రేమ దొంగలు!



మానభంగం

పునర్వసు

మూడు కప్పుల కాఫీ తాగి సిగరెట్ వెలిగించి పొగ పీలుస్తూ వకీలు విశ్వనాథం దినపత్రికను చూడ సాగాడు. వెనుక పేజీలో వున్న ఒక వార్తమీద అతని దృష్టి కేంద్రీకృతమైంది. ఆత్రంగా చదివాడు. కళ్ళజోడు చేత్తో పట్టుకుని సోఫాలో వెనక్కు వాలి, "కమలా!" అని పిలిచాడు.

వంటింట్లోంచి కమల వస్తున్నానని జవాబిచ్చింది. మెల్లిగా నడుస్తూ కాస్సేపట్లో అతనిముందు హాజరయింది. కీళ్ళనొప్పుల మూలంగా ఆమె తొందరగా నడవలేదు.

"కమలా, అమ్మాయికి ఇవాళ స్కూలుందా?" అడిగాడు వకీలు విశ్వనాథం.

"ఇవాళ లక్ష్మివారం. స్కూలెందు కుండదూ?" భార్య

ఎదురుప్రశ్న వేసింది.

"కొన్ని రోజులపాటు అమ్మాయిని స్కూలుకు వెళ్ళనివ్వకు."

"ఏమిటి విశేషం?"

"ఎవడో పిచ్చాడు పట్నంలో తిరుగుతున్నాడుట. అందమైన ఆడపిల్ల కనిపిస్తే బలాత్కారంగా యెత్తుకుపోయి నానా హింసలూ పెట్టి వదిలేస్తున్నాడు."

"మన పోలీసువాళ్ళు ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?" అడిగింది కమల.

"వాళ్ళు అతడి కోసం అన్వేషిస్తున్నారు. కమలా! అటువంటివాడు అంత తొందరగా దొరుకుతాడా?"

అప్పుడే జుట్టు విరబోసుకుని అమ్మాయి గదిలోకి వచ్చింది.

"తల దువ్వమ్మా. ఇవాళ స్కూలుకి తొందరగా వెళ్ళాలి" అంది విమల.

వకీలు విశ్వనాథం తన పెద్దకూతురువైపు క్షణకాలం చూస్తూ వుండిపోయాడు. విమల పొడుగ్గా సన్నంగా వుంటుంది. అచ్చంగా తల్లి పోలిక. విమల వయస్సు పదిహేనేళ్ళు. పెద్దమనిషయి ఆర్నెల్లు కూడా దాటలేదు. ఆమెలో విపరీతమయిన ఆకర్షణ వుంది.

అనివార్య కారణాల వల్ల 'కాంచన శిఖరం' ధారావాహిక సీరియల్ యీ సంచికలో ప్రచురించలేకున్నందుకు చింతిస్తున్నాం. వచ్చే సంచిక నుంచి యథావిధిగా ప్రచురించగలము. —సంపాదకుడు

"అమ్మాయ్, మీ నాన్నగారు స్కూలుకి వెళ్ళొద్దంటున్నారు."

"ఏం నాన్నా, యెందుకూ" అడిగింది విమల.

వకీలు విశ్వనాథం పేపర్ను కూతురి కందించాడు. అందులోని వార్తను చదవమన్నాడు. విమల దినపత్రికలోని వార్తను చదివి పెదాలు విరిచింది.

"నాన్నా వాడు నా దగ్గరకొస్తే బుద్ధి చెబుతాను. నువ్వు కొత్తగా కొన్న కాన్పూర్ లెదర్ చెప్పల్స్‌ని ఉపయోగిస్తాను" అంది విమల నవ్వుతూ.

"మనం జాగ్రత్తగా వుండడం మంచిది. ఒక వారం రోజులు స్కూలు మానేస్తే ఏమీ పోదు."

"పాఠాలు పోతాయి నాన్నా. ఎవడికో భయపడి మనం పనులు మానుకుంటామా?"

తల్లీ కూతురూ లోపలికెళ్ళారు. వకీల్ విశ్వనాథం మళ్ళీ దినపత్రికను చదవసాగాడు. స్వామీ అనంత గీతను గురించి చెప్పిందంతా చదవడంలో నిమగ్నుడయ్యాడు.

* * *

సాయంత్రం అయిదవవస్తోంది. విమల ఒంటరిగా స్కూలునుంచి యింటికి నడుస్తోంది. ఆమె నడుస్తూన్న వీధిలో జనసంచారం యెక్కువగా లేదు. చటుక్కున ఒక కారొచ్చి ఆమె పక్కనే ఆగింది తలుపు తెరవబడింది. బలంగా ఒక చెయ్యి ఆమెను కార్లోకి లాగింది. విమల గాభరాతో గజగజ వణుకుతోంది. ఏం చెయ్యాలో తోచలేదు. తాత్కాలికంగా ఆమె మెదడు పనిచెయ్యడం మానేసింది. కొంచెంసేపయ్యాక తేరుకుని ఆమె కుడివైపుకు చూపింది. కారు స్పీడుగా వెళ్తోంది. అతడు మౌనంగా కారుని పోనిస్తున్నాడు. వైట్ పాంట్, వైట్ స్లాక్

అపరాధ పరిశోధన పోటీ-197

[ఫలితాలు]

డిశంబరు '84 నెల "అపరాధ పరిశోధన పోటీ-197"కు సరియైన సమాధానాలు:

1. అనకాపల్లి.
2. తమిళనాడు.
3. పాకిస్తాన్.
4. బాంబు బెదిరింపులు.
5. మత విద్వేషం.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మార్చి '85 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ బి. అప్పారావు,
రిటైర్డ్ పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌స్పెక్టర్,
జాంపేట, పిచికా స్ట్రీట్,
రాజమండ్రి - 3.

(2) శ్రీ వి. శ్రీనివాస్,
ఎల్. ఐ. సి. ఆఫ్ ఇండియా,
హన్మకొండ - 506 101.

(3) శ్రీ బి. రాజేశ్వరమూర్తి, బి.ఏ., బి.కాం.,
కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్,
20/213, వారస్ పేట,
మచిలీపట్టణం - 521 002.

ధరించాడు. గుబురుగా పెరిగిన మీసాలు, గిరజాల జుట్టు, నల్లగా బలిష్టంగా వున్నాడు. కళ్ళకు గాగుల్స్ ఉన్నాయి. కారు ఊరుదాటి ఎక్కడికో వెళుతోంది. తన దుస్థితిని గ్రహించి విమల గట్టిగా అరవసాగింది. అతని యెడం చెయ్యి ఆమె మెడను చుట్టేసింది. వేళ్ళతో బలంగా నొక్కుతున్నాడు.

"నోర్మయ్! అరిస్తే పీక పిసికేస్తాను" అన్నాడతను.

విమల అరవడం మానేసింది. నిశ్శబ్దంగా కూర్చుంది. తండ్రి మాటలు ఆమెకు జ్ఞప్తికొస్తున్నాయి. తండ్రి చెప్పినట్టు స్కూలుకు వెళ్ళడం మానేస్తే బాగుండేది

సరుగుడు చెట్లకింద అతను కారునాపాడు ఇంకా చీకటి పడలేదు ఫర్లాంగ్ దూరంలో రోడ్డుంది. తలుపు తెరిచి ఆమెను కిందకి దిగమన్నాడు. ఆమె నడుం చుట్టూ చెయ్యిని పోనిచ్చి చెట్ల మధ్యకు తీసుకు వెళ్ళాడు. క్షణకాలం ఆమెవైపు పిచ్చిగా చూశాడు. విమల పావడా, ఓణీ ధరించింది. అతని చూపును భరించలేక ముఖాన్ని పక్కకు తిప్పుకుంది. అతను కాలుస్తూన్న సిగరెట్ పీకను దూరంగా విసిరాడు. ఆమె ఓణీని చటుక్కున పీకేశాడు. పావడా బొందును తెంపేశాడు.

"ప్లీజ్, నన్నేం చెయ్యకు. నన్ను పోనీయ్!" ప్రాధేయపడింది.

అతను ఆమెను బలంగా తోశాడు. విమల వెల్లకిలా నేలమీద పడింది.

"ప్లీజ్, నన్ను వదిలెయ్. నేను చిన్నపిల్లను" అందామె.

అతను ఆమెమీద వాలిపోయాడు.

* * *

శ్రీ వెంకటేశ్వరా వారి
సంక్రాంతి కానుకలు!

1.	లవ్ మాజిక్	శ్యాంబాబు	15-00
2.	రుద్రనేత్రం	N.S. నాగిరెడ్డి	15-00
3.	ప్రేమబంధం	ఎస్. భారతీదేవి	14-00

మా గతనెల విడుదలలు

1.	లిటిల్ మాష్టర్	శ్యాంబాబు	16-00
2.	అంగారక (అపన సీరియల్)	,, ,,	18-00
3.	ఇదెలా జరిగింది	N.S. నాగిరెడ్డి	16-00
4.	ప్రేమ వాహిని	ఎస్. భారతీదేవి	15-00
5.	అంతరిక్ష యాత్ర (అపన సీరియల్)	రమణశ్రీ	18-00

మీ ఆర్డరుతో పాటు అడ్వాన్సు పంపగలరు.

వివరాలకు :

శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్

మాజేటివారి వీధి, గాంధీనగర్,

విజయవాడ - 520003.

రాత్రి తొమ్మిది దాటింది సరోజ ఆమె తల్లితో సహా బస్టాప్ ముందు నిలబడింది బస్టాప్‌లో మరెవ్వరూ లేరు. బస్సులు రావడం లేదు కాన్వెంట్లో ఒక కారొచ్చి వాళ్ళ ముందాగింది. కారులో కూర్చున్నతను వాళ్ళవైపు చూస్తూ, "మీ రెక్కడికెళ్ళాలి?" అనడిగాడు.

"మైలాపూర్" అంది సరోజ తల్లి.

"మరో అరగంటదాకా బస్సులు రావు. వెనుక రోడ్డు మీద చెట్టు కూలిపోయింది. కారులో ఎక్కండి. మిమ్మల్ని మైలాపూర్‌లో దింపేస్తాను" అన్నాడతను.

తల్లి కూతురివైపు చూసింది. కూతుర్ని కార్లో ఎక్కమంది సరోజ ఎక్కింది. తల్లి ఎక్కేలోపల కారు ముందుకు దూసుకుపోయింది.

సరుగుడు చెట్లకింద కారాగింది. చుట్టూ చీకటి. సరోజ కారోంచి దిగలేదు. అత నామెను చెట్లక్రిందకు యీడ్చుకుపోయాడు సరోజ అరుస్తోంది. ఏడుస్తోంది. అతనామె చెంపలమీద వాయిస్తున్నాడు. సరోజ దొర్లుతూ నేలమీద పడిపోయింది. ఆమె ధరించిన పైజామా, కమీజులను అతడు పిచ్చిగా చింపి పక్కకి పడేశాడు.

అతను అమానుషంగా ఆమెను అనుభవించాడు. ఆమె అవయవాలలో చలనం లేదు. చీకటిలో నేలమీద రబ్బరు బొమ్మలా ఆమె పడుంది ఆ బొమ్మతో అతనికి కావాల్సినట్టు ఆడుకున్నాడు. సరోజ నిస్సహాయంగా కళ్ళు మూసుకుంది.

* * *

పోలీసు ఇన్‌స్పెక్టర్ జాన్ భయంతో రిసీవర్ని అందుకున్నాడు ఐ. జి. ఆఫ్ పోలీసు కంఠం అటువైపు నుంచి వినిపిస్తోంది.

అపరాధ పరిశోధన పోటీ-199

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-2-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '85 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల దేశంలో జరిగిన అతి పెద్ద దుర్ఘటన—?
   (భోపాల్ విషవాయువు, దేశ ప్రధాని హత్య)
2. 8వ లోక్ సభ ఎన్నికలలో రెండు నియోజక వర్గాలలో పోటీ చేసిన నాయకుడు—?
   (చరణ్ సింగ్, పి.వి. నరసింహారావు)
3. దేశంలో జరిగే హత్యలలో వీటి సంఖ్య ఎక్కువ—?
   (రాజకీయ హత్యలు, మతతత్వ హత్యలు)
4. వీరి విషయం ఏ ప్రభుత్వమూ పట్టించుకోవటం లేదు—?
   (అంగవికలురు, బిచ్చగాళ్ళు)
5. దేశ సౌభాగ్యానికి ఇవి పట్టుకొమ్మలు—?
   (పాడిపంటలు, భారీపరిశ్రమలు)

"ఇన్‌స్పెక్టర్ జాన్, ఏమిటి చేశావు?"

"ఇంకా పట్నంలో వెదుకుతున్నాం. సార్, అతడ్ని గురించి ఏమాత్రం న్యూస్ దొరకడం లేదు."

"ఇన్‌స్పెక్టర్ జాన్, ఏదో తొందరగా, చెయ్యాలి. రెండు రోజులు తిరిగేలోపల విమల, సరోజ అతనికి బలయిపోయారు. ఇలా మరికొన్ని సంఘటనలు జరిగితే ప్రజలు మనమీదికి దాడిచేస్తారు."

"యస్ సార్" అన్నాడు జాన్.

* * *

సాయంత్రం అయిదు దాటింది. సాయిబాబా రోడ్డుమ్మట రమ ఒంటరిగా నడుస్తోంది. చటుక్కున కారొచ్చి ఆమె పక్కనే ఆగింది. కారు తలుపు తెరిచి అతడామె చెయ్యి పట్టుకుని లోపలకు లాగాడు. ఆమె గింజుకోలేదు. అతని వైపోసారి నవ్వుతూ చూసింది. కారులో కూర్చుని తనే తలుపు మూసింది. అతను కారును శరవేగంగా పోనిస్తున్నాడు.

"ఎవరు నువ్వు?" అడిగిందామె

అతను జవాబివ్వలేదు.

"ఎక్కడికి తీసుకెళ్తున్నావ్?"

"కాస్సేపట్లో నీకే తెలుస్తుంది" అన్నాడతను.

కారు సరుగుడు చెట్లకింద ఆగింది. రమ తలుపు తెరుచుకొని కిందకు దిగింది. నలువైపులా నవ్వుతూ చూసింది. ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ అతనివైపు తిరిగింది. అతడు దగ్గరగా జరిగాడు ఆమె చీరను వస్త్రాపహరణ చింపబోయాడు. ఆమె అతనివైపు చిరునవ్వుతో చూసింది.

"మిస్టర్, నువ్వు నా చీరను అలా లాగడానికి ప్రయత్నించకు. నీకేం కావాలో చెప్తే సంతోషంగా యిస్తాను.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒకరూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటినెల కాపీలు, అటుతర్వాత ప్రతి జనవరి నెల కాపీలు వి.పి. ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు నెల్లుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి.పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్‌పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్‌పై మీ చిరునామా ముందు వుండే కొత్త నెంబరును గుర్తించ కోర్తాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

యిలా అమానుషంగా నువ్వు ప్రవర్తించనవసరం లేదు. నువ్వు చాలా అందంగా వున్నావు. నిన్ను చూసిన మరు క్షణంలోనే నా హృదయంలో యేదో ప్రేమ మొలకెత్తింది........."

"నిన్ను బలాత్కరిస్తాను!" అరిచాడతను.

"అది సాధ్యంకాదు. నేను మనస్ఫూర్తిగా నీ కంతా యిస్తాను. నన్ను నువ్వు బలాత్కరించలేవు" అందామె.

రమ అతని దగ్గరగా జరిగింది. తన చేతుల్తో అతడ్ని చుట్టేసింది. బలంగా కౌగలించుకుంది అతని పెదాలను ముద్దెట్టుకుంది.

అతనామెవైపు క్రూరంగా చూశాడు.

"నీ ప్రేమ నా కనవసరం. నన్ను ఎదిరించు! అరువు!" అన్నాడతను.

ఆమె చిరునవ్వుతో జవాబిచ్చింది.

"ఎందుకు అరవడం? నువ్వు నాకు కావాలి" అందామె.

అతడు అసంతృప్తితో ఆమెవైపు చూశాడు.

"రాజ్. నువ్వు ఎందుకిలా ప్రవర్తిస్తున్నావు?" అడిగిందామె.

"నా పేరు రాజ్ కాదు."

"నీ పేరు ఏదైనా నువ్వు నా కళ్ళకు రాజ్‌కుమార్‌లా కనిపిస్తున్నావు. నీకేసి చూస్తుంటే మన ప్రేమ బంధం యీనాటిది కాదేమో అనిపిస్తోంది. నువ్వు యీ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావు?"

ఆమె ప్రవర్తన అతనిలో విచిత్రమైన ఆలోచనలను రేకెత్తించింది. అతడు ఆమె ముందు నిలబడ్డాడు.

"యిలా యెందుకు ప్రవర్తిస్తున్నానో నీకు చెప్పనా?" అడిగాడతను.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-2-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '85 నెల సంచికలో ప్రకటిస్తాము. *

డిసెంబరు పోటీ ఫలితాలు

(1) డిసెంబరు '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఆటవికుడే నయం!

మతోన్మాదులంటే భయం!!

పంపినవారు: శ్రీ బి. రాజేశ్వరమూర్తి, కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్, 20/318, [illegible]రస్ పేట. మచిలీపట్టణం - 2.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

నేరస్తుల బృందం!

తుపాకీ బంధం!!

పంపినవారు: శ్రీమతి గరిమెళ్ళ రాజ్యలక్ష్మి, జూనియర్ లెక్చరర్, నియర్ మెహిదీపట్నం బస్ డిపో, హైద్రాబాదు-28.

"వినాలని వుంది" అందామె.

"నాకో చెల్లెలు వుండేది. అతి గారాబంగా దాన్ని చూసేవాడ్ని. ఎస్.ఎస్.ఎల్.సి. చదివేది. ఒకనాటి సాయంత్రం స్కూలుకి వెళ్ళి ఆమె యింటికి తిరిగి రాలేదు. ఎవడో దుష్టుడు ఆమె కన్యాత్వాన్ని దగ్ధం చేశాడు. మర్నాడు పొద్దుట బీచ్‌లో ఆమె పోలీసు వాళ్ళకు దొరికింది. హాస్పిటల్లో చేర్చారు. ఆమె ఒంటినిండా గాట్లున్నాయి. రెండు రోజులు తిరిగేలోగా ఆమె శాశ్వతంగా కళ్ళు మూసింది. వాడెవడో ఎవరికీ తెలియలేదు. అప్పట్నుంచీ నాకు పిచ్చిపట్టింది. ఏ యువతిని చూసినా నా చెల్లెలు గుర్తుకొస్తుంది. నా చెల్లెలు ఈ లోకంలో లేకుండా పోయింది ఈ యువతులను కూడా అదేగతి పట్టాలని నాలో కోర్కె ఏర్పడింది. వాళ్ళను యిక్కడకు లాక్కొచ్చి బలాత్కరిస్తూ వుంటాను" అన్నాడతను.

రమ లేచి అతని దగ్గరగా వెళ్ళింది. అతనివైపు నవ్వుతూ చూసింది

"మిస్టర్, నీ చెల్లెలు చాలా మంచిది. పువ్వులా ఆమె రాలిపోయింది. ఆమె చావును భరించలేక ఎక్కడ పువ్వు కన్పించినా నువ్వు తెంచేసి మట్టిలోకి విసురుతున్నావు. ఆమెకు జరిగిన అపచారం అనేకమందికి చేకూరుస్తున్నావు. దీనివల్ల నీ కసి యెలా తీరుతుందో నాకు అర్థం కావడం లేదు. నువ్వు లోకంలోని యువతులను నీ చెల్లెళ్ళుగా భావించు. వాళ్ళను కాపాడడానికి ప్రయత్నించు. అప్పుడు నీ చెల్లెలు ఆత్మకు శాంతి లభిస్తుంది."

అతను చటుక్కున మొహాన్ని కప్పేసుకున్నాడు. యిద్దరూ కారెక్కారు. కారు కదిలింది

"నీ పేరేమిటి?" అడిగాడతను.

శ్రీమహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

డిశంబరు విడుదలైనవి!

1. ప్రవంతి — మల్లాది వెంకటకృష్ణమూర్తి — 15-00
2. పెద్దలకు మాత్రమే — ,, — 20-00
   (శ్రీవారి శోభనం - సినిమాగా వస్తున్న నవల)
3. అగ్నిశిఖ — 'విహారా' లక్ష్మి — 18-00
   (డైరక్టు నవల)
4. వానకారు కోయిల — మున్నెం శారద — 25-00
5. అనురాగ సంగమం — అమూరి సావిత్రి — 16-00
   (ఆంధ్రజ్యోతి సీరియల్)
6. అగ్ని పరీక్ష — మాదిరెడ్డి సులోచన — 17-00
   చందు
7. నీకూ నాకూ పెళ్ళంట! — సోంబాబు — 15-00
8. కాష్మోరా — ,, — 25-00
   (పునర్ముద్రణ)
9. జీవితం ఏమిటి? — 'శుభ' — 25-00
10. శాన్యోరా — ముద్దా సురేష్ — 20-00
   (అపన సీరియల్)

అడ్వాన్సు లేనిదే ఆర్డర్లు పంపబడవు

ఫోన్ నెం: 63322

శ్రీమహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరుపేట : : విజయవాడ - 2.

"రమాదేవి. నీ పేరో?"

"మోహన్‌కుమార్."

క్షణకాలం యిద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. కాస్సేపట్లో కారు పట్నంలోకి ప్రవేశించింది. తన యింటికి కొంచెం దూరంలో కారాపమంది. కారు దిగేముందు అతనివైపు నవ్వుతూ చూసింది.

"మోహన్‌కుమార్, ఆ కనిపించే యింట్లో నేనుం టున్నాను. మనం అప్పుడప్పుడు కలుసుకుంటూ వుందాం. నువ్వు కారిక్కడ ఆపి హారన్ కొడితే నేనొస్తాను" అందామె.

రమాదేవి బయటకు దిగింది. అతను కారును పోనిచ్చాడు.

* * *

ఇన్‌స్పెక్టర్ జాన్ సంతోషంగా రిసీవర్ని అందు కున్నాడు.

"ఇన్‌స్పెక్టర్ జాన్, మోహన్‌కుమార్‌ని పట్టు కున్నందుకు కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు ఐ.జి. ఆఫ్ పోలీసు.

"అతడ్ని పట్టుకున్న కీర్తి మిస్ రమాదేవికి దక్కు తుంది, సార్. ఆమె చాలా ధైర్యంగల యువతి. పి.యు.సి. చదువుతోంది. ఆమెను గురించి పూర్తి వివరాలు మీకు పంపుతున్నాను. ఆమెకు స్పెషల్ అవార్డ్ యివ్వాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జాన్. □

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd.no: H/HD-48
'X' PRABHAKAR